# మాడపాటి హనుమంతరావు

22.01.1885-11.11.1970



'ఆంధ్ర పితామహ' హనుమంతరావు తెలంగాణా
ఆంధ్రోద్యమ నిర్మాతలలో ప్రథమగణ్యుడు. ఆంధ్ర పితామహ
బిరుదాంకితుడు. రచయిత, వ్యాసకర్త,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విధానమండలి తొలి అధ్యక్షులు.
ప్రజాహిత కార్యసేవా తత్పరుడు.

సాహితీస్రవంతి

ఆంధ్ర పితామహ

# మాడపాటి హనుమంతరావు

( జీవిత చరిత్ర )

రచన :

డి. రామలింగం

ప్రచురణ :

ఆంధ్ర పితామహ

మాడపాటి హనుమంతరావు శతజయంతి ఉత్సవ సంఘం

హైదరాబాదు

# ప్రస్తావన

ఆధునికాంధ్ర నిర్మాతలలో అగ్రస్థానం అలంకరిస్తున్న మహనీయుడు. మహామనీషి ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారు. పూర్వపు హైదరాబాద్ సంస్థానంలో నిజాం నిరంకుశాధికారం నిరాటంకంగా కొనసాగుతున్న రోజుల్లో తెలంగాణ ప్రజలను మేల్కొల్పి, వారిని చైతన్య వంతులనుచేసి, వారిలో మాతృభాషాభిమానాన్ని, జాతీయ భావాలను రేకెత్తించి, తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సంస్కృతి వికాసానికి, తెలుగువారి అభ్యున్నతికి అపార కృషిచేసిన త్యాగధనులలో, ప్రజాసేవా పరాయణులలో ప్రప్రథమంగా పేర్కొనదగిన వారు మాడపాటి హనుమంతరావుగారు. ఆధునికాంధ్ర చరిత్రలో వారికి గల స్థానం సమున్నతమైనది. తెలుగు సంస్కృతి పునరు జ్జీవనంలోనూ, నవ్యాంధ్ర వికాసంలోనూ వారు నిర్వహించిన పాత్ర బహు ముఖమైనది, బహుధా శ్లాఘనీయమైనది. తెలుగుదేశంలో గ్రంథాలయోద్య మానికి తలమానికమైన శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం శ్రీ హను మంతరావుగారికి అత్యంత అభిమాన సంస్థ. ఈ సంస్థతో వారికి గల సాన్నిహిత్యం ప్రగాఢమైనది.

ఆంధ్ర పితామహ, పద్మభూషణ శ్రీ మాడపాటి వారి శతజయంతి ఉత్సవాలు యావదాంధ్రలో సముచితరీతిని నిర్వహించడానికి శ్రీకృష్ణదేవరా యాంధ్ర భాషానిలయ కార్యవర్గం నిర్ణయించి, భాషానిలయం అధ్యక్షులు శ్రీ అవ్వా సత్యనారాయణరావుగారి అధ్యక్షతన ఒక శతజయంతి ఉత్సవ సంఘం ఏర్పాటు చేయటం జరిగింది. హనుమంతరావు గారికి అభిమాన విషయాలపైన, వారు తమ జీవితంలో సాధించ దలచిన లక్ష్యాలకు సంబంధించిన అంశాలపైన చర్చాగోష్ఠులు, సభలు సమావేశాలు మొదలైన కార్యక్రమాలు జరపటంతోపాటు, వారి సంగ్రహ జీవిత చరిత్ర కూడా ప్రచురించవలెనని ఈ కమిటీ నిర్ణయించింది.

శతజయంతి ఉత్సవ సంఘం అభ్యర్థనపై ప్రముఖ రచయిత, సాహిత్య విమర్శకులు, శ్రీ డి. రామలింగం గారు ఈ కార్యభారాన్ని వహించి ఎంతో ప్రయాసపడి సమాచారం సేకరించి అత్యంత ఆసక్తిదాయకంగా, భావితరాల వారికి మార్గదర్శకం కాగల రీతిలో పంతులుగారి జీవిత చరిత్రకు అక్షర రూపం

కల్పించారు. శతజయంతి ఉత్సవ సంఘం పక్షాన వారికి నా హృదయపూర్వక అభివందనములు

రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ వారు ఈ గ్రంథ ప్రచురణకు దయతో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ శాఖ వారికి, ముఖ్యంగా సాంస్కృతిక వ్యవహారాలు, సమాచార శాఖ కమీషనర్ శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఎ. ఎస్. గారికి ఉత్సవ సంఘం పక్షాన నా మనః పూర్వక కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. ఈ కార్యక్రమం తలపెట్టినది మొదలు వారు చూపిన శ్రద్ధ, ఇచ్చిన చేయూత మేము ఎన్నటికీ మరువరానివి.

శ్రీ పంతులు గారితో అత్యంత సన్నిహితంగా పనిచేసిన సాహిత్యవేత్త, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు, భాషాభిమాని, సహృదయులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ కమీషనర్ అయిన శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్ గారు మా అభ్యర్థనను మన్నించి ఈ గ్రంథానికి వారి తొలిపలుకు, పరిచయ వాక్యాలు వ్రాసి ఇచ్చారు. వీరిరువురికి నా వందనాలు. ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు గారి శతజయంతి సందర్భంగా ప్రచురిస్తున్న పంతులు గారి ఈ జీవిత చరిత్రను ఆంధ్రావని ఆదరించగలదని ఆశిస్తున్నాను.

ఈ గ్రంథాన్ని అతిత్వరలో ముద్రించి ఇచ్చిన రమేష్ ప్రింటర్స్‌కు, ముఖచిత్రం వేసి ఇచ్చిన ప్రముఖ కళాకారులు శ్రీ గోలి శివరాం గారికి, ఈ కార్యక్రమంలో నాకెంతో తోడ్పడిన శతజయంతి ఉత్సవ సంఘం సభ్యులకు నా కృతజ్ఞతలు.

**ఎం. ఎల్. నరసింహారావు**
గౌరవ కార్యదర్శి,
ఆంధ్ర పితామహ
మాడపాటి హనుమంతరావు శతజయంతి
ఉత్సవ సంఘం.

హైదరాబాదు,
22-3-1985,
క్రోధన ఉగాది.

# మనవి

ఒకమారు నేను ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారిని 'ఆంధ్ర కుటీరము' లో దర్శించినప్పుడు "మీరు మీ ఆత్మకథ వ్రాయండి. ఆ గ్రంథం తరతరాల తెలుగు యువతీ యువకులకు ఉత్తేజం కలిగిస్తుంది" అన్నాను. అప్పుడు నేను 'గోలకొండ' దినపత్రికలో సహాయ సంపాదకుడిగా పనిచేస్తూ ఉండేవాణ్ణి. పోలీసు చర్య జరిగిన తర్వాత సంగతి ఇది. పంతులుగారు నా మాట శ్రద్ధగా విన్నారుగాని బదులు చెప్పలేదు. నేను వెంటనే "మహాత్ముడు కూడా తమ ఆత్మ కథ వ్రాసుకొన్నారు. మీరు తెలంగాణాకు మహాత్ముని వంటివారు. ఇక్కడ నిరంకుశ ప్రభుత్వ హయాములో శాంతియుతంగా ఒక మహోద్యమం నడిపారు. ఆ ఉద్యమం వల్ల ఇక్కడి ప్రజలలో ఎంతో చైతన్యం కలిగింది. ఉద్యమం ఆశయాలు నెరవేరాయి" అన్నాను. పంతులుగారు "మహాత్ముడెక్కడ !" అని నా అభ్యర్థనకు సమాధానం చెప్పకుండా ముభావంగా ఉండిపోయారు. స్వీయచరిత్ర వ్రాసుకోవడం వారికి ఇష్టం లేనట్లు వారి ముఖవైఖరివల్ల అప్పుడు నేను గ్రహించగలిగాను. ఇప్పటికీ వారి స్వీయచరిత్ర లేని కొరతను నాబోటి వాళ్ళంతా ఫీలవుతూనే ఉన్నారు. కొండా వెంకటప్పయ్యగారూ, ప్రకాశంగారూ, అయ్యదేవర కాళేశ్వరరావు గారూ వారి స్వీయ చరిత్రలను వ్రాసి తరతరాల ఆంధ్రులకు ఎంతో మేలు చేశారని విశ్వసించే వాళ్ళలో నేనొకణ్ణి చరిత్ర ప్రచారదృష్టితో కాక, యథార్థంగా ఏదో ఒక రూపంలో రికార్డు అయి ఉండాలి. మాడపాటి హనుమంతరావుగారు ఒకవేళ వ్రాసినా తమ కృషిని గూర్చి అంతగా వ్రాసేవారు కాదేమో అనికూడా నేను అనుకొంటూ ఉంటాను. వారు మాటలో మాత్రమే మితభాషి కాదు, వ్రాతలోకూడా మితము, మట్టు పాటించేవారు. విస్తృతి లేదు. సంక్షేపంగా వ్రాసేవారు. వేరొకరు వ్రాసి ఉంటే పంతులుగారు రచించిన 'తెలంగాణా ఆంధ్రోద్యమం' చరిత్ర అంతకు రెట్టింపు పుటల గ్రంథంగా వెలువడి ఉండేదనుకుంటాను. పంతులుగారు ప్రధానంగా కార్యవాది.

హనుమంతరావు పంతులుగారి శతజయంతి ఉత్సవాలు జరపాలని నిర్ణయం కాగానే ఒక రోజు మిత్రులు యం. యల్. నరసింహారావుగారు నాతో "మాడపాటివారి జీవిత చరిత్ర మీరు వ్రాయండి. శతజయంతి సందర్భంగా ప్రకటిద్దాము" అన్నారు. సరే అన్నాను. అన్నానే గాని తీరా పూనుకొనే సరికి ఇది కష్టసాధ్యమైన పని అనిపించింది. ఎందుచేతనంటే పంతులుగారి జీవిత విశేషాలను గూర్చి ఇతర ఆధారాలద్వారా తెలియ వచ్చేది చాలా తక్కువ. పంతులుగారిని గూర్చి ఒక మాదిరిగా తెలిపే పుస్తకం పూజ్యులు, నాకు గురుతుల్యులు శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారు పంతులుగారి 81 వ జన్మదినోత్సవం సందర్భంగా వారిని సన్మానించడానికి ఆంధ్ర ప్రముఖులు నిర్ణయించినప్పుడు రచించిన 'ఆంధ్ర పితామహ పద్మభూషణ మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర' ఒక్కటే. ఇతరులు పంతులుగారిని గూర్చి వ్రాసినవి పెద్ద వ్యాసాలు మాత్రమే. నా ఈ రచనకు ఆదిరాజు వీరభద్రరావుగారు వ్రాసిన పుస్తకమే ప్రధాన ఆధారం. దానినుంచే ఎన్నో అంశాలు, కథలు గాథలు తీసుకొన్నాను. పంతులుగారి జీవితంలో ముఖ్యంగా తొలి దశను గూర్చిన భోగట్టా ఆ ఒక్క పుస్తకంలో మాత్రమే లభ్యమవుతున్నది. ఇతరత్రా ఎక్కడా ఏమీ లభించదు. చెప్పేవారు ఇప్పుడు లేరు. అందుచేత ఆదిరాజు వారి పుస్తకం లేకపోతే ఇది వచ్చేది కాదు. పవిత్ర గంగాజలంలో నుంచి ఒక చెంబెడు నీళ్ళు ముంచి తీసుకొనే హక్కు ఎవరికైనా ఉందనుకుంటాను. ఇందుకు స్వర్గీయులు ప్రతిభాశాలి కర్మయోగి అయిన శ్రీ ఆదిరాజు వీరభద్రరావు గారికి కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను. ఆ తర్వాత పంతులుగారి 'తెలంగాణా ఆంధ్రోద్యమం' రెండు భాగాలూ, వారి సమకాలికుల వ్రాతలూ నాకు ముఖ్యాధారాలయ్యాయి. ఈ రచన చేయడానికి అంగీకరించిన తర్వాత నా వ్యక్తిగత జీవితంలో ఒక గొప్ప విషాద సంఘటన జరిగింది. నేను ఏకాకినైపోయాను. అయినా ఆ నష్టానికి తట్టుకొని నిలిచి ఈ పని పూర్తిచేసే మహా భాగ్యాన్ని నాకు కలుగజేసి నందుకు ఆ పరమేశ్వరుని కృపా కటాక్షములను మరొకమారు స్మరిస్తున్నాను.

నా ఈ పుస్తకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు దయతో తొలిపలుకు వ్రాశారు. పంతులుగారి వ్యక్తిత్వాన్నీ వారి కృషినీ బాగా ఆకళింపు చేసుకొన్న విజ్ఞులు వారు. యువకులుగా వారు తొలి రచన చేసినప్పటినుంచీ సాహిత్యకులుగా వారు అధిరో

హించిన శిఖరాలనూ, సాహిత్య సంస్థలద్వారా ఆంధ్ర వాఙ్మయాభివృద్ధికీ, వాఙ్మయ ప్రాచుర్యానికీ వారు చేసిన కృషిని పంతులుగారు సాక్షిగా గమనిస్తూ రావడమే గాక పలు సందర్భాలలో ప్రశంసకూడా చేసి ఉన్నారు. అట్లే రామానుజరావుగారు వారు రచించిన వ్యాసాలలో, పుస్తకాలలో సందర్భాన్ని బట్టి పంతులుగారి వ్యక్తిత్వాన్నీ వారి బహుముఖ సేవలనూ, కృషినీ ఎప్పటికప్పుడు మదింపు వేసి తమ అభిప్రాయాలను వ్రాసి ఉంచారు. అవి అమూల్యమైనవి. కనుక నా ఈ పుస్తకానికి తొలిపలుకు వ్రాయడానికి వారే తగిన వారని నేను అభిప్రాయపడ్డాను. మిత్రులు యం. యల్. నరసింహారావుగారు అడగగానే రామానుజరావుగారు వ్రాసి ఇచ్చారు. ఇందుకు వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ పుస్తకానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ కమీషనర్ శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఎ. ఎస్. గారు పరిచయ వాక్యాలు వ్రాశారు. వారికి నా కృతజ్ఞతలు.

ఈ పుస్తకాన్ని ప్రచురించిన ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారి శతజయంతి ఉత్సవాల నిర్వాహక సంఘానికి, ముఖ్యంగా యం. యల్. నరసింహారావుగారికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికీ నా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను, ఆంధ్ర పాఠకలోకం ఈ చిన్న జీవిత చరిత్రను ఆదరిస్తుందని ఆశిస్తున్నాను.

H. No. 1–8–726/30
నల్లకుంట, హైదరాబాదు–44
ఫిబ్రవరి 25, 1985.

**డి. రామలింగం**
రచయిత.

# పరిచయం

దేశ సేవను ఆదర్శంగా పెట్టుకొన్న వారిలో ఏదో ఒక రంగాన్ని ఎన్నుకొని కృషిసల్పి, ఆ రంగంలో ఉన్నత స్థాయిని అందుకొన్న ఉత్తములు అనేకులు మనకు కనిపిస్తారు. అయితే అనేక రంగాలలో అడుగిడి, అన్ని రంగాలలోనూ స్వార్థరహితంగా, సమర్థ వంతంగా తమ సేవలనందిస్తూ, ప్రతి రంగంలోనూ అగ్రస్థాయిలో నిలిచే ప్రముఖులు అరుదు. వ్రేళ్లపై లెక్కించదగిన అట్టి వారిలో స్వర్గీయ మాడపాటి హనుమంతరావు గారిని మొట్టమొదట పేర్కొన వలసి వుంటుందంటే అతిశయోక్తి కాదు.

చిన్నతనంలోనే లేమి అంటే ఏమిటో అనుభవ పూర్వకంగా అర్థం చేసుకొన్నారు వారు. జీవితం వడ్డించిన చేదు అనుభవాలను చవి చూశారు. గుమాస్తాగా జీవితాన్ని ప్రారంభించినా, వకీలుగా స్థిరపడి, స్వశక్తిపై అభివృద్ధిలోకి వచ్చారు. సంఘ సేవకుడిగా, జాతీయవాదిగా, స్వాతంత్ర్యయోధునిగా అనేక త్యాగాలు చేసి తమ బహుముఖ సేవల నందించారు, జాతికి. అనేక పదవులను – ముఖ్యంగా హైదరాబాదు నగర మేయరు, ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు అధ్యక్షత వంటి ఉన్నత స్థానాలను అలంకరించి, అందరి మన్ననలు అందుకొన్న ఆంధ్ర పితామహులు శ్రీ హనుమంతరావు గారు.

ఆయన అభిరుచి, కృషి, సేవ – ఏ ఒక్క రంగానికో పరి మితం కావు. ఆంధ్ర మహాసభ కార్యక్రమాలు, ఆంధ్రోద్యమం, ఆంధ్ర భాషా వికాసోద్యమం, స్త్రీ విద్య, గ్రంథాలయోద్యమం, వెట్టి చాకిరి నిర్మూలన, తాళపత్ర గ్రంథాలు, శాసనాలు మొదలయిన చారిత్ర కాధారాల సేకరణ, అస్పృశ్యతా నివారణ, వితంతు వివాహాలు, రజ స్వలానంతర వివాహాలు, బహుభార్యాత్వ నిషేధం, వేశ్యావృత్తి నిర్మూ

లన్, సహపంక్తి భోజనాలు, జంతుబలి నిషేధం, గ్రామీణ ఋణభార విముక్తికి కృషి, నీటిపారుదల, ఆబ్కారీ, అటవీ శాఖ మొదలైన వాటి పరిపాలనా విధానంలో, వాణిజ్య, వర్తక వ్యవస్థలలో మార్పులకై ప్రయత్నం, రైతు సమస్యల పరిష్కారానికి పూనిక, మతసామరస్యం – అది, యిది అని ఏమిటి – అనేక రంగాలలో ఆయన ప్రత్యేక ముద్ర ప్రభావం స్పష్టంగా, ప్రముఖంగా, అభినందనీయంగా కన్పిస్తాయి, ఆంధ్రప్రదేశ్ చరిత్ర పుటలపై. ఆయన చేయి పరుసవేది వంటిది. ఏ ఉద్యమంలో పాల్గొన్నా, ఏ కార్యక్రమం ప్రారంభించినా అది సక్రమంగా, విజయవంతంగా నెరవేరాల్సిందే. ఆయన పట్టుదల, నిరంతర కృషి, కర్తవ్యదీక్ష, కార్యదక్షత అలాంటివి.

హనుమంతరావు గారు ఉత్తమ రచయిత, కవి, సాహిత్య ప్రియులు, బహుభాషాకోవిదులు, చరిత్ర పరిశోధకులు, గ్రంథకర్త, రాజ్యాంగ నిపుణులు, ఇతర భాషా సాహిత్యాన్ని అందంగా తెనిగించిన అనువాదకులు. అన్నింటికి మించి ఆయన సౌజన్యశీలి, మృదుభాషి, పరోపకారి, అనురాగమూర్తి. ఒక్క మాటలో చెప్పాలంటే మరువరాని మనీషి.

తెలుగుతల్లికి తన బహుముఖ సేవలను అందించి, నవ్యాంధ్ర నిర్మాతలలో పేర్కొనదగిన నాయకులుగా అందరి ప్రశంసలు అందుకొన్న మాడపాటి హనుమంతరావు గారికి 'పద్మభూషణ్' వంటి బిరుదాలు, షష్టిపూర్తి ఉత్సవాలు చంద్రునికో నూలుపోగు వంటివి. ఆయనకు లభించిన గౌరవ సత్కారాలు, జాతి తనకు తాను చేసికొన్న సన్మానాలు.

ఆయన శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆ మహనీయుని జీవిత చరిత్రను చక్కని శైలిలో సమగ్రంగా అందించారు శ్రీ రామలింగంగారు. ఆయన చేయి తిరిగిన రచయిత. స్వయంగా జాతీ

యోద్యమంతో, నాయకులతో, సన్నిహిత సంబంధం కలిగిన ప్రముఖ జాతీయవాది. ప్రత్యేకంగా అభినందిస్తున్నాను వారిని ఇంతటి చక్కని కృషి సల్పినందుకు. శ్రీ మాడపాటి హనుమంతరావు శతజయంతి ఉత్సవ సంఘం వారు ఈ గ్రంథ రచనకు దోహదం చేకూర్చి, ప్రచురించి, తెలుగు పాఠక లోకానికి తమ అమూల్య కానుకగా సమర్పించటం ఎంతో అభినందనీయం.

ఆంధ్ర పితామహుని జీవిత గాథ, యథార్థంగా చూస్తే నవ్యాంధ్రప్రదేశ్ చరిత్రమే. అంతే కాదు, అది అనేక ప్రజా ఉద్యమాల చరిత్ర కూడ. ఇంతటి అమూల్యమైన గ్రంథానికి 'పరిచయం' వ్రాయమని నన్ను కోరిన మిత్రులు శ్రీ ఎం. ఎల్. నరసింహారావు గారికి, శతజయంతి ఉత్సవ సంఘ సభ్యులకు నా కృతజ్ఞతలు.

నాటి త్యాగమూర్తుల మహత్తర జీవిత విశేషాలను, అమూల్య సందేశాలను నేటి తరానికి అందించి, ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఉత్తేజాన్ని, స్ఫూర్తిని ఇచ్చే ఈ ప్రయత్నాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు శతజయంతి ఉత్సవ సంఘం కృషి జయప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

పి. వి. ఆర్. కె. ప్రసాద్
హైదరాబాదు ఐ. ఎ. ఎస్.
1-3-1985. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ కమీషనర్.

# తొలి పలుకు

అన్ని దేశాలలోను అన్ని కాలాలలోను నాయకులు ఎందరో ఉంటారు. కాని ప్రజల అభ్యుదయాన్ని లక్ష్యంగా పెట్టుకొని, దేశ సౌభాగ్యాన్ని తీర్చిదిద్దే మార్గదర్శకులైన మహనీయులు, త్యాగ మూర్తులు కొందరే ఉంటారు. ఈ కొందరి జీవితాలు అనుసరణీయాలు; వీరి జీవితాలు పఠనీయాలు. ఇటువంటి కొందరిలో స్వర్గీయ మాడపాటి హనుమంతరావు గారు చేరుతున్నారు. పూర్వపు నిజాం రాష్ట్రంలో అజ్ఞానం, పేదరికంలో మునిగిన తెలంగాణములో హనుమంతరావుగారు తమ జీవితాన్ని ప్రారంభించి దేశసేవకు, భాషాసేవకు నడుం కట్టినారు. ఈ శతాబ్ది ప్రారంభంలో హైదరాబాదు నగరాన్ని తన కార్యక్షేత్రానికి కేంద్రంగా స్వీకరించి తెలంగాణా సర్వతోముఖాభివృద్ధికి హనుమంతరావుగారు కృషి చేసినారు. ఈ కృషిని ఈతరం వారికి, భావితరానికి పరిచయం చేసే ఉద్దేశంతో హనుమంతరావు శతజయంతి ఉత్సవ సంఘం వారు యీ జీవిత చరిత్రను ప్రకటించడం సర్వవిధాల సముచితం.

ఆంధ్రోద్యమానికి, గ్రంథాలయోద్యమానికి ఇంకా అనేక దేశాభ్యుదయకరమైన ఉద్యమాలకు హనుమంతరావుగారు నాయకత్వము వహించి ఆ రోజులలో తెలంగాణమును మేలుకొలిపినారు. ఇప్పటి వరకు తెలుగులో వారి జీవిత చరిత్రలను, రచనలను ప్రకటించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగినవి. 1944 లో వారి షష్టిపూర్తి సందర్భంలో ప్రకటితమైన ప్రత్యేక సంచికలో ఒక వ్యాసం వ్రాస్తూ వారి ఆప్తమిత్రులైన స్వర్గీయ ఆదిరాజు వీరభద్రరావుగారు అప్పటివరకు మాత్రమే వారి జీవితాన్ని వ్రాసినారు. ఆ తరువాత– అనగా ఇటీవలి సంవత్సరాలలో శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిగారు రచించిన 'జాతి రత్నాలు' లోను, శ్రీ ఎం. ఎల్. నరసింహారావుగారు వ్రాసిన 'తెలంగాణా వైతాళికులు' లోను హనుమంతరావుగారి జీవిత చరిత్రలు ప్రకటితమైనవి. గడచిన సంవత్సరం 'ఆంధ్ర సారస్వత పరిషత్తు', హైదరాబాదు పక్షాన హనుమంతరావు గారి జీవితాన్ని గూర్చి ఏర్పాటు చేసిన ఉపన్యాసం త్వరలోనే ప్రకటితం కాగలదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి పక్షాన తెలుగు వైతాళికులు సంస్మరణ సభల వరుసలో హను

మంతరావుగారి జీవితాన్ని, దేశసేవ, భాషాసేవలను తెలియజేసే రెండు ఉపన్యాసాలను చేయించి పుస్తక రూపంగా ప్రకటించనైనది. అయితే హనుమంతరావు గారి జీవిత చరిత్ర గ్రంథరూపంగా రావలసి ఉన్నది. ఆ అవసరాన్ని తీర్చే ఉద్దేశంతో 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' ఏర్పాటు చేసిన శతజయంతి ఉత్సవ సంఘం యీ గ్రంథం ప్రకటించి సకాలంలో సరియైన పని చేసింది. ఇందుకు శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయాన్ని, భాషానిలయ కార్యవర్గాన్ని అభినందించ వలసి ఉన్నది. ఈ గ్రంథాలయ అభివృద్ధికి హనుమంత రావుగారు చేసిన కృషి గణనీయమైనది. అంతేకాదు, హైదరాబాదు నగరంలోను, తెలంగాణాలో అనేక ప్రాంతాలలోను అనేక విద్యా, వైజ్ఞానిక, సారస్వత సంస్థలను హనుమంతరావుగారు స్థాపించి వాటి పెంపు సొంపులకు కారణభూతులైరి. తెలంగాణాలో ప్రజా జీవితం పంతులు గారి కృషితోనే ప్రారంభమైనదన్న మాట నూటికి నూరు పాళ్లు సత్యం.

పరిమాణంలో చిన్నదైనప్పటికిని ఈ గ్రంథం మాడపాటి హనుమంతరావుగారి బహుముఖమైన కృషికి, ఉన్నత వ్యక్తిత్వానికి, ఉదార చరిత్రకు చక్కని ప్రతిబింబంగా ఉన్నది. తెలుగు తెలిసిన ప్రతివారు ముఖ్యంగా యువతీ యువకులు, అందులోను విద్యార్థులు తప్పక చదువదగినదీగ్రంథం. ఈ గ్రంథకర్త శ్రీ డి. రామలింగంగారు చేయి తిరిగిన రచయిత. సుమారు ముప్ఫై సంవత్సరాలకు పైగా సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలతో గాఢమైన సంబంధం కలిగి, బహుభాషలలో ప్రవీణుడై ఇంతకు పూర్వం అనేక రచనలు గావించిన సమర్థుడు. రామలింగంగారు సుబోధకమైన సరళ శైలిలో ఈ గ్రంథాన్ని రచించి తెలుగు భాషకు మరొక జీవిత చరిత్రను సమకూర్చినారు. ఇందుకు రామలింగం గారికి హార్దికమైన అభినందనలు. శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయం, శతజయంతి ఉత్సవ సంఘం ఈ సందర్భంలో చేసిన, చేస్తున్న కృషి ప్రశంసనీయం. సకలాంధ్రులకు అవశ్య పఠనీయమైన ఈ జీవిత చరిత్రకు సుస్వాగతం.

**దేవులపల్లి రామానుజరావు**
అధ్యక్షులు,
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి


హైదరాబాదు
21-2-1985.

ఆంధ్ర పితామహ

# మాడపాటి హనుమంతరావు

రచయిత :

డి. రామలింగం



ఆంధ్ర పితామహ

శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు

# జననం, విద్యాభ్యాసం, ఉద్యోగం

"హైదరాబాదు చరిత్రలో శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారికి ఉండేస్థానం ఇంకెవ్వరికీ ఉండదనే నా విశ్వాసం. హైదరాబాదు రాష్ట్ర ప్రజలలో చైతన్యం కలుగడానికి వారెక్కువ పనిచేశారని చెప్పుటలో నాకెట్టి సందేహంలేదు" అంటూ ఆంధ్ర మహాపురుషులలో ఒకరైన గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు ఒకానొక సందర్భంలో ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారి వ్యక్తిత్వమునకు విలువకట్టుతూ తమ అభిప్రాయం చెప్పారు.

తెలుగు భాష విస్మరింపబడిన తెలంగాణములో తెలుగుకు గౌరవస్థానం కలిగించి, ఇచటి తెలుగువారిలో 'మేము ఆంధ్రులము' అన్నభావాన్ని పెంపొందజేసి, తక్కిన అన్ని ప్రాంతాలకంటె అనేక విధాల వెనుకబడి ఉన్న తెలంగాణసీమలో ఆంధ్రోద్యమాన్ని ఆరంభింపజేసి, దానిని విజయవంతంగా నడిపి. ఎందరో యువకులను తమ ఉన్నతాశయములతో ప్రజాహిత కార్యదీక్షతో ప్రభావితులనుచేసి, వారపై నాయకత్వభారాన్ని ఉంచి చక్కని ప్రజాసేవకు ఒరవడిపెట్టి, గ్రంథాలయోద్యమము, సంఘ సంస్కరణము, స్త్రీ విద్యావ్యాప్తి, ప్రజాసేవారంగంలో స్త్రీల ప్రవేశం, సాంఘికోద్ధరణ, విద్యాప్రచారం, సాహిత్యవికాసంవంటి అనేక ఉద్యమాలను ఒక్కచేతిమీదుగా ఏక కాలంలో ప్రవర్తిల్లజేసి, ప్రజలలో సర్వతోముఖమైన జాగృతిని కలుగజేసి నిజాం రాష్ట్ర ఆంధ్రుల రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవనానికి కారకులై, ఇచటి ప్రజలచే అపూర్వమైన ఆదరాభిమానా

లతో ఆంధ్ర పితామహ, అని పిలువబడిన హనుమంతరావు పంతులు గారు ఆంధ్రుల చరిత్రలో శాశ్వత యశఃకాయులై నిలుస్తారు.

మహానదులు అవి పుట్టినచోట చాలా చిన్నవిగా ఉంటాయి. కాని పోనుపోను పెద్ద ప్రవాహంతో జీవనదులన్న పేరు పొందుతాయి. హనుమంతరావు పంతులుగారి పుట్టుకకూడా అంతే. వీరు శాలివాహన శకం 1806 తారణనామ సంవత్సర మాఘ శుద్ధ షష్టి గురువారంనాడు- అనగా క్రీ.శ. 1885 జనవరి 22 తేదీన కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పొక్కునూరు గ్రామంలో జన్మించారు. తండ్రి మాడపాటి వెంకటప్పయ్య గారు, తల్లి వెంకటసుబ్బమ్మగారు. మాడపాటివారు ఆర్వేల నియోగి శాఖకు చెందిన బ్రాహ్మణులు. ఆపస్తంబసూత్రులు. కౌశికస గోత్రికులు, వెంకటప్పయ్యగారు గ్రామాధికార పదవిని నిర్వహిస్తూ అతిధి అభ్యా గతులను సత్కరిస్తూ ధన్యజీవితం గడిపారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు తిరుమలరావు, రెండవ కుమారుడు హనుమంతరావు. వెంకటప్పయ్యగారు అకాలమరణం చెందడంచేతను, వీరిది కలిమిగల కుటుంబం కాకపోవడంచేతను తల్లి కొడుకులు కష్టదశ నెదుర్కో వలసి వచ్చింది. తండ్రి మరణించేనాటికి తిరుమలరావు వయస్సు 8, హనుమంతరావు వయస్సు 5. వెంకటసుబ్బమ్మగారు జమలాపురం వారింటి ఆడపడచు. ఈమెకు జమలాపురం వెంకటరావు, రామచంద్రరావు అనే ఇద్దరు సోదరులుండేవారు. వెంకటరావుగారు సూర్యాపేటలో తహసీలు కచేరీలో పేష్కారు ఉద్యోగంలో ఉండేవారు. వారి పోషణలోనే తిరుమలరావు, హనుమంతరావు పెరిగారు. సూర్యా పేటలో హనుమంతరావు సాతాని తిరునగరి నరసయ్య అనే ఉపాధ్యా యుని ప్రైవేటుబడిలో మూడేళ్ళు చదివారు. వెంకటరావుగారికి ఇబ్రాహీం పట్నం బదిలీకాగా వీరు అక్కడ కొంతకాలం చదువుకొన్నారు. ఈ గ్రామాలలో పై తరగతులకు చదివే పిల్లలకు తగిన పాఠశాలలు లేవు.

అందుచేత రెండవ మేనమామ రామచంద్రరావుగారు పేష్కారుగా ఉన్న నల్లగొండకు వీరు పంపబడ్డారు. అక్కడ ఉర్దూ, ఫారసీ, తెలుగు చదువుకొని 1898లో ఉర్దూ మిడిల్ పరీక్షలో ఉత్తీర్ణులైనారు. ఆ కాలంలో అదే పెద్ద పరీక్ష. మరి పై చదువులకు వెళ్ళాలంటే ఇంగ్లీషు అవసరం. అందుచేత హనుమంతరావు ఇంగ్లీషు నేర్చుకొని 1900లో ఇంగ్లీషు మిడిల్ పరీక్షలో కృతార్థులయ్యారు. తర్వాత హనుమకొండ లోని ఉన్నత పాఠశాలలో చేరి మద్రాసు విశ్వవిద్యాలయ మెట్రిక్యు లేషన్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అప్పుడు వీరివయస్సు 18 ఏండ్లు, దీనికి నాలుగేండ్లు ముందు పెద్ద మేనమామ, రెండేడ్ల ముందు చిన్న మేనమామ దివంగతులైనారు. కొంతకాలం అన్నగారైన తిరుమలరావు గారి సహాయంతో చదువు సాగించారు. తిరుమలరావుగారు వెర్రుపాలెంలో స్థిరనివాసమేర్పరచుకొని వకీలు వృత్తిచేసేవారు. వారికి బనిగండ్లపాడు గ్రామాధికార పదవికూడా ఉండేది. హనుమంతరావుకు కళాశాల విద్య అభ్యసించే అవకాశం లేకపోయింది. చదువు పూర్తి అయిన కొద్ది కాలా నికే వీరు తమ చిన్న మేనమామగారి కుమార్తె అన్నపూర్ణమ్మను వివా హమాడారు. 1904లో వరంగలుజిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నెలకు రూ. 40 వేతనంపై మీర్‌మున్షీ ఉద్యోగం లభించింది. అప్పుడు వీరి వయస్సు 19. ఎనిమిది సంవత్సరాలు హనుమకొండలో ఆ ఉద్యో గం చేశారు. అప్పుడు అక్కడ విద్యాశాఖ ఇనస్పెక్టర్లుగా ఉన్న శ్రీనివాసాచారి, హార్డీకర్ వంటి ప్రముఖులవద్ద వీరు దక్షతతో తమ ఉద్యోగ బాధ్యతలను నిర్వహించారు.

కాని ఈ గుమాస్తా ఉద్యోగం తమ వ్యక్తిత్వ వికాసానికి తగింది కాదని వారు గ్రహించారు. పైగా అది సంఘసేవకు ఆటంకంగా ఉంది. మొదటినుంచీ ప్రజాహిత జీవితంపై వారి దృష్టి ఉండేది. అందుకు

ప్రభుత్వోద్యోగం పెద్ద ప్రతిబంధకం. న్యాయవాద వృత్తివల్ల మాత్రమే ఏమిచేయడానికైనా స్వాతంత్ర్యం ఉంటుంది. ఆ కాలంలో హైదరాబాదులో 'లా' క్లాసులు నడుపబడుతూ ఉండేవి. వాటికి హాజరై వకాలత్ పరీక్ష ఇచ్చి ఎందరో న్యాయవాదులవుతూ ఉండేవారు. హనుమంతరావుగారు హనుమకొండ ఉద్యోగానికి సెలవు పెట్టి హైదరాబాదు వెళ్ళి 'లా' క్లాసులో చేరారు. సరిగా అప్పుడే నిజాం ప్రభుత్వ శాసన నిర్మాణ శాఖలో ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు భాషలలో ప్రవీణుడైన అనువాదకుడు కావలెనన్న ప్రకటన చదివి వీరు దరఖాస్తు పెట్టుకొన్నారు. పట్టభద్రులను కాదని వీరినే ఆ ఉద్యోగానికి ఎంపికచేశారు నెలకు రూ. 100 వేతన పై అయిదేండ్లు ఆ ఉద్యోగం చేశారు. శాసన నిర్మాణ శాఖాధికారిగా ఉన్న రాజాబహద్దర్ కృష్ణమాచారిగారు హనుమంతరావుగారి దక్షతను మెచ్చుకొనేవారు. శాసన అనువాదకుని విధులను నేర్పుతో నిర్వహిస్తూనే వీరు ఆ అయిదేళ్ళకాలంలో ప్రైవేటుగా వకీలు పరీక్షకు చదివి, వకాలత్ పరీక్షకు కూర్చొని దర్జే అవ్వల్ వకాలత్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, శాసన నిర్మాణశాఖ ఉద్యోగానికి 1917 లో రాజీనామా ఇచ్చి న్యాయవాద వృత్తిని చేపట్టారు. మొదట ప్రముఖ న్యాయవాదియైన రాయ్‌విశ్వేశ్వర్‌నాథ్‌గారి వద్ద ఒక సంవత్సరం జూనియర్‌గా పని చేశారు. రాయ్‌విశ్వేశ్వర్‌నాథ్‌గారు ఉత్తర భారతదేశం నుంచి వచ్చి హైదరాబాదులో స్థిరపడి వకీలుగా పెద్ద పేరు ప్రఖ్యాతులు గడించారు. తర్వాత న్యాయమూర్తి అయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవికూడా అలంకరించి రాజాబహద్దర్ బిరుదం పొందారు. జూనియర్‌గా అనుభవంగడించిన హనుమంతరావుగారు హైదరాబాదులో స్వతంత్రంగా ప్రాక్టీసు ఆరంభించారు.

# న్యాయవాది

హనుమంతరావుగారి జీవితంలో న్యాయవాదవృత్తిదశ 1917 లో ఆరంభమైంది ఈ వృత్తిని అవలంబించడంలో వారి ఉద్దేశం ఆ వృత్తిలో పైకివచ్చి వేలు లక్షలు గడించి హైకోర్టు న్యాయమూర్తివంటి ఉన్నతపదవిని పొందడంకాదు. ఆ వృత్తివల్ల కొంత జీవనోపాధి లభిస్తుంది. ముఖ్యంగా వాక్ స్వాతంత్ర్యం, కార్యాచరణ స్వాతంత్ర్యం ఉంటాయి. ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉంటుంది. ప్రజాసేవకు అవకాశమిచ్చే వృత్తి ఇది.

పంతులుగారు న్యాయవాదవృత్తిని కొంత జంకుతోనే ఆరంభించారు. ఆ రోజులలో హైదరాబాదు నగరంలో బారెట్లా, బి. ఎ. ఎల్. ఎల్ బి. పట్టాలతో, గదులనిండా పుస్తకాలతో, ఆడంబరంగా ప్రాక్టీసు చేసే లాయర్లు ఉండేవారు. వారు కోర్టులకు టాంగాలలో కార్లలో వెళ్ళి వస్తూ ఉండేవారు. అటువంటివారి మధ్య ఒక మెట్రికులేటు అవ్వల్ దర్జావకాలత్ పట్టాతో లాయర్‌వృత్తిలో నెగ్గుకు రావడం ఏటికి ఎదురీదడమే. అయితే పంతులుగారు అవలంబించిన పద్ధతివల్ల వారు ఆ వృత్తిలో నిలువగలిగారు. క్లయింట్లకోసం ఎదురుచూచే అవసరం వారికి లేకపోయింది.

వృత్తిలో వారు కేవలం నిజాయితీతో వ్యవహరించేవారు. కక్షిదారు ఒక కేసు విషయంలో తమను న్యాయవాదిగా కుదుర్చుకోవడానికి తమవద్దకు వచ్చినప్పుడు అతని పత్రాలను సాకల్యంగా చదివి అది తాము చేపట్టతగిన యోగ్యమైన వ్యవహారమని, అంతా సక్రమంగా

ఉందని తోచితేనే కేసును స్వీకరించేవారు. అందులో సారం లేకపోతే, లేదా దగాకోరు వ్యవహారంగా కన్పిస్తే ఆకేసును తీసుకొనేవారు కారు. ఇది కక్షిదారులకు బాగనిపించేదికాదు. అయినా పంతులుగారు తమపద్ధతి ప్రకారమే పోయేవారు. న్యాయమైన ఫీజే తీసుకొనేవారు. ఒకమారు ఒక కక్షిదారు వీరివద్దకు వచ్చాడు. వీరు అతని కేసునంతా పరిశీలించి "కేసులో పసలేదు. నీవు గెలువలేవు. ఇటువంటి వ్యవహారాలలో వకీళ్ళను పెట్టుకొని డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టడంకంటె అవతలి పార్టీతో రాజీపడి, వచ్చినంతవరకు రాబట్టుకోవడమే మేలు" అని హితవు చెప్పారు. కాని ఆ కక్షిదారు వీరి సలహా వినలేదు. పైగా ఈయన ఏమి వకీలు! అని పంతులుగారిని గూర్చి చాలా తక్కువ అంచెనాకూడా వేసు కొన్నాడు. వెంటనే మరొక వకీలు దగ్గరకు వెళ్ళాడు. ఆయన తన సంభాషణా చాతుర్యం ప్రదర్శించి, కేసు చేపట్టి ఫీజు బాగా లాగాడు. కాని ఫలితం సున్నా అయింది. అప్పుడతనికి పంతులుగారు చెప్పిన హితోక్తులు జ్ఞాపకమొచ్చాయి. వెంటనే మిఠాయి కొనుక్కొని పంతులు గారి వద్దకు వెళ్ళి పొట్లాన్ని వారి బల్లపై ఉంచాడు. పంతులుగారు సంగతేమిటని అడిగారు. "అయ్యా! మీరు చెప్పిన సలహా పాటించక కొన్ని వందల రూపాయలు ఖర్చుపెట్టాను. ఇప్పుడు నాకు జ్ఞానోదయ మైనది. కృతజ్ఞతాసూచకంగా నేను తెచ్చిన ఈ కానుకను స్వీకరించి నన్ను ఆనందపరచండి. తమవంటి వకీళ్ళు కొందరుంటే ప్రజలు బాగు పడి పోతారు" అన్నాడు. పంతులుగారు న్యాయవాద వృత్తిలో ఎల్ల ప్పుడూ వృత్తిధర్మంకంటె మానవ ధర్మానికే ఎక్కువ విలువఇచ్చారు.

ఒక కేసులో హనుమంతరావుగారి కక్షిదారుడు ఓడిపోయాడు. పంతులుగారికి మనస్తాపం కలిగి ఖిన్నులయ్యారు. తన లోపమేమిటని వితర్కించుకోసాగారు. కక్షిదారునికన్నా వారే ఎక్కువ బాధపడుతూ ఉన్నారు. ఇది గమనించిన న్యాయమూర్తి అక్బర్‌యార్‌జంగ్ బహద్దరు

పంతులుగారిని తమ చేంబరుకు పిలిపించుకొని కూర్చోనమనిచెప్పి "కేసు పోయినందుకు విచారిస్తున్నట్లున్నావు. ఈ వృత్తిలో జయాపజయాలు సహజమే. నీవంటి యువక న్యాయవాది అధైర్యపడకూడదు. ఈరోజు నీవాదం చక్కగానే ఉంది. గట్టిగాకూడా వాదించావు. కాని వాదప్రతి వాదాలే చాలవు. మేము న్యాయ సూక్ష్మాలను కూడా గమనించవలసి ఉన్నది. వాటినిబట్టి ఒక నిర్ణయానికివచ్చి తీర్పు చెప్పుతాము. కనుక కలిగిన అపజయానికి విచారింపక, ఆ న్యాయసూక్ష్మమేమిటో గ్రహించ డానికి ప్రయత్నిస్తే ఈవృత్తిలో రాణిస్తావు" అన్నారు. న్యాయమూర్తి తనవాదం చక్కగానే ఉన్నదని అంగీకరించినందుకు పంతులుగారు కొంతలో కొంత సంతృప్తి చెందారు.

ఒక కేసులో ప్రతివాదిపక్షాన హనుమంతరావు పంతులుగారు, వాదిపక్షాన మాదిరాజు రామకోటీశ్వరరావుగారు ఉన్నారు. వీరిద్దరూ ఆ తర్వాత నిజాం రాష్ట్ర ఆంధ్రమహాసభ అధ్యక్షులయ్యారు. ఇద్దరూ మితవాదులే. ఇద్దరికీ బంధుత్వం కూడా ఉంది. రామకోటీశ్వరరావు గారు హనుమకొండనుంచి వచ్చి పంతులుగారి ఇంట్లోనే బసచేశారు. ఇద్దరు వకీళ్ళు కలిసే కోర్టుకు వెళ్ళారు. అలా వెళ్ళుతూ ఉండగా పంతులుగారు తనవెంట తెచ్చుకొన్న 'నీలగిరి' పత్రిక సంపుటాలను తిరగవేస్తూఉంటే రామకోటీశ్వరరావుగారు "కోర్టుకు కూడా పత్రిక ఎందుకయ్యా- అక్కడా నీ సాహిత్యం గొడవేనా" అని వేళాకోళంగా అన్నారు. పంతులుగారు చిరునవ్వు తెచ్చుకొని మిన్నకున్నారు.—ఆ రోజు వాయిదాకు ప్రతివాది సాక్షులు రాలేదు. కనుక వాదిపక్షాన తీర్పు చెప్పవలెనని రామకోటీశ్వరరావుగారు కోర్టులో గట్టిగా వాదించారు. హనుమంతరావుగారు లేచి తన కక్షిదారు, అతని సాక్షులు పెనుతుపాను మూలంగా రాలేకపోయారనీ, మరొక వాయిదా ఇప్పించవలసిందనీ కోర్టువారికి మనవిచేసుకొన్నారు. అంతట రామకోటీశ్వరరావుగారు లేచి,

ఇదివట్టిసాకు. తుపానుకూ ప్రతివాదికీ ఏమీ సంబంధంలేదు" అని గర్జించారు. అంతట హనుమంతరావుగారు 'నీలగిరి' పత్రిక తీసి అందులో వర్ణింపబడ్డ తుపాను భీభత్సం వార్తను కోర్టువారికి చదివి వినిపించి, తన కక్షిదారు గ్రామంవదలడానికి ఎట్లావీలుకాకపోయిందో వివరించారు. కోర్టువారు వీరివాదంలోని నిజాన్ని గ్రహించి కేసు వాయిదా వేశారు. అప్పుడు రామకోటీశ్వరరావుగారు "బావా, ఇందుకా 'నీలగిరి' పత్రికలు తెచ్చావు. ఎంతమోసం చేశావయ్యా" అని మేలమాడారు.

హనుమంతరావుగారు న్యాయవాద వృత్తిలో అపజయం మాత్రం పొందలేదు. కలిగిన అపజయాలవల్ల మధ్యలో ఆ వృత్తిని వికనాడ లేదు. వారికి నెలకు రూ. 600 దాకా ఆదాయం వస్తూ ఉండేది. వీరి సౌజన్యము, సత్యశీలము కక్షిదారులనేగాక సాటి న్యాయవాదులనుకూడా ఆకర్షించేవి. న్యాయమూర్తులు వీరంటే మన్నన గౌరవం చూపేవారు.

హైదరాబాదులో అనేక న్యాయస్థానాలు ఉండేవి. ఇప్పటికీ ఉన్నాయి. అందుచేత ఒకే వకీలు అన్ని కోర్టులలో ఒకేసారి వ్యవహారం జరపడం సాధ్యంకాదు కాబట్టి పరస్పరం సన్నిహితులైన నలుగురు వకీళ్ళు ఒక గ్రూపుగా ఏర్పడి కేసులను తమలోతాము పంచుకొన్నారు. ఆ నలుగురు వీరు : కొండా వెంకటరంగారెడ్డి, మాడపాటి హనుమంత రావు, మందుముల రామచంద్రరావు, శ్రీనివాసరెడ్డి - ఈ వకీళ్ళు నలుగురిలో ఎవరి వద్దకు ఏ కక్షిదారు వచ్చినా ఆయన ఫీజు వగైరా నిర్ణయంచేసి ఆ వ్యాజ్యానికి సంబంధించిన కోర్టు న్యాయవాది వద్దకు పంపుతూ ఉండేవారు. ఈ పరస్పర సహకార సిండికేటు పద్ధతి అటు వకీళ్ళకూ, ఇటు వ్యాజ్యదారులకూ కూడా సౌకర్యవంతంగా ఉండేది. హనుమంతరావుగారు మాల్గుజారీవ్యవహారాలు (రెవిన్యూ బోర్డు కేసులు) వాదించే వకీలు, అని అప్పుడు నలుగురూ కలిసి నిర్ణయించారు.

పంతులుగారి న్యాయవాదవృత్తి దశలోనే వారి ప్రజాసేవాభిలాషకు తగు పునాదులు పడ్డాయని చెప్పవచ్చు. కక్షిదారులు వీరివద్దకు వచ్చినప్పుడు వారి వ్యవహారపు ముచ్చటలు ముగిసిన పిమ్మట పంతులుగారు వారితో నిజాం రాష్ట్రంలోని రాజకీయ, విద్యా, వ్యవసాయ, వాణిజ్య పరిస్థితులనుగూర్చి వారికి విడమరచి చెప్పుతూ, సాంఘికాభివృద్ధి విషయమై ప్రబోధంచేస్తూ ఉండేవారు. ఇట్టి ప్రబోధంవల్ల కక్షిదార్లు సాంఘిక రాజకీయ స్థితిగతులను అర్థంచేసుకొని ఆ తర్వాత అనేక ప్రజోద్యమాలలో పంతులుగారికి చేదోడువాదోడుగా ఉండి, సంఘసేవకులుగా దేశసేవకులుగా సిద్ధమైనారు. విద్యాధికులు కూడా పంతులుగారితో ఒకమారు సంభాషిస్తేచాలు, ఎంతో ప్రభావితులయ్యేవారు. "నేనూ కొద్దోగొప్పో చదువుకొన్నవాడినే. కాని శ్రీ హనుమంతరావుగారితో మాట్లాడిన తర్వాత నా విజ్ఞానం ఏపాటి అని నాకనిపించింది. ఆయనకెన్ని విషయాలు తెలుసు! ఎంత సునిశితమైన దృష్టి! ఎంత చక్కగా విడమరచి చెప్పారు!" అని ఒక విద్యావంతుడు ఆశ్చర్యం వెలిబుచ్చాడు. ఇట్లా పంతులుగారు పామరులలో, విద్యావంతులలో ఎంతో జాగృతి కలుగజేసి ఆనాటి హైదరాబాదు సంస్థానంలో ఉత్సాహం కలవారూ, సంగతిసందర్భాలు ఎరిగినవారూ ప్రజాసమస్యలను చేపట్టి, సంఘసేవకు పూనుకోవలసిన అగత్యాన్ని వారికెరిగించి ప్రజాసేవకు చక్కని బాటలు వేశారు.

ఈవిధంగా పంతులుగారు ఇటు న్యాయవాదులలోను, అటు అధికారులలోను రాజకీయ ఆర్థిక సాంఘిక, సాంస్కృతిక చైతన్యం కలుగజేస్తూ ఉండేవారు. ఆ రోజులలో ఐ.సి.యస్. అధికారి టాస్కర్ నిజాం రాష్ట్ర పోలీసు రెవిన్యూశాఖల మంత్రిగా ఉండేవారు. హనుమంతరావు గారికి ఆయనతో మంచి మైత్రి ఏర్పడింది. పంతులుగారు రెవిన్యూ కేసులు వాదించే వారు కదా. రెవిన్యూ మంత్రి అయిన

టాస్కర్‌గారి ఎదుటకూడా వారు కొన్ని వ్యాజ్యముల సందర్భంగా వాదించవలసి వచ్చేది. కోర్టువ్యవహారం ముగిసిన తర్వాత టాస్కర్ గారు పంతులుగారిని కూర్చోబెట్టి ప్రజావ్యవహారాలను గూర్చి సంభాషణ సాగించేవారు. పంతులుగారు ప్రజల సమస్యలను వారికి విశదంగాచెప్పి, ప్రభుత్వంవారి కార్యవిధానంలోని లోపాలను వారికెరిగించి, అధికారుల కర్తవ్యం ఏమిటో సూచించేవారు. ముఖ్యంగా ఆంధ్రోద్యమాన్నిగూర్చి పై వారికిగల అనుమానాలనూ అపోహలనూ తొలగింప యత్నిస్తూ ఉండేవారు. ఇట్లా న్యాయవాదిగా పనిచేస్తూ పంతులుగారు ప్రజోద్యమా లకు అధికార వర్గాలలో చక్కని పబ్లిక్ రిలేషన్స్ వ్యవహర్తగా కూడా పనిచేసి అధికారులలో ప్రజా ఉద్యమాలంటే సదవగాహన కలిగించ డానికి ప్రయత్నిస్తూ ఉండేవారు..

హనుమంతరావు పంతులుగారు న్యాయవాదులైన నాయకులను గూర్చి సున్నితమైన వ్యంగ్యంతో కూడిన చలోక్తులను విసురుతూ అప్పు డప్పుడు ప్రసంగించేవారు. వాటిలో ఒక ఛలోక్తి* "కొండావెంకట రంగారెడ్డిగారు న్యాయవాద వృత్తిని విజయవంతంగా కొనసాగించి అందులో రాణించినారు. నేను అతి కష్టంమీద నా షష్టిపూర్తివరకు ఈ వృత్తిని సంసార పక్షంగా లాగినాను. మందుముల నరసింగరావుగారు 7, 8 సంవత్సరాలు ఈ వృత్తిలో ఉండి నిరాశచెంది అది తమ చిత్త వృత్తికి గిట్టక వదలివేసినారు. ప్రతాపరెడ్డిగారు రెండు సంవత్సరాల అనుభవంలోనే వదిలివేసినారు. మా అందరికన్న రామానుజరావు ముందడుగు వేసినాడు. ఎల్ ఎల్.బి. డిగ్రీ తీసుకొని వృత్తికి కావలసి నటువంటి సౌకర్యాలు అన్నీ కలిగి ఉండి కూడా సనదు తీసుకోలేదు. కోర్టులో అడుగుపెట్టలేదు." ఈ ఛలోక్తిని తమ పుస్తకంలో రామానుజ రావుగారు ప్రస్తావిస్తూ తాము న్యాయవాద వృత్తిని చేపట్టకపోవడానికి కారణం హనుమంతరావు పంతులుగారి సలహాయేనని చెప్పాలి అన్నారు. విద్యావంతులైన యువకులు దేశసేవ, భాషాసేవ చేయాలనే ఉద్దేశంతో వారు ఇటువంటి సలహాలు ఇస్తుండేవారని చెప్పారు.

---

*'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు'—దేవులపల్లి రామానుజరావు.

# వ్యక్తిత్వ వికాసం

హనుమంతరావుగారి వ్యక్తిత్వ వికాసం హనుమకొండకు విద్యా సముపార్జన నిమిత్తం వచ్చినప్పటినుంచే మొదలైందని చెప్పవచ్చు. అది వరంగలు జిల్లాకు ముఖ్యపట్టణం. అప్పుడు ఖమ్మం కూడా వరంగలు జిల్లాలో ఒక భాగమే. హైదరాబాదు రాష్ట్రంలో వరంగలు ఒక సూబాగా ఉండేది. అంటే కొన్ని జిల్లాలుగల ఒక ప్రాంతం. ఆ ప్రాంతానికి వరంగలు కేంద్రం. విద్యాసంస్థలు, విద్యావంతులు, ప్రభుత్వ ఉన్నతోద్యోగులు నివసించే పట్టణమది. ఆ కాలంలో మూడు ఉద్యమాలు ప్రజలలో కొంత సంచలనం కలిగిస్తున్నాయి. ఒకటి ఆంధ్ర భాషోద్యమం. రెండవది కందుకూరి వీరేశలింగం పంతులుగారిచే ఆంధ్ర ప్రాంతంలో ఆరంభింపబడ్డ సంఘసంస్కరణోద్యమం. మూడవది భారత జాతీయ కాంగ్రెసు దినదినాభివృద్ధి చెందడంవల్ల దేశమంతటా వ్యాపిస్తూ వున్న రాజకీయచైతన్యం, రాజకీయోద్యమం.

ఆంధ్రమహాపురుషులలో అగ్రేసరుడూ, విఖ్యాత చరిత్రకారుడూ అయిన కొమర్రాజు లక్ష్మణరావుగారు హైదరాబాదువచ్చి ఆంధ్ర భాషా ప్రచారానికీ, విజ్ఞానవ్యాప్తికీ ఇక్కడినుంచే తమకృషిని ఆరంభించారు. క్రీ॥శ॥ 1900 లో- అంటే ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలో శ్రీకృష్ణదేవ రాయ భాషానిలయం హైదరాబాదులో స్థాపింపబడింది. 1907 లో లక్ష్మణరావుగారు హైదరాబాదులో విజ్ఞానచంద్రికా గ్రంథ మండలిని స్థాపించి తెలుగులో విజ్ఞానదాయకమైన గ్రంథములు ప్రచురింపసాగారు. 1904 లో హనుమకొండలో శ్రీ రాజరాజనరేంద్ర భాషానిలయం

స్థాపింపబడింది. ఈ మూడు సంఘటనలతో తెలంగాణాలో ఆంధ్ర భాషోద్యమం ఆరంభమైంది. హైదరాబాదునుండి హనుమకొండకు వచ్చే మిత్రులు భాషానిలయం కార్యకలాపాలను గూర్చి హనుమంతరావుగారికి చెబుతూ ఉండేవారు. వీరు ఆ నిలయంనుండి ఆంధ్ర గ్రంథాలు తెప్పించుకొని తమ మిత్రులతోపాటు చదివేవారు. కొమర్రాజు లక్ష్మణరావుగారి వ్యక్తిత్వంచేత, వారి భాషాకృషిచేత హనుమంతరావు గారు బాగా ప్రభావితులైనారు. ఆదిపూడి సోమనాథరావు, మైలవరపు నరసింహశాస్త్రిగారలు ఆ రోజులలో రచించి హైదరాబాదు సభలలో చదివిన ఆంధ్ర భాషాభిమాన పూరితాలైన పద్యాలు పంతులుగారిని ఎంతగానో ఆకర్షించాయి:

అచ్చతెనుంగుకబ్బమున కాదిపదంబయి పొల్చుభాగ్యమున్
హెచ్చుగగన్న దేశమిది యేదురదృష్టమొ యాంధ్రభాష నే
డిచ్చట సొంపునింపు చెడి హీనదశార్తిని గుందెనక్కటా
అచ్చపుటాంధ్ర పుత్రులకు నందరకున్ తలవంపులౌనటుల్

అంటూ ఆదిపూడి సోమనాథరావుగారు వ్రాసిన పద్యమూ—

ఘనులార! సత్యవర్తనులార! తనివార
మన్నించుడీ యాంధ్రమాతనెపుడు
దయులార! సద్గుణోదయులార! దయమీర
భూషించుడీ యాంధ్రభాష నెపుడు
హితులార! శ్రీయుతోన్నతులార! మితిమీర
వినుతించుడీ యాంధ్రవిద్యనెపుడు
నయులార! సజ్జనప్రియులార! మనసార
కరుణించుడీ యాంధ్రకాంత నెపుడు

పూజితామల సౌజన్య పూర్ణులార !
ధైర్య గాంభీర్యయుత మనస్థైర్యులార !
మానితాఖండ భాషాభిమానులార!
పూని పోషింపుడీ యాంధ్రసూనులార !

అని పండిత మైలవరపు నరసింహశాస్త్రిగారు చేసిన ప్రబోధమూ హనుమంతరావుగారిని ఆకట్టుకొన్నాయి. విజ్ఞానచంద్రికా గ్రంథమండలి తరపున ప్రచురింపబడ్డ మొదటి పుస్తకమైన 'అబ్రహాం లింకన్' చరిత్ర పీఠికలో కొమర్రాజు లక్ష్మణరావుగారు వ్రాసిన వర్తమానాంధ్రవాఙ్మయ పరిస్థితి పర్యాలోకనం పంతులుగారిని విశేషంగా ఆకర్షించింది. దానిని గూర్చి ఎంతోఉత్సాహంతో మిత్రులతో ముచ్చటించేవారు. ఆ గ్రంథాన్ని రెండవసారి ముద్రించేటప్పుడు ఆ సింహావలోకనాన్ని తీసివేసి ముద్రించి నందుకు చింతిస్తూ వీరు పత్రికాముఖంగా తమ అసంతృప్తిని వ్యక్తం చేశారుకూడా. ఈ గ్రంథమండలివారు ప్రచురించిన హిందూమహా యుగం, మహమ్మదీయ మహాయుగం, అను చరిత్ర గ్రంథాలు వీరిని ఉత్తేజపరిచాయి. తెలుగు భాషా సాహిత్యాలను అభివృద్ధిపరచవలసిన ఆవశ్యకతను వీరు గుర్తించారు.

ఆ రోజులలో విద్యావంతులైన యువకులను ఆకర్షించిన రెండవ ఉద్యమం సంఘ సంస్కరణోద్యమం. ఆంధ్రదేశంలో ఈ ఉద్యమానికి మూలపురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులుగారు. ఆయన సంఘసంస్కరణతోపాటు ఆధునికాంధ్ర వాఙ్మ యాన్ని తమరచనలచే ఎంతో సుసంపన్నం చేశారు. అంతేకాక స్త్రీ జనోద్ధరణకూ- ముఖ్యంగా స్త్రీలలో విద్యావ్యాప్తికి ఆయన కృషిచేసి, స్త్రీలకొరకు ప్రత్యేకంగా పుస్తకాలుకూడా వ్రాశారు. ఆయన ఆరం భించిన సంఘ సంస్కరణోద్యమం యావద్భారతములో సంచలనం

కలిగించడమేకాక వ్యక్తుల ఆత్మలను వికసింపజేసింది. ఆయన మూఢ నమ్మకాలను గర్హించాడు. ఏకేశ్వరోపాసనమును సమర్థించాడు. వితంతు వివాహములు, రజస్వలానంతర వివాహములు జరగవలె నన్నాడు. వేశ్యా వృత్తిని అరికట్టవలెనని ఉద్బోధించాడు. సంఘంలోని దురాచారాలను ఖండించాడు. సంఘీభావం, మతసహనం అవసరమన్నాడు. ఆయన ఉద్యమం హృదయంకలవారి నందరినీ కదలించింది. గ్రామాలలో, రచ్చ బండలవద్ద, వార్తాపత్రికలలోనూ, ఆ ఉద్యమాన్ని గూర్చి చర్చలు ముమ్మరంగా జరుగుతూ ఉండేవి. ఆ రోజులలో వార్తాప్రసార సాధనాలు లేకపోయినప్పటికీ ఆయన ఆరంభించిన ఉద్యమం దక్షిణదేశమంతటికీ తెలియవచ్చింది. పంతులుగారు రాజరాజనరేంద్ర ఆంధ్రభాషానిలయం నుండి వీరేశలింగంగారి రచనలు పది సంపుటాలనూ సంపాదించి చదివి ఆ మహనీయుని సందేశాన్ని జీర్ణింపజేసుకొన్నారు. ముఖ్యంగా ఖమ్మం మెట్టు తిరుమలరావుగారితో మైత్రికారణంగాకూడా సంఘ సంస్కరణో ద్యమం వీరిపై గాఢమైన ముద్రవేసింది. వీరేశలింగంగారి భావాలేకాదు, ఆయన వచన రచన శైలి కూడా వీరిని ప్రభావితంచేసింది. దానిని అనుసరించే సరళగ్రాంధిక రచన వీరికి అలవడింది. వీరేశలింగంగారు చెప్పిన స్త్రీ విద్యావ్యాప్తి, మతసహనం, సంఘీభావం అనేవి వీరి జీవితా నికి మార్గదర్శకాలై, ఆ తర్వాత తెలంగాణాలో వీరు ఆంధ్రోద్యమం నడిపినప్పుడు ఆ సూత్రాలను పూర్తిగా పాటించి ఉద్యమానికి బలం, చైతన్యస్ఫూర్తి, సాంఘికంగా అభ్యుదయ దృక్పథం ఆపాదింప జేయగలిగారు.

హనుమంతరావుగారు, భారతజాతీయ కాంగ్రెసు ఒకే సంవత్స రం—అనగా 1885లో పుట్టడం జరిగింది. పంతులుగారు పెరిగేకొద్దీ జాతీయ కాంగ్రెసు ఉద్యమంకూడ దేశంలో విస్తరించి ప్రజలలో జాతీయ భావాలను అంకురింపజేస్తూపోయి, దేశంలో మున్నెన్నడూ

లేని రాజకీయచైతన్యాన్ని కలిగించింది. దేశీయుల సమస్యలను పాలకుల దృష్టికి తేవాలంటే సుసంఘటితమైన, అన్ని వర్గాల ప్రాతినిధ్యంకల దేశీయుల మహాసభ ఒకటి అవసరమని భారతీయులకు తెలియవచ్చింది. జాతీయ కాంగ్రెసు మహాసభలు, ఆ సభలలో నాయకుల ఉపన్యాసాలు విద్యావంతులను మిక్కుటంగా ఆకర్షించేవి. బెంగాలు విభజనవల్ల స్వదేశీ ఉద్యమం, విదేశవస్తు బహిష్కారం భారతదేశమంతటా వ్యాప్తిజెందాయి. అంతేగాక పౌరస్వాత్వములు, స్వపరిపాలనం, బ్రిటిషువారి ఆర్థిక నీతి శాసన సభల నిర్మాణం, పరాయి పాలనవల్ల పన్నులభారం వంటి సమస్యలు దేశీయులను ఆలోచింప జేశాయి. 1906లో జరిగిన కలకత్తా భారత జాతీయ కాంగ్రెసు మహాసభలో దాదాభాయి నౌరోజీ "భారత దేశీయుల ఆదర్శం స్వరాజ్యం" అని చాటడంతో దేశమంతటా కాంగ్రెసు, స్వరాజ్యం అన్నమాటలు వ్యాప్తిజెందాయి. గోపాలకృష్ణ గోఖలే, బాలగంగాధర తిలక్, ఫెరోజ్‌షామెహతా వంటి భారతీయ నాయకుల పేర్లు అందరికీ పరిచయమయ్యాయి. బిపిన్‌చంద్రపాల్ ఆంధ్రదేశంలో పర్యటించి తన ఉపన్యాసాలద్వారా ప్రజలను ఉత్తేజ పూరితులను చేశాడు. వంగదేశంలో రాజుకొన్న చిచ్చు దక్షిణదేశానికీ వ్యాపించింది. భారతదేశమంతటా రాజకీయ ఝంఝూ మారుతం వీచ సాగింది. ఈ విషయాలన్నీ విద్యార్థులుగావున్న హనుమకొండ యువకులకు పత్రికలద్వారా, ప్రముఖ వ్యక్తులద్వారా తెలియ వస్తున్నాయి. అవి వారిని జాగృతం చేయడమేగాక వారిలో దేశాభిమానోద్దీపక బీజాలు నాటాయి.

హనుమకొండలో పత్రికలు పుస్తకాలు చదువుతూ, దేశ రాజకీయాలను బాగా అవగాహన చేసుకొంటూ ఉన్న యువకులు ఒక కూటమిగా చేరి ఏ రోజు విశేషాలను ఆ రోజు చర్చించేవారు. భారత దేశంలో వస్తూవున్న రాజకీయ సంచలనానికి వారు సుముఖులనీ,

జాతీయ భావాలపట్లనే వారి సానుభూతి అనీ వేరే చెప్పనక్కరలేదు. ఆ రోజులలో జాతీయ నాయకులలో మితవాదులు, అతివాదులు అని రెండు వర్గాలవారుండేవారు. మితవాద, అతివాద భావాలను గూర్చి హనుమకొండ యువకులు తర్జన భర్జనలు చేసేవారు. ఈ చర్చలలో వారొక వినోదకరమైన పద్ధతి అవలంబించారు. వారి వారి ధోరణులను బట్టి ఒక్కొక్కరికి ఒక్కొక్క భారతీయ నాయకుని పేరు పెట్టారు. అట్లా —— ముత్కవి వాసుదేవరావు గారిని ఫెరోజ్‌షా మెహతా అనేవారు. గుర్రాజురావు గారికి సురేంద్రనాథ బెనర్జీ అని పేరు. ఇట్లా ఇతరులకు కూడా వారి వారి వైఖరి ననుసరించి దేశ నాయకుల పేర్లు పెట్టారు. మాడపాటి హనుమంతరావు గారిని గోపాలకృష్ణ గోఖలే, అన్నారు. ఇతరుల విషయంలో వారికి పెట్టబడ్డ పేర్లు తగినవో కావో మనకు తెలియదుగాని, హనుమంతరావు గారికి పెట్టిన పేరు వారికి ఎంతైనా తగినదని అంగీకరింపక తప్పదు. అప్పుడు భారతదేశ రాజకీయ నాయకులలో గోపాలకృష్ణ గోఖలే మితవాది. సామరస్య వైఖరిని సమర్థించిన అభిజ్ఞుడు. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని స్థాపించి దేశీయులలో సేవాభావమును పెంపొందింప జేసిన కర్మయోగి. చిత్తశుద్ధికీ నీతివర్తనమునకూ పేరు పడ్డవాడు. గొప్ప రాజనీతిజ్ఞుడు. అర్థ శాస్త్రవేత్త, విద్యాభిమాని. తన జీవిత సర్వస్వాన్ని భరతమాత చరణముల వద్ద ధారవోసిన ధన్యజీవి. కనుక గోఖలే వంటివాడు అని అనిపించుకోవడం ఎంత గొప్ప విషయం! హనుమంతరావు గారికి గోఖలే అన్న పేరు ఆ తర్వాత వారి వ్యక్తిత్వాన్ని బట్టి సార్థక బిరుదమే అయింది. గోఖలేవలె పంతులుగారిది కూడా నిండుకుండవలె తొణకని వ్యక్తిత్వం. ఏ ప్రజా ఉద్యమంలోనైనా వీరూ మితవాదులే. తీవ్రమైన ధోరణి ఎప్పుడూ లేదు. నడతలో ఆలోచనలో పలుకులో, రచనలో, వ్యవ

హార నిర్వహణలో తొందరపడక, పూర్వాపరాలను బాగా యోచించి అడుగు ముందుకు వేసేవారు. గోఖలేవలె వీరుకూడా నిస్వార్థ సేవకు ప్రాధాన్య మిచ్చారు. పంతులుగారి సేవ రాజకీయ పార్టీల ముఖంగా జరిగినది కాదు. నిర్మాణాత్మకమైన సంస్థలద్వారా జరిగింది. రాజకీయాలలో తలమునకలు కావడం వీరికి ఇష్టంలేదు.అట్లాగే మత సంస్థల ద్వారా పనిచేయడానికీ వీరు సుముఖత చూపలేదు. సర్వమత సామరస్యం వీరి విధానం. మత ప్రసక్తిలేని లౌకిక విధానాన్ని వీరు తమ ప్రజాసేవలో పాటించారు. తమ వైఖరికి అనుగుణంగా వున్న సంస్థలద్వారా ఆర్భాటం లేకుండా నిరాడంబరంగా సేవచేసి ఆంధ్రప్రజల శ్రేయస్సుకు పాటుపడజూచారు. మొత్తంపై తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధి, సంఘ సంస్కరణ దృక్పథంతో తెలుగు ప్రజలు సామాజికంగా అభ్యుదయం సాధించడం, భారతీయులుగా అన్ని మతాలవారూ వర్గాలవారూ జాతీయతాభావంతో వ్యవహరించడం హనుమంతరావుగారి ప్రజాహిత జీవన ఆదర్శాలుగా ఉండేవి. న్యాయవాదియై స్వేచ్ఛను పొంది ప్రజాహిత జీవనం ఆరంభించిన తర్వాత ఈ ఆదర్శాలను ముందుంచుకొనే వీరు ప్రజాసేవకు ఉపక్రమించారు.

# గ్రంథాలయోద్యమ పోషకుడు

గ్రంథాలయాలంటే నాటి నిజాం ప్రభుత్వ దృష్టిలో విప్లవ సంఘాలు (రెవల్యూషనరీ బాడీస్). మూడవ నిజాం రాష్ట్రాంధ్ర మహా సభకు ప్రభుత్వ అనుమతి కోసం మాడపాటి హనుమంతరావుగారు, బూర్గుల రామకృష్ణారావుగారు రాష్ట్ర పోలీసు మంత్రి అయిన కర్నల్ ట్రెంచ్ వద్దకు వెళ్ళినప్పుడు అంతకు ముందు జరిగిన రెండవ ఆంధ్ర మహాసభలో చర్చింపబడ్డ తీర్మానాలపై ప్రభుత్వ ప్రతినిధులు ఆక్షేపణలు లేవదీశారు. అప్పుడు బూర్గులవారు "మా ఉద్యమం కేవలం రాజకీయేతర మైనది. విశేషంగా గ్రంథాలయాల మూలంగా విజ్ఞానం వ్యాపింపజేసే ఉద్యమం" అని వారికి నచ్చజెప్ప ప్రయత్నించారు. అప్పుడు అక్కడ ట్రెంచ్‌గారితో పాటు ఆసీనులైవున్న పోలీసు ఇనస్పెక్టర్ జనరల్ ఆర్మ్‌స్ట్రాంగ్ అనే మహాశయుడు "గ్రంథాలయోద్యమం అంటే ఏమిటో నాకు బెంగాలులో మంచి అనుభవం కలిగింది. గ్రంథాలయాలంటే విప్లవ సంఘాలు. అంతే. మరేమీ కావు" అన్నాడు. ఆ వైఖరినే నిజాం ప్రభుత్వం అనుసరిస్తూ గ్రంథాలయాలు అసలు స్థాపించబడకుండా, ఎక్కడైనా స్థాపింపబడినా వాటిని పని చేయనీయకుండా అభ్యంతరాలు చెబుతూ వాటిని మూసివేయింప చూస్తూ వుండేది.

తెలంగాణా పరిస్థితులను చక్కగా అవగాహన చేసుకున్న హనుమంతరావుగారు ఆంధ్రభాషా ప్రియులు కావడంచేత, ఆంధ్ర భాషోద్ధరణకు గ్రంథాలయాలే ముఖ్య సాధనాలని గ్రహించి జిల్లాలలో

విరివిగా గ్రంథాలయాలను నెలకొల్పడం ద్వారా భాషా ప్రచారం చేయ సంకల్పించారు. నిద్రావస్థలో వున్న ప్రజలను గ్రంథాలయోద్యమమే మేల్కొల్పగలదని వారి దృఢ విశ్వాసం.

పంతులుగారు హనుమకొండలో విద్యాశాఖ ఇనస్పెక్టర్‌గారి కార్యాలయంలో పనిచేస్తూ ఉన్నప్పుడే శ్రీ రాజరాజ నరేంద్ర గ్రంథాలయ కార్య నిర్వహణ బాధ్యత వహించి దానికి కార్యదర్శిగా పనిచేస్తూ గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడుతూ వుండేవారు. "పోలీసువారు విద్యాశాఖ ఇనస్పెక్టర్ గారితో రహస్యంగా ఏమి చెప్పారో ఏమో, ఆయన హనుమంతరావు గారిని గ్రంథాలయ కార్యదర్శి పదవికి రాజీనామా ఇవ్వమని నిర్బంధించారు. మాడపాటివారు నిమిత్తమాత్రం తొలగి కొండపల్లి సీతారామారావు గారిని కార్యదర్శిగా ఏర్పాటు చేయించి గ్రంథాలయం పని అంతా తాము చూస్తూ వుండేవారు. తర్వాత గ్రంథాలయానికి ఎన్నికలు జరిపించి మాదిరాజు రామకోటీశ్వరరావు గారిని కార్యదర్శిగా చేశారు"* హనుమంతరావు పంతులుగారికి ఈ గ్రంథాలయమంటే గొప్ప అభిప్రాయం ఉండేది. ఇది నిజాం రాష్ట్రం లోని తెలుగు జిల్లాలలో గ్రంథాలయోద్యమానికి శంకుస్థాపన మొనర్చిన లైబ్రరీ అనీ, ఇచటి ఆంధ్రోద్యమానికి పునాది అనదగినదనీ వారు ఒక చోట వ్రాశారు.

పంతులుగారు ఆ కాలంలోనే నిడదవోలు గ్రంథాలయ సభలకు వెళ్ళారు. రాజమండ్రి వెళ్ళి గౌతమీ గ్రంథాలయం చూచారు.

తెలంగాణాలో మారుమూల గ్రామాలలో సైతం గ్రంథాలయాలు ఏర్పడటానికి పంతులుగారు ఒక విధంగా మూలపురుషులని చెప్పవచ్చు.

---

* మాదిరాజు రామకోటీశ్వరరావుగారి స్వీయచరిత్రలో.

ఈ గ్రంథాలయాలు పాఠకులకు పత్రికలు పుస్తకాలు లభింప జేయడమే గాక, సభలకూ సమావేశాలకూ కవితా గోష్ఠులకూ, వివిధ సంస్థల వార్షికోత్సవాలకూ కూడా ఉపయోగపడి, తెలంగాణా ప్రజలను మేల్కొల్పినవి. ఇవి జిల్లా ప్రజలలో రాజకీయాభిప్రాయాలను కొంత వరకు వ్యాపింప జేసినవనీ, గ్రంథాలయములు వలన విద్యాధికులగు నగర వాసులకు రాజకీయ సాహిత్యం విరివిగా లభించినదనీ పంతులు గారే ఒక వ్యాసంలో వ్రాశారు. ఇవి ప్రజలలో విజ్ఞానతృష్ణను పెంపొందించాయి. యువకులలో రచన చేయవలెనన్న ఉత్సాహం కలుగజేశాయి. తెలంగాణాలో కలిగిన రాజకీయ చైతన్యానికి గ్రంథా లయాలే ముఖ్య కారణం. రాజకీయ ఆర్థిక సాంఘిక విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక రంగాలలో కృషి చేసిన ప్రజాసేవకులకు ఇవి ఆట పట్టులు. వీటివల్ల భాషాభివృద్ధి, విద్యావ్యాప్తి, విజ్ఞాన ప్రచారం జరి గాయి. తెలంగాణాలో 1922 నుంచి ఆరంభమైన ఆంధ్రోద్యమం అతి త్వరగా రాష్ట్రమంతటా వ్యాపించడానికి ఇవి మార్గం సుకరం చేశాయి. ఆంధ్రోద్యమం మొదటి దశలో తెలంగాణా అంతటా గ్రంథాలయాలు స్థాపించి, మాతృభాషా వ్యాప్తికీ, పత్రికా పఠనానికీ దోహదం చేశారు.

హనుమంతరావు పంతులుగారు ఆంధ్రజన కేంద్రసంఘం కార్య దర్శిగావుండి, కేంద్ర సంఘంలో గ్రంథాలయ శాఖకు ఒక ప్రత్యేక కార్య దర్శిని 1337 ఫసలీలో నియమించారు.

తెలంగాణాలో గ్రంథాలయోద్యమం ఆంధ్రోద్యమం కన్నా పురా తనమైనది కదా! ఆంధ్రోద్యమం మరొక సంవత్సరానికి ఆరంభమవు తుందనగా సూర్యాపేటలోని ఆంధ్ర విజ్ఞాన ప్రకాశినీ గ్రంథాలయాన్ని

ఆ జిల్లా తాలూక్దారు (కలెక్టరు) తన పర్యటన సందర్భంగా వచ్చి చూచాడు. ఆంధ్ర గ్రంథాలయ మొకటి తాలూకా ప్రధాన కేంద్రంలో కేవలం ప్రజల సహాయంతో నడపబడటం ఆ అధికారికి ప్రభుత్వా ధిక్కారంగా తోచిందేమో! "ఈ గ్రంథాలయాన్ని స్థాపించడానికి ప్రభుత్వం వారి అనుమతి పొందినారా లేదా?" అని అచటి కార్యకర్తలను ప్రశ్నించాడు. లేదని సమాధానం వచ్చేసరికి "ప్రభుత్వం వారి అనుమతి పొందేవరకూ గ్రంథాలయాన్ని మూసి వుంచండి" అని ఆజ్ఞాపించాడు. అంతట కార్యకర్తలు హైదరాబాదు వచ్చి ఆ సంగతి హనుమంతరావు పంతులుగారికి తెలిపారు. పంతులుగారు అప్పుడు హోం సెక్రెటరీగా వున్న సర్ అక్బర్ హైదరీ గారికి ఒక లేఖ వ్రాస్తూ "తాలూక్దారు జిల్లా లోకల్ఫండ్ బోర్డుకు కూడా అధ్యక్షుడు. అట్టి అధ్యక్షుడు ప్రజల గ్రంథాలయాలకు ధన సహాయము చేయుచుండునని వినియుంటిని గాని గ్రంథాలయములను మూసి వేయించునని వినలేదు. ఈ విషయమున న్యాయము చేయవలెను" అని కోరారు. హోంసెక్రెటరీగారు ఈ విషయాన్ని విచారిస్తానని తెలిపి, తాలూక్దారునుండి జవాబు తెప్పించుకొని పంతులుగారికి తిరిగి ఇట్లా వ్రాశారు. "గ్రంథాలయములను స్థాపించుటకు ఈ కార్యాలయము నుండి (ప్రభుత్వము నుండి) ఆజ్ఞ పొందవలసిన అవసరంలేదు" అని పంతులుగారికి తెలిపారు. అప్పుడు ఆ గ్రంథాలయం మళ్ళీ తెరవబడింది. పంతులుగారి జోక్యంవల్ల ఈ పేచీ పరిష్కారమైంది.

ఆ తర్వాత వరంగలు జిల్లా మడికొండ గ్రామం గ్రంథాలయం విషయంలోకూడా ఇటువంటి పేచీయే రాగా ఆంధ్రజన కేంద్రసంఘం కార్యదర్శి అప్పటి హోంసెక్రెటరీ గారి హుకుంకోసం వ్రాశారు. కాని

దానికి జవాబు 21 సంవత్సరాల వరకూ రాలేదు. గ్రంథాలయాలలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా పంతులుగారికి ఆ విషయం తెలియవస్తూ ఉండేది. మడికొండ గ్రంథాలయం విషయంలో ఆశ్చర్య పడవలసిన విశేషమేమిటంటే ప్రభుత్వ ఉత్తర్వు పొందేవరకూ ఈ గ్రంథాలయాన్ని మూసి వుంచవలసిందని కోర్టువారు ఉత్తరువు పంపడం !

కరీంనగరు జిల్లాలోని సిరిసిల్ల గ్రంథాలయాన్ని చూచిన అక్కడి తహశీల్దారు "సర్కారువారి దస్తరములలో వ్యవహారమంతా ఉర్దూలో ఉండగా చచ్చిపోయిన తెలుగును బైటికి గుంజవలసిన పనిలేదు" అని అన్నాడట. ఆ రోజులలో తెలుగుభాష అంటే నిజాం ప్రభుత్వ ఉద్యోగికి అంతటి ద్వేషం ! పైగా రాష్ట్రంలోని అధిక సంఖ్యాక ప్రజల భాష తెలుగు అని తెలిసివుండి కూడా !

తెలంగాణాలో ఆంధ్రోద్యమం ప్రారంభమయ్యే నాటికి – అనగా 1922 వరకల్లా సుమారు 15 గ్రంథాలయాలు స్థాపించ బడ్డాయి. వరంగలులో శబ్దాను శాసన గ్రంథాలయం, ఖమ్మంలో జ్ఞాన విద్యుత్ప్రవాహినీ భాషా నిలయం, వెర్రుపాలెంలో మహబూబియా గ్రంథాలయం, రేమిడిచర్లలో సిద్ధి మల్లేశ్వర గ్రంథాలయం, నల్లగొండలో ఆంధ్ర సరస్వతీ గ్రంథ నిలయం, హైదరాబాదులోని గౌలీగూడాలో బాల సరస్వతీ ఆంధ్ర గ్రంథాలయం, నాంపల్లిలో వేమన ఆంధ్రభాషా నిలయం స్థాపింప బడ్డాయి. వీటి నిర్వహణకు హనుమంతరావు గారు తోడ్పడ్డారు. వేమన ఆంధ్ర భాషా నిలయానికి భవనం నిర్మించడం కోసం స్థల నిర్ణయం చేయడం, దాని కొనుగోలు వ్యవహారం చూడడానికి గాను ఎన్నుకోబడ్డ ఉపసంఘంలో పంతులుగారు సభ్యులు. అట్లాగే బాలసరస్వతి గ్రంథాలయానికి భవనం ఏర్పాటు చేసే విషయంలో

కూడా వారి తోడ్పాటు వుంది. హనుమకొండలోని రాజరాజ నరేంద్ర భాషా నిలయానికి శాశ్వత భవన నిర్మాణం విషయంలో పంతులుగారు మునగాల రాజావారిని దర్శింపగా వారు కొంత విరాళమిచ్చారు.

ఈ గ్రంథాలయాలలో రాజకీయాలు చర్చింప బడుతున్నాయేమో నని పోలీసువారు అనుమానించి నిఘావేసి ఉంచేవారు. గ్రంథాలయ వార్షికోత్సవ సభలకు ముందుగానే అధికారుల అనుమతి పొందవలసి వుండేది. జిల్లా తాలూక్దారు అనుమతి ఇచ్చేవారు. గ్రంథాలయాలకు ప్రభుత్వ సహాయం కోరకూడదని హనుమంతరావుగారి పట్టుదల. సహాయం కోరితే పోలీసులు, సి.ఐ.డి. లు వచ్చి తనిఖీ చేస్తూ వుంటారు.

ఆంధ్రజన కేంద్ర సంఘం మూడవ సమావేశం 1925 ఫిబ్ర వరిలో మధిరలో జరిగినప్పుడు అక్కడే తెలంగాణా మొదటి గ్రంథా లయ సభను పంతులుగారు ఏర్పాటు చేయించారు. ఈ సభలో వారు గ్రంథాలయోద్యమ విస్తరణకై కొన్ని విధానాలు సూచించారు. 1928 లో నాల్గవ ఆంధ్రజన కేంద్రసంఘ సమావేశం సూర్యాపేటలో జరిగినప్పుడు రెండవ గ్రంథాలయ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు దేశభక్త వామన రామచంద్రనాయక్ గారిని పంతులుగారు తీసుకువచ్చి వారి అధ్యక్షతన సభ జరిపించారు. ఈ గ్రంథాలయ సభతోపాటే ఆంధ్ర యువక సభ, సంఘ సంస్కార సభ, ఆంధ్ర మహిళాసభ, వైశ్య యువజన సభకూడా జరిగాయి. స్థానిక గ్రంథా లయ వార్షికోత్సవం, వర్తక సంఘ వార్షికోత్సవంకూడా జరిగాయి. వివిధ వర్గాల వారిలో కదలిక పుట్టించడం, గ్రంథాలయోద్యమానికి జన బాహుళ్యంలో విస్తృతి కలిగించి చైతన్యం విస్తరింప జేయడం . ఈ

బహుముఖ కార్యక్రమాల ముఖ్యోద్దేశం. సూర్యాపేట రెండవ గ్రంథాలయ మహాసభలో పంతులుగారు సభలను సమావేశాలనూ, వాక్ స్వాతంత్ర్యాన్నీ అరికట్టే ఉద్దేశంతో నిజాం ప్రభుత్వం అమలులోకి తెచ్చిన గష్తీ నిషాన్ 53 (సర్క్యులర్ నెం. 53) ను ప్రత్యేకంగా సభవారి దృష్టికి తెచ్చి ప్రభుత్వం వారు విద్యా, విజ్ఞాన ప్రచారానికి సంబంధించిన విషయంలో కూడా కఠినమైన నిర్బంధాలు విధిస్తున్నందుకు విచారం ప్రకటించారు. ఆలంపురం వద్ద క్యాతూరులో 1946 లో రాజాబహద్దర్ వెంకటరామ రెడ్డిగారి అధ్యక్షతన జరిగిన 26 వ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభను హనుమంతరావుగారే ప్రారంభించారు.

పంతులుగారు హైదరాబాదు నగరంలో స్థిరపడ్డ తర్వాత శ్రీ కృష్ణదేవరాయాంధ్రభాషా నిలయాన్ని వృద్ధిచేయ బూనుకొన్నారు. అప్పుడు ఈ నిలయానికి స్వంత భవనం లేదు. నెలకు నాలుగున్నర రూ. ల అద్దె చెల్లిస్తూ చిన్న గదిలో ఈ లైబ్రరీ ఉండేది. ఈ గ్రంథాలయం పాఠకులను విశేషంగా ఆకర్షిస్తూ వుండేది. పత్రికలూ పుస్తకాలూ వస్తున్నాయి. నానాటికీ దీని సేవ అధికమవుతూ ఉండటంచేత ఒక భవనాన్ని కట్టించ వలసిన ఆవశ్యకతను సభ్యులు గుర్తించారు. పంతులుగారు 1914—15 సంవత్సరానికి ఈ భాషా నిలయం కార్యదర్శి పదవిని చేపట్టిన తర్వాత భవన నిర్మాణానికి ప్రయత్నాలు చేయసాగారు. వీరు రావిచెట్టు రంగారావుగారి ధర్మపత్ని శ్రీమతి లక్ష్మీనరసమ్మ గారిని ప్రోత్సహించగా ఆమె తన భర్త రంగారావు గారి స్మృతి చిహ్నంగా భవన నిర్మాణంకోసం రూ. మూడువేలు విరాళమిచ్చారు. ఆ ధనంతో భవన నిర్మాణాన్ని ఆరంభింప జేశారు. ఆమె మరికొంత ధనసహాయం చేసేవారే. కాని అకాలమరణం పొందారు.

అయినప్పటికీ పంతులుగారు పూనుకొని విరాళాలు సేకరించారు. వీరి ఈ కృషి ఫలితంగా 1918 లో ప్రారంభమై 1921 లో పూర్తి అయిన శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం భవన ప్రవేశోత్సవం 1921 సెప్టెంబరు 30 తేదీన ప్రముఖ విద్యావేత్త కట్టమంచి రామలింగారెడ్డి గారి అధ్యక్షతన వైభవోపేతంగా జరిగింది. ఈ విధంగా హైదరాబాదు నగరంలో 1901 లో స్థాపింపబడిన మొట్టమొదటి సార్వజనీన గ్రంథాలయానికి స్వంత భవనమేర్పడింది. ఈ భాషా నిలయ స్వర్ణోత్సవ సంచికలో బూర్గుల రామకృష్ణారావు గారు 'రజతోత్సవోదంతము' అనే శీర్షికతో భాషా నిలయం యొక్క యాభై సంవత్సరాల చరిత్రను సమీక్షిస్తూ "మందిర నిర్మాణమునందు నిరంతరము కృషి సల్పి ధన సంగ్రహము గావించిన శ్రీయుత మాడపాటి హనుమంతరావు గారు ఈ నిలయాభివృద్ధి గావించిన వారిలో ముఖ్యులని వేరే చెప్పనక్కరలేదు" అని వ్రాశారు. పంతులుగారి గ్రంథ పఠనాసక్తి, వీరి ప్రతిభ, వీరికి గల పలుకుబడి ఈ భాషా నిలయం అభివృద్ధికి దోహదం చేశాయి. కాబట్టే ఒక కవి "ఆంధ్ర పితామహు నల్లారుబిడ్డ మాయాంధ్రభాషా నిలయంబు గనుడు" అని పాడినాడు.

శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం రజతోత్సవ, స్వర్ణోత్సవ, వజ్రోత్సవాలను పంతులుగారు వైభవంగా జరిపించారు. ఇట్లా తెలంగాణాలో గ్రంథాలయోద్యమానికి వీరు పోషకులుగా వ్యవహరించి ఉద్యమానికి పుష్టిని చేకూర్చారు.

హనుమంతరావు పంతులుగారు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘం గౌరవ సభ్యులుగా ఎన్నిక కావడమేగాక, కొంతకాలం ఆ సంఘ కార్యవర్గంలో సభ్యులుగా కూడా ఉన్నారు.


# ఆంధ్రోద్యమ నిర్మాత

తెలంగాణాలో ఆంధ్రోద్యమం వేరు. ఆంధ్ర ప్రాంతంలో ఆంధ్రోద్యమం వేరు. ఆంధ్ర ప్రాంతంలోని ఉద్యమం ప్రధానంగా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం జరిగింది. తెలంగాణాలోని ఆంధ్రో ద్యమం హైదరాబాదు రాజ్యంలో ఎనిమిది జిల్లాలలో నివసించే తెలుగు వారి మాతృభాషను పునరుజ్జీవింపజేసి, తెలుగు భాషా సాహిత్యాల అభి వృద్ధిని సాధించడానికీ, ఇక్కడి ప్రజలకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ హక్కులను చేకూర్చడానికీ, ఈ ప్రజలలో సాంస్కృతికంగా చైతన్యం కలుగజేయడానికి ఉద్దేశింప బడింది.


నిజానికి అప్పటి హైదరాబాదు సంస్థానంలో ఆంధ్రోద్యమం ఎన్నడో ఆరంభం కావలసింది. అప్పటి తెలంగాణా ప్రజల స్థితి దృష్ట్యా అటువంటి ఉద్యమం ఎంతో ఆవశ్యకమైనది కూడా. ఆంధ్రో ద్యమమంటే ముఖ్యంగా నిజాం రాష్ట్రంలోని తెలుగువారు 'మేము ఆంధ్రులం' అనే యథార్థాన్ని గుర్తించేట్టు చేయడం, వీరి మాతృభాష యైన తెలుగు వ్యాప్తికి కృషి చేయడం, వీరి రాజకీయ, ఆర్థిక సాంఘిక, సాంస్కృతిక అభ్యున్నతికి పాటుపడటం, వీరిలో ఆధునిక యుగ చైతన్యాన్ని కలిగించడం. ఇటువంటి పని జరగవలసిన ఆవశ్యకత ఆనాటి నిజాం నిరంకుశ ప్రభుత్వ హయాములో ఎంత గానో ఉండేది. ఈ రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల ప్రాంతం తెలం గాణా. దీని వైశాల్యం 41,502 చదరపు మైళ్ళు. అప్పటి జనాభాను



మహాత్మాగాంధి హైదరాబాదు సందర్శించినప్పుడు తీసిన చిత్రం.
హనుమంతరావు పంతులుగారు కుడివైపు చివర ఉన్నారు.




శ్రీ హనుమంతరావు పంతులుగారు ప్రసిద్ధ చరిత్రవేత్త శ్రీ దిగవల్లి వేంకటశివరావుగారికి
స్వదస్తూరితో వ్రాసిన లేఖ ప్రతిచిత్రం.



లేఖకు వెనుకవైపు.

బట్టి ఇక్కడ 60 లక్షల మందికి పైగా తెలుగువారు ఉండేవారు. కాని బ్రిటిషు ఇండియాలోని ఆంధ్రదేశస్థితితో పోల్చినా, లేక నిజాం రాష్ట్రంలోని మహారాష్ట్ర, కర్ణాటక జిల్లాలతో పోల్చినా తెలుగువారి పరిస్థితి శోచనీయంగా ఉండేది. ఎనిమిది జిల్లాలలో ఒకటి మాత్రమే ఇంగ్లీషు హైస్కూలు. ఇతర విద్యాసంస్థలు మహారాష్ట్ర, కర్ణాటక జిల్లాలకన్నా తక్కువగా ఉండేవి. ఈ స్థితి తెలంగాణా వాసుల విద్యా దారిద్ర్యాన్ని వెల్లడిస్తూ ఉండేది. ఉర్దూ ప్రభుత్వ అధికార భాష కావడం చేతనూ, ఉన్నత పాఠశాల విద్యకూడా అందులోనే బోధింప బడటం చేతనూ నిత్య జీవితంలో ఇక్కడి తెలుగువారు ఉర్దూ మాట్లా డటమే గౌరవంగా, ఫాషన్‌గా, నాగరికతగా భావించేవారు. ఇందు వల్ల వీరు మాతృభాషలో సరిగా మాట్లాడలేని స్థితి ఏర్పడింది. ఒక వేళ తెలుగు మాట్లాడినా సగం ఉర్దూ పదాలు ఉండేవి. అదొక రక మైన మిశ్రమ భాషగా ఉండేది. అత్యధికసంఖ్యాక ప్రజల భాషలైన తెలుగు, మరాఠీ, కన్నడం ఆనాటి నిజాం రాష్ట్రంలో రెండవ శ్రేణి భాషలై, వాటిని అభివృద్ధి పరిచే నాధుడు లేని అనాధలై ఉండేవి. మాతృభాషలో పత్రికలు చదివి దేశ పరిస్థితులు తెలుసుకోవాలన్న అభిలాష తక్కువగా ఉండేది. ఎక్కువగా ఉర్దూ పత్రికలు చదివే వారు. కొందరు ఇంగ్లీషు పత్రికలు చూచేవారు. ఆంధ్రుల చరిత్రకు పనికివచ్చే శాసనాలు ఇక్కడవున్నా వాటిపై దృష్టిని సారించినవారు లేరు. ఇక్కడి తెలుగువాడు హైదరాబాదు తన నగరమనీ, తెలుగు తన మాతృభాష అనీ సాధారణంగా భావించడు. అతని వేషభాషల్లో ఆంధ్రత్వం వెదకవలసి ఉండేది. నిరక్షరాస్యత హెచ్చుగా ఉండేది. సామాన్యప్రజ నిజాం నిరంకుశ ప్రభుత్వం క్రింద అభివృద్ధి అనేది ఎరుగక, మాతృభాషలో విద్యాసౌకర్యాలు లేక, సామాజిక రాజకీయ

స్థితిగతులను గూర్చిన స్పృహలేక అంధకారంలో పడిఉన్నారా అని పించేది. వీరి స్థితిని చూచి "అరువది లక్షల జీవులు నిజాం రాష్ట్రమునకును, భారత వర్షమునకును చిరకాలము భారముగా నుండవలసిన దేనా ?" అనే ప్రశ్న తనకు తాను వేసుకొన్న తొలి హైదరాబాదు ఆంధ్రుడు మాడపాటి హనుమంతరావు పంతులుగారు. అంతేకాక "అన్ని విధములగు ఔన్నత్యము నలవడజేయ నత్యవసరమగు సంఘీభావము, పూర్వ చరిత్రను గూర్చిన గౌరవము, భావి భాగ్యోదయ విపయమున విశ్వాసము తెలుగువారి హృదయక్షేత్రములం దంకురింపనిచో మృతతుల్యులుగానున్న వీరి భావి సంతానము గతి యేమి గావలయును?" అనికూడా పంతులుగారు వాపోయారు. ఆనాటి హైదరాబాదు సంస్థానంలో తెలుగువారి స్థితి చెప్పుకోదగినదిగా లేదు. రాజ్యాంగ విషయకంగా తెలుగువారు ఉన్నతస్థితికి రాలేదు. ఒక్కరు మాత్రం అనుకోకుండా హైకోర్టు జడ్జీ పదవిలోకి వచ్చారు. ఉన్నతోద్యోగాలలో తెలుగువాళ్ళు లేనేలేరు. హైదరాబాదు శాసన నిర్మాణ సభలో ప్రముఖులైన ఆంధ్రులు సభ్యులుగా రాలేదు. ఆంధ్రులెవరూ సూబేదార్లు కాలేదు. అవ్వల్ తాలూక్దార్లు (జిల్లా కలెక్టర్లు) కాలేదు. హైకోర్టు ప్రముఖ న్యాయవాదులలో ఆంధ్రులు తక్కువ. పరిశ్రమలు ఆంధ్రులవికావు. హైదారాబాదు నగరంలో తెలుగు మాట్లాడే వారి సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికీ నగర ప్రజా జీవితంలో వారికి స్థానంలేదు. తక్కువ సంఖ్యలో వున్న మహారాష్ట్రులు ప్రముఖంగా కన్పించేవారు. రాజధాని నగరమైన హైదరాబాదులో ప్రజాహిత కార్యాలపట్ల అభిరుచి, ఉత్సాహం కలవారు ఆనాడు ప్రధానంగా మహారాష్ట్రులే. ఉన్నత విద్యావిభూషితులు వారే. విద్యాసంస్థలను స్థాపించేవారు వారే. తెలుగు వారిలో సేవా తత్పరత, ఉత్సాహం, చొరవ గోచరించేవి కావు. 1918 లో స్థాపింపబడ్డ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉర్దూ భాషను మాత్రమే

అభివృద్ధి పరుస్తూ ఇచటి ప్రాంతీయ భాషలైన తెలుగు, మరాఠీ, కన్నడ ములను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూవుండే పట్టించుకొన్న వారే లేరు.

పరిస్థితి ఇంత నిరాశాజనకంగా ఉన్నప్పటికీ తెలుగు భాషా వ్యాప్తికీ, తెలుగు ప్రజలను ప్రబోధించడానికీ గ్రంథాలయాలు చేయగల సేవ అమూల్యమైనదని హనుమకొండలో స్వానుభవం వల్ల తెలుసు కొన్న హనుమంతరావు పంతులుగారు మొదట గ్రంథాలయాల స్థాప నకూ, వాటి పెంపుకూ కృషి చేశారు. అయితే తెలుగువారి సర్వతో ముఖ అభ్యుదయానికై రావలసిన ఉద్యమమే రాలేదు. అందుకు కార ణాలున్నాయి. స్థితిమంతులైన వారిలో ప్రజాహిత జీవనంపై ఆసక్తి లేకపోవడం, ప్రజా సేవకు పూనుకొనేందుకు సుఖజీవనాన్ని త్యాగంచేసే నిరతి లేకపోవడం, ప్రభుత్వ ఆజ్ఞల మూలంగా ప్రజాహిత కార్య క్రమాలపై పలురకాల నిషేధాజ్ఞలు అమలులో వుండటం.

ఈ స్థితిలో ఒక చిన్న సంఘటన వల్ల ఆంధ్రోద్యమానికి ఇక్కడ అంకురార్పణ జరిగింది. 1921 నవంబరు 12 వ తేదీ రాత్రి హైదరాబాదు నగరంలో గౌలీగూడా ప్రాంతంలోని వివేకవర్ధనీ థియేటరులో హిందూ సంఘ సంస్కరణ మహాసభ జరుగుతూ వుంది. సభాస్థలి మహారాష్ట్ర వాతావరణం కలది. మహాసభను నిర్వహించిన ప్రముఖులు మహారాష్ట్రులే. మహాసభాధ్యక్షులు పూనా నివాసి, సంఘ సంస్కర్త, భారతదేశంలో మొట్టమొదటి మహిళా విశ్వవిద్యా లయ స్థాపకుడూ అయిన ధోండో కేశవ కర్వే పండితుడు. సభాసదు లలో పెక్కుమంది మహారాష్ట్రులే. ఆ రోజుల్లో ప్రజాహిత జీవ నంలో, విద్యారంగంలో ఈ నగరంలో వారిదే పైచేయికదా ! అయితే

ఆంధ్రులు, కన్నడులు కూడా సభా కార్యక్రమంలో పాల్గొన్నారు. కర్వే పండితుని ఉపన్యాసం కొంత మరాఠీలో, కొంత ఇంగ్లీషులో సాగింది. సభలో తీర్మానాలు, ఉపన్యాసాలు ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో జరిగాయి. ఆంధ్రుల పక్షాన మాడపాటి హనుమంతరావు పంతులుగారు వేదికపై ఆసీనులై ఉన్నారు. సభలో తెలుగు, మరాఠీ, కన్నడ భాషలలో ప్రసంగాలు జరగవచ్చునని విషయ నిర్ణయ సభవారు అంతకుమునుపే ఆమోదించారు. హనుమంతరావుగారు తెలుగులో ప్రసంగించారు. ఒక తీర్మానంపై హైకోర్టు వకీలు ఆలంపల్లి వెంకట రామారావుగారు తెలుగులో ప్రసంగించబోగా సభలో ఉన్నవారు ముఖ్యంగా మహారాష్ట్రులు తెలుగు ప్రసంగం వినడం ఇష్టంలేక, ఉప న్యాసం సాగకుండా చప్పట్లు చరచి కేకలు వేయసాగారు. వెంకటరామా రావుగారు తమ ఉపన్యాసాన్ని మధ్యలోనే ఆపివేయవలసి వచ్చింది. సభకు వచ్చిన ఆంధ్రులు ఈ అవమానం వెంకటరామారావు గారికే కాక ఆంధ్రభాషకు ఆంధ్ర జాతికి జరిగినట్లు భావించారు. హైదరాబాదు తెలంగాణాలో ఉన్న నగరం. నగర జనాభాలో తెలుగువారు అధిక సంఖ్యాకులు. అయినప్పటికీ ఒక వక్త తెలుగులో ఉపన్యాస మివ్వడానికి వీలులేకుండా చేశారు. సభలో ఉన్న ఆంధ్ర ప్రముఖులు మనఃక్లేశం పొంది సభ ముగియక మునుపే లేచి బైటికి వెళ్ళారు. ఇండ్లకు వెళ్ళ లేదు. ఆ రాత్రే హైకోర్టు న్యాయవాది టేకుమాల రంగారావుగారి ట్రూప్‌బజారు ఇంటిలో 12 మంది ఆంధ్ర ప్రముఖులు సమావేశమై భావి కర్తవ్యాన్ని గూర్చి చర్చించి 'ఆంధ్రజన సంఘము' స్థాపించారు. వారిలో మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు, బూర్గుల రామకృష్ణారావు, మందుముల నరసింగరావు, టేకుమాల రంగారావు, బోయినపల్లి వెంకటరామ నరసింహారావు, మందుముల రామచంద్రరావు,

బూర్గుల నరసింగరావు, పందిటి రామస్వామినాయుడు, నడింపల్లి జానకి రామయ్య, మిట్టా లక్ష్మీనరసయ్య, కొమ్మవరపు సుబ్బారావు ప్రభృతులు ఉన్నారు. అంటే 1921 నవంబరు 12 వ తేదీన నిజాం రాష్ట్రి ఆంధ్రోద్యమం ఆరంభమైందన్నమాట. ఆంధ్రజన సంఘమునకు అధ్యక్షులు బారిష్టరు ఆర్. రాజగోపాలరెడ్డిగారు. కార్యదర్శి మాడపాటి హనుమంతరావు పంతులు. నిజాం రాష్ట్రాంధ్రులకు సేవచేసే అవకాశం ఈ రూపంగా లభించినందుకు పంతులుగారు లోలోపల సంతసించారు. ఈ ఆంధ్రజనసంఘం స్థాపనతో తెలుగు న్యాయవాదులు ప్రజాహిత జీవనంపట్ల ఆసక్తి చూపారు.

ఆంధ్రజనసంఘం స్థాపించింది మొదలు దాని పెంపు కొరకై హనుమంతరావుగారు నిర్విరామంగా కృషి చేయసాగారు. మూడు నాలుగేళ్ళలోనే ఆంధ్రజనసంఘాలు 50 వరకూ వివిధ ప్రదేశాలలో స్థాపింపబడ్డవి. సుమారు 90 గ్రంథాలయాలు కూడా తెలంగాణాలో ఏర్పడి భాషాసేవ, విజ్ఞానవ్యాప్తి గావించడం మొదలు పెట్టాయి. ప్రజలలో సంచలనం కలిగింది. తెలంగాణాలో క్రమంగా చీకట్లు తొలగిపోతూ ఉషోరేఖలు కాంతులు వెదజల్లసాగాయి.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. వీరు తెలంగాణావారు కదా. ఆంధ్రజన సంఘం, ఆంధ్రోద్యమం అని ఎందుకు వ్యవహరించారు? తెలంగాణా జన సంఘమని ఎందుకు పేరు పెట్టలేదు ? దీనికి జవాబేమిటంటే ఇక్కడి పెద్దలు తమ చరిత్రను సింహావలోకనం చేసుకొన్నారు. చరిత్రలో తెలుగు భాష మాట్లాడే ప్రజలను ఆంధ్రులు అని పేర్కొనడం జరిగింది. ఆంధ్రదేశం త్రిలింగదేశం పర్యాయ పదాలు. ఆంధ్రభాష, తెలుగుభాషా పర్యాయ పదాలు. ఉర్దూ భాషీయులైన నిజాం అధికార్లు తెలుగును 'తెలంగీ' అనేవారు. 'తెలంగీ

బేఢంగీ' (తెలుగు భాషకు ఒక క్రమపద్ధతి లేదు) అని అపహసించే వారు. భాషను అర్థం చేసుకోలేక, నేర్చుకోవాలన్న ఉద్దేశమే లేక, మాట్లాడటం చేతకాక భాషను అలా ద్వేషభావంతో తూలనాడేవారు. కాబట్టి ఆంధ్రభాష అనే మాటే ఇక్కడ బాగా రూఢమైంది. పైగా తెలంగాణాలో తొలి దశలో స్థాపింపబడ్డ సంస్థల పేర్లలో ఆంధ్ర శబ్దమే కనిపిస్తుంది. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, రాజరాజ నరేంద్ర ఆంధ్ర భాషానిలయం, వేమన ఆంధ్ర భాషానిలయం, మొదలగునవి. కాబట్టి చరిత్రను బట్టి ఆంధ్రజన సంఘం, ఆంధ్రోద్యమం అని వ్యవహరించారు.

ఆంధ్ర జనసంఘం ఆదర్శాలలో నిజాం రాష్ట్రంలోని ఆంధ్రులలో పరస్పర సానుభూతి కలిగించి, వారి అభివృద్ధికై పాటుపడటం, ఆంధ్రులకొరకు సంఘాలు సంస్థలు స్థాపించడం, ఉపన్యాససభలు ఏర్పాటు చేయడం- అంటే ఆంధ్రులలో సంఘీభావం కలిగించడానికి వారి మాతృభాషావ్యాప్తికీ తొలుత ప్రాధాన్యమిచ్చారన్నమాట. నిజాం రాష్ట్రంలో ప్రతి ఆంధ్రవ్యక్తి 18 సంవత్సరాలకు మించిన వయస్సు కలిగి చదవడం వ్రాయడం వస్తే ఆంధ్రజనసంఘంలో సభ్యుడు కావచ్చు.

రాష్ట్రంలో పలుతావుల ఆంధ్రజన సంఘాలు ఏర్పడ్డవి. వీటన్నిటికీ ఒక కేంద్రజనసంఘం అవసరమని భావించి 1923 ఏప్రిలులో హనుమకొండలో కేంద్రసంఘ నియమావళిని ఆమోదించారు. ఆంధ్రజన కేంద్రసంఘం మొదటి సమావేశం 1923 జులై 27 తేదీన హైదరాబాదులో మాడపాటి హనుమంతరావుగారి ఇంటిలో (ఆంధ్ర కుటీరము) జరిగింది. ఆ సంవత్సరానికి అధ్యక్షులుగా రావు బహద్దర్ సా. వెంకటరెడ్డిగారిని ఎన్నుకొన్నారు. కార్యదర్శి మాడపాటి హను

మంతరావుగారు. ఇక్కడినుండి హనుమంతరావు పంతులుగారే ఆంధ్ర జనసంఘం రథసారథి. ఆంధ్రజన కేంద్రసంఘం విధులలో గ్రంథాలయాలు పాఠశాలలు స్థాపించడం, విద్యార్థులకు సహాయం చేయడం, విద్వాంసులను సన్మానించడం, తాళపత్ర గ్రంథాలు శాసనాలుసంపాదించి పరిశోధన జరిపించడం, కరపత్రములు లఘుపుస్తకములద్వారా తెలుగు ప్రజలకు ముఖ్య సమస్యలనుగూర్చి సమాచారాన్ని అందించి విషయ పరిజ్ఞానం కలిగించడం, విజ్ఞానాన్ని వ్యాపింపజేయడం, ఆంధ్రభాషా ప్రచారానికై అవసరమైన ప్రయత్నాలన్నీ జరపడం వంటివి ఉన్నాయి. నిజానికి ఇవన్నీ సాంస్కృతికలక్ష్యాలే. మరి ఆంధ్రసంస్కృతి పునరుద్ధరణమేకదా వీరి తొలి ఆశయం. దానిని ఒక ఉద్యమంగా ప్రచలితం చేశారు. కేంద్రసంఘం వివిధ ఆంధ్రజన సంఘాలను పర్యవేక్షణ చేస్తూ వాటికి కార్యవిధానాన్ని సూచిస్తూ ఉండేది. ఈ పనిని పంతులుగారు ఒక్క చేతిమీదుగా నడిపేవారు.

ఇట్లా మత, జాతి, వర్గ, వృత్తి వివక్షత లేకుండా తెలుగు జన సామాన్యానికి సంబంధించిన ఉద్యమంగా ఆంధ్రోద్యమం ఆరంభింపబడింది. కొంతకాలం తర్వాత నిజాం రాష్ట్రాంధ్రదేశంలో స్థిర నివాసం కలిగి ఆంధ్రులమని చెప్పుకొనేవారు ఆంధ్రులుగా ఎంచబడ్డారు. మాతృభాష వేరైనవారూ ఈ సభలలో పాల్గొన్నారు. దీని వేదికలనుంచి తెలుగులోనే కాక ఇతర భాషలలోకూడా మాట్లాడే అవకాశ మిచ్చారు. అందుకు కొందరు అభ్యంతరం చెప్పి తెలుగులోనే విధిగా మాట్లాడవలెనని వాదించినప్పటికీ ఉద్యమ నాయకులు అలా సంకుచిత పరచడం ఉద్యమ వ్యాప్తికి ఏ విధంగానూ తోడ్పడదని భావించినవారై దీనికాక విశాలమైన ప్రాతిపదిక ఏర్పరిచారు.

ఆంధ్రజన కేంద్ర సంఘ సమావేశాలు వివిధ ప్రదేశాలలో జరిగేట్టు పంతులుగారు శ్రద్ధ వహించారు. అందువల్ల ఆయా ప్రదేశాల ప్రజలు తమ భాష, తమ సంస్కృతి పట్ల, తమ సమస్యల పట్ల శ్రద్ధా సక్తులు కనపరిచారు. రెండవ కేంద్రసంఘ సమావేశం 1924 లో నల్లగొండలో జరగగా, మూడవ సమావేశం 1925 లో మధిరలో జరిగింది. నాల్గవ సమావేశం 1928 లో సూర్యాపేటలో జరిగింది. మధిర, సూర్యాపేట సమావేశాలలో ప్రథమ, ద్వితీయ గ్రంథాలయ సభలు కూడా జరిపించారు. ప్రజలలో పెల్లుబుకుతూ వున్న ఉత్సాహాన్ని అదుపులో ఉంచి దానిని నిర్మాణ మార్గంలోకి మరల్చడానికి పంతులుగారు పూనుకున్నారు.

పంతులుగారు ఆంధ్రోద్యమం నడపడంతోపాటుగా యాదవ, ముదిరాజ, మున్నూరుకాపు, పద్మశాలి, గౌడ, విశ్వబ్రాహ్మణ, నాయీ బ్రాహ్మణ, ఆదిహిందూ వర్గీయులను కూడా మేల్కొలిపారు. ఆ వర్గాలవారు చైతన్యవంతులై ఆంధ్రోద్యమంలో వారివంతు కృషి సల్పడానికి ఉత్సాహంతో ముందుకు వచ్చారు. పంతులుగారు వారికిచ్చిన ప్రోత్సాహం, సహకారం ఆశీస్సులు బలవర్ధక ఔషధంవలె పని చేశాయి. కొద్ది కాలంలోనే వారి సంఘాలు చురుకుగా పనిచేయ సాగాయి. ఇట్లా కుల సంఘాలకు ప్రోత్సాహ మివ్వడంలో పంతులు గారు నిర్దిష్టమైన ప్రయోజనాన్ని శ్రేయస్సును కాంక్షించారు. వారి ముఖ్యోద్దేశం ఏ కులానికి, ఏ వర్గానికి చెందిన ప్రజలలోనైనా మొదట జాగృతి కలుగడం అవసరం. తమ సమాజం పైకి రావలెననే కోర్కె వారిలో కలగాలి. సంఘీభావంతో పనిచేసే మనఃస్థితి వారికి ఏర్పడాలి. వ్యక్తి శ్రేయస్సు కాక, వర్గ శ్రేయస్సు, సమాజ శ్రేయస్సు అనే దృక్పథం వారికి ఏర్పడాలి. దీనివల్ల స్వార్థం వెనక్కి పోతుంది.

ఆయా కులాల అభివృద్ధికై పాటుపడేటువంటి సంఘాలు, సభలు భాష ఒకటే కాబట్టి ఆంధ్రోద్యమాన్ని శక్తివంతం చేస్తాయి. అనేక చిన్న నదులు ఒక పెద్ద నదిలో వచ్చి కలిసి దానిని మహా ప్రవాహంగా చేసినట్లే, కుల వర్గ సంఘాలన్నీ ఆంధ్రోద్యమానికి పుష్టిని చేకూర్చాలి. ఇది జరిగితే, ఆంధ్ర మహాజనులు త్వరితగతిని అభ్యుదయం సాధింపగలుగుతారు. ముఖ్యంగా దిగువ కులాలకు చేయూత నిచ్చి పైకి తేవడం అవసరం. ఆంధ్ర సమాజంలో ఏ ఒక్క కులం సాంస్కృతికంగా వెనుకబడి ఉన్నా అది ఆంధ్రోద్యమానికి ఆరోగ్యప్రదం కాదు, ఇది పంతులుగారి కార్య విధానానికి ఆధారమైన దృక్పథం. పైగా ఆ కాలంలో వివిధ కులాలు వర్గాల మధ్య ద్వేషం, వైరభావం లేవు. కులతత్వ ప్రాతిపదికపై వైషమ్యాలు లేవు. ఎవరికి వారు వారి సమాజం పైకి రావాలనే ఉద్దేశంతో సంఘం స్థాపించుకొని పని చేసుకుపోయేవారు. అన్య కులాలవారు సహకారమిస్తే తీసుకొనేవారు. చిత్తశుద్ధితో తమ సంఘీయులను విద్యా విషయకంగా, సాంఘికంగా పురోగమింప జేయడమే వారి లక్ష్యం. వారిలో ఎవరు పంతులుగారి వద్దకు వచ్చినా పంతులుగారిలో తమ మాతృభాషయైన ఆంధ్రము యొక్క నాయకుని, తమ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షిస్తూ వున్న ఒక మహాపురుషుని చూడగలిగేవారు. ఇది ఆనాటి తెలంగాణా పరిస్థితి. ఇది పంతులుగారికెంతో ఆనందం, ఆవేగం కలుగజేసేది. ఆంధ్రభాష మాట్లాడే వారంతా ఒకే సమాజమన్న భావం వారిలో క్రమేణా కలుగుతూ రావడం పంతులుగారు గమనించారు. ఇది శుభసూచకం, ఆహ్వానింప దగ్గ విశేషం అన్న సంతృప్తి వారికి కలిగింది. అట్లా అన్ని సంఘాలు పుష్టిని పొందితే ఆంధ్ర జాతి పరిపూర్ణమైన తేజంతో విరాజిల్లుతుంది. పంతులుగారు అనుసరించిన ఈ విధానం వివేకంతో కూడుకొన్నదని, దీనివల్ల ఆంధ్రోద్యమ

విస్తరణలో సత్ఫలితాలు కనిపించాయనీ ఉద్యమ గమనాన్నిబట్టి మనం గ్రహింప గలుగుతాము. ఆంధ్రజన సంఘం క్రియాకలాపం వల్ల కలిగిన ఒక సత్ఫలితమేమిటంటే — ఒకప్పుడు ఉర్దూ భాషలో మాట్లాడటమే నాగరికతగా భావించిన పట్టణాల విద్యార్థికులు క్రమంగా తెలుగులో ఉపన్యాసాలివ్వసాగారు. పామరులుకూడా తెలుగు ఉపన్యాసాలు వినసాగారు. తరచు సభలు సమావేశాలు అన్నిచోట్లా జరుగుతున్నాయి. తెలుగు పత్రికలు పట్టణాలలోనే కాక గ్రాసీమలలోకూడా కన్పిస్తున్నాయి. పోస్టువాళ్ళు బండగుర్తులు పెట్టుకొని వాటిని అందజేస్తున్నారు. రచయితలు కవులు పుట్టుకొచ్చి పత్రికలకు తెలుగులో కవితలు కథలు వ్యాసాలు వ్రాయసాగారు.

ఆంధ్రజన కేంద్రసంఘం సందేశం, దాని ఆశయాలు తెలంగాణా మారుమూలలకు కూడా తెలియరావాలికదా. ఇందుకు ప్రచారం జరగాలి. కనుక కేంద్రసంఘం పక్షాన పంతులుగారు ఉన్నవ వెంకటరామయ్య గారనే సమర్థుడైన ప్రచారకుని నియమించారు. ఈ ప్రచార కార్యానికై ఆంధ్రేతరులైన దేశభక్తి వామన్ నాయక్‌గారు 1930 కి పూర్వమే రూ. 300 విరాళమిచ్చారంటే పంతులుగారు ఆంధ్రోద్యమానికి ఆంధ్రేతరుల సద్భావాన్ని ఎంత మేరకు పొందగలిగారో, ఈ ఉద్యమానికి ఎంత గట్టి పునాది వేశారో విశదమవుతుంది. ఆంధ్రజన సంఘం ఆంధ్రేతరులపై తాత్కాలికమైన ఆగ్రహం వల్ల ఆవిర్భవించినప్పటికీ, దాని పెంపు పోషణలను ఉదాత్త రీతిలో జరుగునట్లు చేసి, ఆంధ్రేతర సోదరులు ఈ ఉద్యమంపట్ల సుహృద్భావంతో వ్యవహరించేట్టు చేయగలిగిన బుద్ధి కుశలత, ప్రజ్ఞ, దక్షత పంతులుగారివే అని చెప్పవలసి ఉన్నది. ఒక భాష మాట్లాడే వారి దార్ఢ్యత, శక్తిసామర్థ్యాలు వారి సంఘటిత స్వభావంలో, ఇతరులపట్ల

వారు కనపరిచే సౌజన్యంలో, తమను తాము నిర్మాణాత్మకంగా ప్రవర్ధనం చేసుకొని ఇతరులకు తాము అందుకొన్న అభ్యుదయాన్ని ఆదర్శంగా కనపరచడంలో ప్రతిబింబిస్తాయని పంతులుగారి విశ్వాసం.

ప్రజలకు భోగట్టా అందజేసి వారికి సంగతి సందర్భాలు తెలియజేసే నిమిత్తమై కేంద్రసంఘం పక్షాన లఘు పుస్తక ప్రచురణకు పంతులుగారు ఏర్పాట్లు చేశారు. వర్తక స్వాతంత్ర్యము, వెట్టిచాకిరీ, గ్రంథాలయాలు, మన వాక్‌స్వాతంత్ర్యము, మద్యపానము, ఋణభార నివారణ వంటి చిన్న పుస్తకాలు అట్టి ప్రచురణలలో కొన్ని.

ఆంధ్రోద్యమ వ్యాప్తిని గమనించిన పంతులుగారు ఆంధ్రజన సంఘం కార్యకలాపాల పరిధిని పెంచడం అవసరమని భావించారు. అరవై లక్షలకు మించిన నిజాం రాష్ట్రాంధ్రుల సమస్యలను తెలిసికోవడానికీ, వారి సమిష్టి అభిప్రాయాన్ని నిర్మించడానికీ ఒక మహాసభ అవసరమని ప్రముఖులు, విద్యాధికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పంతులుగారు ఇందుకు తగు ప్రాతిపదికను సిద్ధంచేయగా 1930 మార్చి 3వ తేదీన మెదక్ జిల్లాలోని జోగిపేటలో మొట్టమొదటి ఆంధ్రమహాసభ సమావేశం జరిగింది. ఈ సభకు అతికష్టంమీద పంతులుగారు నిజాం ప్రభుత్వ అనుమతిని సంపాదింపగలిగారు. ప్రభుత్వం ఈ దిగువ షరతులు విధించి అనుమతి ఇచ్చింది. సభాధ్యక్షుడు పరదేశీయుడు కాకూడదు. అంటే గైర్ ముల్కీ కారాదు. నిజాం రాష్ట్రవాసులు ముల్కీలు. నిజాం రాష్ట్రానికి చెందనివారు గైర్ ముల్కీలు. నిజాం ప్రభుత్వం ఇటువంటి విభజన ఒకదానిని అమలులోకి తెచ్చింది. కాబట్టి నిజాం ఆంధ్రమహాసభ అధ్యక్షుడు హైదరాబాదు రాష్ట్రవాసియై ఉండాలి. ఇతర మతస్థులకు మనస్తాపంకాని, అనుమానంకాని కలిగే స్థితి తేరాదు. సభలో రాజకీయాల ప్రసక్తి ఉండకూడదు. అంటే రాజకీయాలు

చర్చింపరాదు. ఈ ప్రథమాంధ్ర మహాసభకు విఖ్యాత సాహిత్యవేత్త, రచయిత, గోలకొండ పత్రిక సంపాదకులు అయిన సురవరం ప్రతాప రెడ్డిగారు అధ్యక్షత వహించారు ఈ ప్రథమ మహాసభ 'ఆంధ్రదేశపు మట్టి అది మాకు కనకము' అనే గేయంతో ఆరంభం కావడం గమనార్హమైన విశేషం. హైదరాబాదు సంస్థానంలో నివసించే తెలుగువారిలో 'మేము ఆంధ్రులము. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి నాగరికత మాకు గర్వకారణమైనవి' అనే భావాన్ని ఏదో ఒకవిధంగా కలుగజేయడమే ఆంధ్రోద్యమం మొదటిదశలో ముఖ్య దృక్పథంగా ఉండేది. దీనికి పంతులుగారు బహుజాగ్రత్తగా, సర్వజన సమ్మతమైన రీతిలో కార్య రూప మిచ్చారు. పంతులుగారి దృష్టిలో ఆంధ్రమహాసభ తెలంగాణా ప్రజల జాతీయోద్యమం. భారత ప్రజలకు ఇండియన్ నేషనల్ కాంగ్రెసు ఎటువంటిదో తెలంగాణావారికి ఆంధ్రమహాసభ అటువంటిదని వారికి అంతర్గతంగా ఒకభావం ఉండేది. నిజాం రాష్ట్రాంధ్రులు సంకల్పించుకొన్న ఆంధ్రమహాసభకు 1885 లో బొంబాయిలో ఉమేశ్ చంద్ర బెనర్జీ అధ్యక్షతన 70 మంది ప్రతినిధులతో 1,000 మంది ప్రేక్షకులతో సమావేశమైన దేశీయ మహాసభ (అనగా భారత జాతీయ కాంగ్రెసు) మొదటి సమావేశాన్నే పంతులుగారు ఒక ఒరవడిగా పెట్టు కొన్నారు. తెలంగాణాకు ఆంధ్రోద్యమము ఒక జాతీయోద్యమం అయింది.

మహబూబునగర్‌జిల్లా షాద్‌నగర్‌లో జరుగవలసిన రెండవ ఆంధ్ర మహాసభకు జిల్లా తాలూకాదారు అనుమతి ఇవ్వక, విషయం ప్రభుత్వానికి నివేదించాడు. అప్పటి పోలీసుశాఖ మంత్రి టి. జె. టాస్కర్ ఆంధ్ర జన కేంద్రసంఘం కార్యదర్శి అయిన హనుమంతరావు పంతులుగారిని తమవద్దకు పిలిపించుకొని దాదాపు రెండుగంటలసేపు సంభాషణ జరిపి, యాభై ప్రశ్నలడిగి అనుమతి ఇస్తామని వాగ్దానం చేస్తూ "మీఉద్యమంలో

ఈ రాష్ట్రమునకు మేలు చేయదగిన యోగ్యతలు చాలా కలవు. అయి నను ముందెన్నడైన ఇది అపాయకరమైనదిగా పరిణమించగలదు" అన్నాడట. అందుకు పంతులుగారు "అటువంటి పరిణామం కలుగ జేయము" అని హామీ ఇచ్చారు. ఆంగ్లేయుడు కాబట్టి ఉద్యమం యోగ్య తలు కలదని అంగీకరించాడు. అదే ఏ జంగ్‌గారో అయితే ఆయన గారికి అన్నీ దోషాలే కనిపించేవి. ఆ కాలంలో నిజాం ప్రభుత్వ మంత్రివర్గంలో రెవిన్యూ పోలీసు శాఖలను ముందు జాగ్రత్తగా ఆంగ్లేయ మంత్రికి అప్పగించడం ఆనవాయితీగా ఉండేది. పోలీసు మంత్రి పంతులుగారిని పిలువనంపిన లేఖలో పొరపాటున ఉదయం 9 గంటలకు కలుసుకోవలసిందని వ్రాశాడు. పంతులుగారు అలాగే ఉదయమే వెళ్ళారు. కాని ఆయన లేకపోవడంచేత ఇంటికి తిరిగి వచ్చారు. ఇంటికి తిరిగి వచ్చేసరికి మంత్రిగారి కారు వుంది. వారి నౌకరు ఉత్తరంతో సహా హాజరుగా ఉన్నాడు. ఆ కారులో వీరిని వెంటనే రావచ్చునని, లేదా సాయంకాలం రావలసిందని లేఖలో తెలిపారు. పంతులుగారు కారును పంపించివేసి సాయంకాలం వెళ్ళి టాస్కర్‌ను కలిశారు. ఆంగ్లేయుడైనా ఆయన కర్తవ్య నిర్వహణ చాతుర్యం, తన తప్పిదాన్ని ఒప్పుకొనే ఉదారమైన న్యాయబుద్ధి, సౌజన్యం పంతులుగారిని ఆకర్షిం చాయి. ఈ మంత్రి ఆంధ్రోద్యమం ఎడల సద్భావం కలవాడై సహాయ మొనర్చినాడని కూడా పంతులుగారు అంగీకరించి వున్నారు.

తర్వాత మూడవ ఆంధ్రమహాసభ మహబూబునగర్ జిల్లా కొల్లాపురంలో జరుపుకోవడానికి నిజాం మంత్రిమండలి సమేతులైన ప్రధానమంత్రి మహారాజా సర్ కిషన్ పర్షాద్ బహదూర్‌వారు అనుమతి నిరాకరించగా, పంతులుగారు ఆంధ్రోద్యమం రాజకీయమైనది కాదనీ, ఇది తెలంగాణావాసుల సారస్వత నైతిక సాంఘికాభివృద్ధికొరకు మాత్రమే

ఉద్దేశింపబడినదనీ, తెలంగాణాలో మరెక్కడైనా సభ జరుపుకోవడానికి అనుమతి ఇవ్వమనీ విజ్ఞప్తులు పంపారు తుదకు అనుమతి ఇస్తూ రాజకీయ, విద్యా విషయాలను గూర్చి ప్రభుత్వంయొక్క పాలసీనిగాని ఆజ్ఞలనుగాని చర్చించుట విమర్శించుట కూడదంటూ, ప్రభుత్వం విధించిన ఈ షరతును మహాసభ నిర్వాహకులు అతిక్రమించకుండా వుండేటందుకై పంతులుగారిని రెండువేల రూపాయల నగదు జమానతు ఇవ్వమని కోరారు. అందుకు ప్రభుత్వంవారు చెప్పినట్లుగానే సభ జరుపుతామనీ, జమానతు షరతును తొలగించి అనుమతి ఇవ్వవలసిందనీ కోరుతూ కేంద్రసంఘంచే తీర్మానం చేయించి పంతులుగారు దానిని ప్రభుత్వానికి పంపారు. చివరకు పోలీసుశాఖ మంత్రి కేంద్రసంఘం వారికి దర్శన మిస్తామంటే పంతులుగారు, బూర్గుల రామకృష్ణారావుగారు వెళ్ళి ఆయనను చూచారు. వాదోపవాదాలు జరిగాయి. అంతకు పూర్వం జరిగిన రెండవమహాసభలో చేయబడ్డ తీర్మానాలపై ఆక్షేపణలు లేవదీశారు. తర్వాత ఎప్పుడో మహాసభకు అనుమతి ఇచ్చారు.

ఇట్లా ప్రభుత్వంవారు కల్పింపదలచిన అడ్డంకులను పంతులుగారు అధిగమిస్తూ, వారి ఉద్దేశమేమిటో పసిగట్టుతూ ఉండేవారు. ఆటంకాలకు నిరుత్సాహపడక, పట్టుదలతో కార్యార్థియై కృషిచేసేవారు. ఒకవేళ పంతులుగారికి ప్రభుత్వం విధించిన షరతులు హీనాతిహీనములని తోచినా, ఆ కాలంలో తెలంగాణా కార్యకర్తలు ఎట్టి షరతులకైనా తలఒగ్గి, మహాసభలు జరుపుకోవడమే మంచిదికాని, కోపంతో లేదా నిరాశతో సభలు మానుకోవడం లాభప్రదంకాదని భావిస్తూ ఉండేవారు. పంతులుగారు వారితో ఏకీభవించి 'అనువుగానిచోట అధికులమనరాదు' అన్న సూక్తిని జ్ఞప్తికి తెచ్చుకొని, గోపాలకృష్ణ గోఖలే చెప్పిన 'అది అపజయాల కాలం' అన్నమాట గుర్తుకు తెచ్చుకొని ఆంధ్రోద్యమం

సజీవంగా ఉండటానికై సర్దుకు పోయేవారు. ఓపిక, తాలిమి, సహన భావం ఆంధ్రోద్యమానికి జయం చేకూర్చాయని పంతులుగారి నమ్మిక.

1931 లో రెండవ ఆంధ్రమహాసభ నల్లగొండ జిల్లా దేవరకొండలో బూర్గుల రామకృష్ణారావుగారి అధ్యక్షతన జరిగింది. మూడవ మహాసభ 1934లో ఖమ్మంలో పులిజాల వెంకటరంగారావుగారి అధ్యక్షతన జరిగింది. కరీంనగర్‌జిల్లా సిరిసిల్లలో 1935 లో జరిగిన చతుర్థ ఆంధ్ర మహాసభకు మాడపాటి హనుమంతరావు పంతులుగారే అధ్యక్షులు. 1936 లో మహబూబునగర్‌జిల్లా షాద్‌నగర్‌లో జరిగిన అయిదవ మహాసభకు కొండా వెంకటరంగారెడ్డిగారు అధ్యక్షులు. 1937 లో జరిగిన నిజామాబాదు మహాసభకు మందుముల నరసింగరావుగారు అధ్యక్షులు. 1940 లో మల్కాపురంలో జరిగిన మహాసభకు మందుముల రామచంద్రరావుగారు అధ్యక్షులు. 1941 లో చిలుకూరులో జరిగిన మహాసభకు రావి నారాయణరెడ్డిగారు అధ్యక్షులు. 1942 లో ధర్మవరంలో జరిగిన మహాసభకు మాదిరాజు రామకోటీశ్వరరావుగారు అధ్యక్షులు. 1943 లో హైదరాబాదులో జరిగిన మహాసభకు కొండా వెంకట రంగారెడ్డిగారు అధ్యక్షులు. వీరితో పోటీచేసిన కమ్యూనిస్టు నాయకుడు బద్దం యల్లారెడ్డిగారు ఓడిపోయారు. 1944 లో భువనగిరిలో జరిగిన మహాసభకు రావి నారాయణరెడ్డిగారు అధ్యక్షత వహించారు. ఈ భువనగిరి మహాసభను గూర్చి హనుమంతరావు పంతులుగారు వారు రచించిన 'తెలంగాణా ఆంధ్రోద్యమము' అనే చరిత్రలో "మే 1943 నుండి మే 1944 వరకు గడచిన కాలము తెలంగాణా ఆంధ్రోద్యమ చరిత్రలో చాల క్లిష్టమును, మనస్తాపమును కలిగించునట్టిదియు అయినదని విచారముతో ఒప్పుకొనవలసి యున్నది. ఈ నడుమ కార్యకర్తలలో కలిగిన తీవ్రము లగు అభిప్రాయ భేదములకును, ఒక పక్షము వారి అత్యంత ఉద్ధృతము

నకును పరిణామముగా భువనగిరిలో జరిగిన ఆంధ్రమహాసభ కేవలము ఏక పక్షీయమైనదిగా తేలినది" అని వ్రాశారు. దీనితో ఆంధ్రమహాసభ రెండుగా చీలిపోయింది. ఒకటి జాతీయ ఆంధ్ర మహాసభ. రెండవది కమ్యూనిస్టుల ఆంధ్రమహాసభ. జాతీయవాదులు భువనగిరి మహాసభను బహిష్కరించి 1945 లో మడికొండలో మందుముల నరసింగరావుగారి అధ్యక్షతన పన్నెండవ మహాసభ జరుపుకొన్నారు. హనుమంతరావు పంతులుగారు జాతీయ మహాసభ పక్షాన నిలిచారు. కమ్యూనిస్టులు వారి మహాసభను ఖమ్మంలో రావి నారాయణరెడ్డిగారి అధ్యక్షతన జరిపారు. పదమూడవ ఆంధ్రమహాసభ 1946లో మెదక్ జిల్లా కందిలో సర్దార్ జమలాపురం కేశవరావుగారి అధ్యక్షతన జరిగింది. కంది మహాసభ తర్వాత ఆంధ్రమహాసభ, మహారాష్ట్ర పరిషత్తు, కర్ణాటక పరిషత్తులతోసహా స్టేట్ కాంగ్రెసులో విలీనమైంది. మెదకుజిల్లా జోగిపేటతో మొదలైన ఆంధ్ర మహాసభ అదే మెదకుజిల్లా కంది మహాసభతో ముగిసి, జాతీయ సంస్థతో కలిసిపోయింది. ఇది గుర్తుపెట్టుకోవలసిన అంశం.

ప్రతి ఆంధ్రమహాసభతోపాటు మహిళాసభకూడా విడిగా జరిగే పద్ధతిని పంతులుగారు ప్రవేశపెట్టారు. ఆంధ్ర మహిళాసభలకు అధ్యక్షత వహించిన విదుషీమణుల వివరాలు ఇవి :

| | | | |
|---|---|---|---|
| 1930 | జోగిపేట | ... | నడింపల్లి సుందరమ్మ |
| 1931 | దేవరకొండ | ... | టి. వరలక్ష్మమ్మ |
| 1934 | ఖమ్మం | ... | యల్లాప్రగడ సీతాకుమారి |
| 1935 | సిరిసిల్ల | ... | మాడపాటి మాణిక్యమ్మ |
| 1936 | షాద్‌నగరు | ... | బూర్గుల అనంతలక్ష్మీదేవి |
| 1937 | నిజామాబాదు | ... | నందగిరి ఇందిరాదేవి |
| 1940 | మల్కాపురం | ... | యోగ్య శీలాదేవి |

| | | | |
|---|---|---|---|
| 1941 | చిలుకూరు | ... | రంగమ్మ ఓబులరెడ్డి |
| 1942 | ధర్మవరం | ... | రంగమ్మ ఓబులరెడ్డి |
| 1943 | హైదరాబాదు | .. | యల్లాప్రగడ సీతాకుమారి |

మహిళల సభలు ఎవరి జోక్యం లేకుండా స్వతంత్రంగా జరిగే ఆచారాన్నికూడా పంతులుగారు ప్రవేశపెట్టారు. ఈ మహిళా మహా సభలకు ఒరవడి అఖిలభారత మహిళా మహాసభ. ఈ సభలు సంఘ సంస్కరణోద్దేశాలను బలపరచి, స్త్రీ జనోద్ధరణకోసం కృషిచేసి, స్త్రీలలో ఎంతో చైతన్యాన్ని వికాసాన్ని కలుగ జేశాయి. ఎన్నడూ ఇల్లువదలి బహిరంగ సభలకురాని మహిళలు సైతం ఈ మహిళాసభలకు ఉత్సాహంగా వచ్చేవారు. భారత దేశమంతటా స్త్రీల హక్కుల విష యంలో, వారి శ్రేయోభివృద్ధుల విషయంలో ద్యోతకమైన భావాలనే, ఆ దృక్పథాన్నే ఆంధ్ర మహాసభయొక్క మహిళా మహాసభలు సాధ్య మైనంతవరకూ సమర్థించి అనుసరించడం గమనించవలసిన విశేషం. భారతదేశంలో సర్వత్రా వ్యక్తమైన ప్రగతిశీల భావాలను సంస్కరణలను వీరు బలపరిచారు. వితంతు వివాహాలను సమర్థించారు. బహుభార్యా త్వాన్నీ కన్యాశుల్కాన్నీ వేశ్యావృత్తినీ నిషేధించవలసిందిగా కోరారు. తల్లిదండ్రుల ఆస్తిలో కుమార్తెలకు భాగం ఉండవలెనన్నారు. శాసన సభలలో స్త్రీలకు ప్రాతినిధ్యం ఉండవలెనని ఉద్ఘోషించారు. స్త్రీల సభ లకు పంతులుగారిచ్చిన ప్రోత్సాహం, వాటికి కల్పించిన స్వేచ్ఛాపూరిత వాతావరణం స్మరింపదగినది. ఎంత పెద్ద వ్యక్తి అయినా సరే, మహిళా సభలలో జరిగే చర్చలనుగూర్చి జోక్యం కలుగజేసుకోకుండా దృఢంగా నిలిచి, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూచారు. ఖమ్మంలో ఆంధ్ర మహిళా మహాసభ యల్లాప్రగడ సీతాకుమారిగారి అధ్యక్షతన జరుగుతూవుంది. అసలు ఆంధ్రమహా సభలంటేనే హిందువులలో

సనాతనులైనవారికి క్రింగుడుపడని వ్యవహారంగా ఉండేది. ఇక మహిళా సభలంటే స్త్రీల విషయమై ఎటువంటి చర్చలు జరుగుతాయో, ఏ సంస్కరణలు కోరుతూ తీర్మానాలు ఆమోదింపబడుతాయోనని పూర్వాచార పరాయణులు ఆందోళన చెందేవారు. కనుక ఖమ్మం స్త్రీల మహాసభకు ఆటంకాలు కల్పించారు. సనాతనులు జిల్లా అవ్వల్ తాలూక్దారును వెంటబెట్టుకొని సభజరిగే స్థలానికి వచ్చారు. అక్కడే వెలుపల నిల్చొనిఉన్న ఆంధ్రజన కేంద్రసంఘ కార్యదర్శియైన మాడపాటి హనుమంతరావుగారి వద్దకు తాలూక్దారు వచ్చి సనాతన ధర్మావలంబులైనవారికి మనస్తాపం కలిగే ఉపన్యాసాలు తీర్మానాలు జరగకుండా చేయవలసిందని కోరాడు. దానిపై పంతులుగారు "ఇది స్త్రీల సభ. నేను ఆ సభలోకి పోజాలను" అని వారికి మర్యాదగా చెప్పారు. అందుకు తాలూక్దారు "మీరువెళ్ళి అధ్యక్షురాలిని హెచ్చరించండి" అని అన్నాడు. అంతవరకూ సహనంతో ఉన్న పంతులుగారు "నేను ఆ సభలోకి ప్రవేశింపజాలను. నన్ను తమరు అరెస్టుచేసి తగినచర్య గైకొనవచ్చు" అని ఖండితంగా చెప్పారు. ఆ మీదట వారంతా వచ్చినదారినే తిరిగి వెళ్ళిపోయారు. కొంతదూరంవెళ్ళిన తర్వాత అవ్వల్ తాలూక్దారు ఆ పక్షనాయకులతో "ఇకమీదట ఇటువంటి అవకతవక ఫిర్యాదులు చేయవద్దు" అని వారిని మందలించి వెళ్ళిపోయాడు. మహిళా మహాసభ నిరాటంకంగా జరిగిపోయింది. ఆంధ్ర మహా సభలకు ఒక వంక నిరంకుశ నిజాం ప్రభుత్వం చిత్తంవచ్చినట్లు ప్రతిబంధకాలు కల్పిస్తూఉంటే, వేరొకవంక సనాతనులైన హిందువులు హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తున్నామంటూ అధికార్లను ఆశ్రయించి ఆటంకాలు కల్పించ యత్నించేవారు. అసలు ఖమ్మంలో ఆంధ్ర మహాసభ జరగకుండా నిషేధించవలెనని వారు పై అధికారులకు విన్నవించుకున్నారు. ఆంధ్రమహాసభలకు ఏదోఒక విధంగా అడ్డు తగల చూచే ప్రభుత్వానికి సనాతనుల విన్నపం ఊతగా దొరికింది. కాని మహా

సభల నాయకులు ఈ రెండు ప్రతిపక్షాలనూ ఎదుర్కొని ఖమ్మం మహా సభ జరిపారు. సనాతనులతో గొడవ ఎందుకని కొన్ని తీర్మానా లను ఖమ్మం సభలో సభానిర్వాహకులు ఉపసంహరించుకున్నారు. సనా తనులు అభ్యంతరంచెప్పిన ఒక తీర్మానం ఇట్లా ఉన్నది. "పవిత్రము లగు దేవాలయములందు ప్రాణిహింసా పూర్వకమగు నారాధన జరుపు టను ఈ మహా సభ గర్హించుచు. సాత్త్విక పూజా విధానమును మాత్రమే ఆచరణలో నుంచవలెనని కోరుచున్నది." జంతు బలిని ఖండించే తీర్మాన మిది. దీనికి సనాతనుల ఆక్షేపణ! సనాతనులకు నిరంకుశ ప్రభుత్వ ప్రాపకం!! అట్లాగే అతిబాల్య వివాహాలను ఆపి, వివాహ వయస్సును హెచ్చించి కన్యాశుల్క వరశుల్కాలను నిర్మూలించి, వివాహ వ్యయాన్ని తగ్గించాలనే తీర్మానం, నిమ్నజాతుల ఉద్ధరణకు సంబంధించిన తీర్మా నం కూడా ఆంధ్రమహాసభ నాయకులు వదులుకొని రాజీపడవలసి వచ్చిందట.*

ఆంధ్రోద్యమం మొదలైననాటినుంచి 15 సంవత్సరాలవరకూ ఇది రాజకీయోద్యమ మనిపించుకోలేదు. ఇన్నేండ్లూ ఉద్యమ నిర్వాహ కులు తమది రాజకీయోద్యమం కానేకాదని ప్రకటించుకొంటూ ప్రభు త్వానికి నచ్చజెప్పుతూ పని సాగించుకొంటూ వచ్చారు. కాని నిజామా బాదులో మందుముల నరసింగరావుగారి అధ్యక్షతన జరిగిన ఆరవ ఆంధ్రమహాసభలో అప్పటి నిజాం ప్రభుత్వం రాజ్యాంగ సంస్కరణ లను సూచించడానికై ఏర్పాటుచేసిన అయ్యంగార్ కమిటీని బాధ్యతా యుత ప్రభుత్వంయొక్క తత్వంపై ఆధారపడ్డ రాజ్యాంగ సంస్కరణ లను సిఫారసు చేయవలసిందని కోరడంతో ఇది రాజకీయోద్యమ

---

* '50 సంవత్సరాల హైదరాబాదు'—
రచయిత : మందుముల నరసింగరావు

స్వరూపం దాల్చింది. ఆ తర్వాత నిజాం ప్రభువు ప్రకటించిన సంస్కరణలు అతిహీనములు, అభివృద్ధి నిరోధకములు కావడంతో జన సామాన్యంలో ఆంధ్రమహాసభ ప్రబోధం హెచ్చింది. అయితే పంతులుగారు ఆంధ్రోద్యమం రాజకీయోద్యమం కాదని నిజాం ప్రభుత్వ అధికారులకు చెబుతూ వచ్చారుకదా. రాజకీయ సంస్థగా మారినప్పుడు దీనితో సంబంధం వదులుకోగలమని అప్పుడు మంత్రిగా ఉన్న ఆంగ్లేయునికి వాగ్దానం చేశారుకదా! ఆ వాగ్దానాన్ని వీరు పాటించి ఆ సంస్థతో సంబంధం వదులుకొంటున్నట్లు అప్పటి ఇంగ్లీషు మంత్రులకు తెలియజేశారని అభిజ్ఞులు అన్నారు.

తెలంగాణా ఆంధ్రోద్యమానికి ప్రజాభిమానం లభించడానికీ ఉద్యమం దినదినాభివృద్ధి పొందడానికీ ముఖ్యకారణం ఆంధ్ర మహాసభ ప్రజాజీవితంలో అన్ని వర్గాలవారికి సంబంధించిన ఆర్థిక సాంఘిక సమస్యలను చేపట్టి, వాటిని గూర్చి తీర్మానాలు ఆమోదించి, ఆ తీర్మానాలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరకృషి జరపడమే. ఆంధ్ర మహాసభ కర్షకులు, కౌలుదార్లు, కార్మికులు, వర్తకులు మున్నగువారి సమస్యలను శ్రద్ధగా పరిశీలిస్తూ ఉండేది. గ్రామస్థుల ఋణభారం, నీటిపారుదల విధానం, ఆబ్కారీ విధానం, అటవీశాఖ విధానం, గ్రామాలలో విద్యాప్రచారం, గ్రామీణుల ఆరోగ్యం, జాగీరు ప్రజల కష్టనష్టాలు, జనసామాన్యవిద్య, మాతృభాష ద్వారా విద్యాబోధన, ఉన్నతవిద్యకు ప్రభుత్వం పరిమితి విధించకుండా దానిని వ్యాప్తం చేసేందుకు కృషి, మద్యపాన నిరోధంవంటి అనేక సమస్యలపై ఆంధ్రమహాసభ తీర్మానాలు ఆమోదించి ఆందోళనజరిపింది. హనుమంతరావు పంతులుగారు, ఇతర నాయకులు గ్రామాలకు వెళ్ళి గ్రామస్థుల కష్టాలు అవసరాలు తెలుసుకొని, వాటి నివారణకై ఏమి చేయవలసిందీ స్థానికులతో చర్చలు జరిపేవారు. ఆ సారాంశంతో

ఆంధ్రమహాసభ స్థాయీసంఘం పక్షాన ప్రభుత్వశాఖలకు లేఖలు పంపి, ఆ వ్యవహారాలను ఉన్నతాధికార్లు పరిష్కరించేట్టు చూచేవారు. ముఖ్యంగా వర్తకుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగాను, వెట్టిచాకిరీ నిర్మూలనలో కొంతవరకూ ఆంధ్రమహాసభ విజయం సాధించింది.

నిజాం రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగులు జిల్లాల పర్యటనకు వచ్చినప్పుడు వర్తకులు వారి భోజనానికి కావలసిన సామగ్రిని సప్లయి చేయవలసి వచ్చేది. ఆ సామగ్రికి డబ్బు అసలే చెల్లింపకపోవడమో, ఒకవేళ చెల్లించినా ఏ కొద్దిగానో చెల్లించడం జరిగేది. ఈ దోపిడీవల్ల వర్తకులు నష్టపోతూ ఉండేవారు. ఈ బాధను తప్పించుకోవడానికై గ్రామ వర్తకులు 'వంతు పద్ధతి'ని కూడా ఏర్పరచుకొన్నారు. కొందరు ఒకసారి, మరికొందరు ఇంకొకసారి సామగ్రి సప్లయిచేసేవారు. అంటే దండుగను పంచుకొనేవారన్నమాట. ఆంధ్రోద్యమం ఆరంభమైన కొద్దిరోజులకే వర్తకసంఘాలు స్థాపింపబడ్డవి. ఆంధ్రజన కేంద్రసంఘం పక్షాన 'వర్తకస్వాతంత్ర్యము' అనే చిన్న పుస్తకం కూడా ప్రకటింపబడింది. ఈ వర్తకసంఘాలు పర్యటనలకొచ్చే అధికార్లు తమకు కలిగిస్తూ ఉన్న బాధలను, నష్టాన్ని ప్రభుత్వదృష్టికి తీసుకురావడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఈ జబర్దస్తీ తగ్గుముఖం పట్టింది. "మా గ్రామంలో వర్తక సంఘం స్థాపించబడింది" అని ఒక్కమాట చెబితేచాలు, ప్రభుత్వోద్యోగులు నిరుత్తరులై పోయేవారట. క్రమేణా వర్తకుల కష్టాలు తొలగిపొయ్యాయి. కొన్నేండ్ల తర్వాత హనుమంతరావు పంతులుగారు నల్లగొండ జిల్లాలో ఒక చిన్న గ్రామంలోనుంచి వెళ్ళుతూ ఉన్నారు. అక్కడ కనపడ్డ వైశ్య సోదరులతో మాట్లాడి వారి యోగక్షేమాలు విచారించుతూవున్న సందర్భంలో వారు "అయ్యా, మా గ్రామాలలోని వైశ్యుల కష్టాలన్నీ ఇరవైయేండ్ల క్రిందనే తొలగిపోయాయి. వాటిని

తొలగించిన ఉపకారం ఆంధ్రసంఘం వారిది" అని ఎంతో సంతోషంతో చెప్పుకొని పంతులుగారికి తమ కృతజ్ఞతలు తెలిపారు. అయితే అట్టి నిశ్చింతవల్ల వర్తకసంఘాలు పూర్తిగా మూలపడినందుకు పంతులుగారు ఆ తర్వాత విచారం వెలిబుచ్చారు. సాంఘికంగా వారు చేయవలసింది ఎంతోవుంది అని వారన్నారు.

అట్లాగే వెట్టిచాకిరి నిర్మూలనానికికూడా ఆంధ్ర మహా సభ కృషి సల్పింది ఆ రోజులలో ప్రభుత్వాధికార్లు వారి పరివారంతో సేవకులతో జిల్లాల పర్యటనకు వెళ్ళినపుడు కొన్ని రోజులు క్యాంపువేసేవారు. అప్పుడు కుమ్మరి నీళ్ళుతేవాలి, వంటచేయాలి. చాకలి పాత్రలు కడగాలి, బట్టలు ఉతకాలి, హరిజనులు అధికార్ల మూటాముల్లెలు ఒక గ్రామంనుంచి మరొక గ్రామానికి మోసుకుపోవాలి చేయించుకొన్న ఈ పనులకు కూలీ ఇచ్చేవారుకాదు. ప్రతి ఆంధ్ర మహా సభలోనూ ఈ వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా ప్రబోధం జరిగింది. తీర్మానాలుచేసి ప్రభుత్వానికి పంపారు. అయితే ప్రభుత్వ ఫ్యూడల్ వైఖరివల్ల వర్తకుల కష్టాలు నివారణ అయినట్లుగా వెట్టిచాకిరీ చేసేవారి అవస్థలు తొలగిపోనందుకు హనుమంతరావు పంతులుగారు అసంతృప్తి వెల్లడించారు. చివరకు వెట్టి చాకిరీ అనేది కాంగ్రెసు ఆధ్వర్యాన ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతనే పూర్తిగా తొలగిపోయింది.

తెలంగాణా ఆంధ్రోద్యమంలో సంఘ సంస్కారోద్యమం ఒక భాగంగా సాగింది. సహపంక్తి భోజనాలు, అస్పృశ్యతా నివారణ, స్త్రీ విద్య, వితంతు వివాహాలు, రజస్వలానంతర వివాహాలు, కుల ప్రసక్తి లేకుండా, భాషాపరిధులనుబట్టి ఉద్యమాన్ని నడపడం, వీటన్నింటివల్ల ఇక్కడి ప్రజానీకంలో ఆంధ్రోద్యమ కాలం నుంచే సంఘ సంస్కరణ దృక్పథం వేళ్ళూనింది. హనుమంతరావు పంతులుగారు

వీరేశలింగంగారి సంఘ సంస్కరణోద్యమంచే ప్రభావితులై ఆంధ్రో ద్యమంలో సంఘసంస్కరణకు కూడా ప్రాముఖ్యమిచ్చి ఉద్యమాన్ని నడపడంవల్లనే ఇది సాధ్యమైంది. ఇట్లా పంతులుగారు ఏకకాలంలో పలు ఉద్యమాలను ప్రవర్తింపజేయవలసి వచ్చింది. కొత్తగా బాటవేసేవారు డొంకలనూ దుబ్బులనూ తొలగించి మార్గాన్ని సాఫు చేయవలసి వుంటుంది కదా !

ఆంధ్రోద్యమ ప్రచారము, ఆందోళన పూర్తిగా రాజకీయమైనవి కావు. నిజాం ప్రభుత్వానికి కూడా ఈ ఉద్యమం కాంగ్రెసు ఉద్యమం వంటిది కాదని తెలుసు. అయితే అది ప్రజలలో ప్రబోధం కలిగిస్తూ ఉంది. వారిని నిద్రనుంచి మేల్కొల్పుతూ వుంది. ఎనిమిది పెద్ద జిల్లాల భాషఅయిన తెలుగు వ్యాప్తిజెందుతూ వుంది. పైగా పేరే ఆంధ్ర మహాసభ. వీరి ప్రచార కార్యక్రమమంతా తెలుగులోనే జరుగుతూవుంది. గ్రామీణుల మేలుకొరకై ప్రభుత్వంవారి ఆజ్ఞల అన్వయం తాత్పర్యం ప్రజలకు విడమరచి చెప్పబడుతూ వుంది. శాస నాలనూ నియమ నిబంధనలనూ విజ్ఞులైనవారు న్యాయవాదులు పరిశీలించి వాటి అసలు విషయాలను ప్రజలకు తెలియజెప్పి, వాటిని ఎట్లా ఎదు ర్కోవాలో తెలియజెప్పబడుతూ వుంది. ప్రజలకు క్రమేణా వారి హక్కులు తెలియవస్తున్నాయి. వీటన్నిటినీ చూడగా ఈ ఉద్యమం ముందు ముందు ఎట్లా వుంటుందోనని నిజాం ప్రభుత్వాధికార్లకు అనుమానం కలుగుతూ ఉండేది. జిల్లా అధికార్లు ప్రభుత్వానికి రహస్యంగా రిపోర్టులు పంపే వారు. పోలీసులు కార్యకర్తలను వెన్నంటి తిరుగుతూ ఉండేవారు. అయితే పంతులుగారు, ఇతర నాయకులు పెట్టనికోటవలె ఉండి, ఆంధ్ర మహాసభ చట్టబద్ధమైన సంస్థగా, బాధ్యత ఎరిగిన సంస్థగా పనిచేయడం

వల్ల కార్యకర్తలు ప్రజలు అధికార్లకు భయపడనక్కర లేకపోయింది. పైగా పంతులుగారు ఆంధ్రమహాసభ చేస్తూవున్న కృషి నిర్మాణాత్మకమైనదని ఎప్పటికప్పుడు రుజువుచేస్తూ ఉండేవారు. ఆంధ్ర మహాసభల సందర్భంలో ప్రభుత్వశాఖలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి సభాస్థలి వద్ద ఆ శాఖల ప్రదర్శనములు ఏర్పాటు చేయించేవారు. వారిచే ఉపన్యాసాలు ఇప్పించేవారు. మతప్రసక్తిని వ్రాతలలోగాని ప్రసంగాలలో కాని రానిచ్చేవారుకాదు. ఇట్లా ఒక కట్టుబాటు క్రమశిక్షణతో నడపబట్టే ప్రథమ ఆంధ్రమహాసభకు నిజాం మంత్రిమండలి కార్యదర్శి నవాబ్ మెహదీ నవాజ్ జంగ్ ఒక సందేశం పంపుతూ, "ఆంధ్రమహాసభ అనగా తెలుగుదేశమందలి గ్రామ వాస్తవ్యులగు వ్యవసాయకులయొక్క మహసభ అని చెప్పవచ్చును." అన్నారు. ఈయన ఆ తర్వాత రాష్ట్రంలో ఏర్పడ్డ కాంగ్రెసు మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. ప్రభుత్వ వర్గాలలో ఏదైనా అనుమానం పొడసూపితే పంతులుగారు వెంటనే వారికి తగు సమాధానం చెప్పి ఆంధ్రోద్యమ నౌకను పదిలంగా సురక్షితంగా ముందుకు నడిపిస్తూ ఉండేవారు. ఉర్దూపత్రికలుకూడా ఇది మత పాక్షికోద్యమం కాదని అంగీకరించాయి.

అన్నిటికన్న చెప్పుకోవలసిన ముఖ్యాంశ మేమిటంటే— ఆంధ్రోద్యమం తెలుగుభాషకు జరిగిన ఒక అవమానంవల్ల ఆరంభమైంది. కాని పోనుపోను అది మహారాష్ట్ర, కన్నడ సోదరుల సద్భావాన్నీ సహకారాన్నీ పొందగలిగింది. ఆంధ్రమహాసభ పనిచేస్తున్న తీరును చూచి మహారాష్ట్రులు, కన్నడులు వారివారి మహాసభలు ఏర్పాటు చేసుకొన్నారు. 1937 లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతీయసభలు మొదటిసారిగా జరిగాయి. 1946 లో ఈ మూడు ప్రాంతీయ మహాసభలు చక్కని సుహృద్భావంతో స్టేట్ కాంగ్రెసులో విలీనమయ్యాయి. తర్వాత స్టేట్ కాంగ్రెసులో

వచ్చిన విభేదాలు దృక్పథాలకూ, ఆదర్శాలకూ, సిద్ధాంతాలకూ సంబం ధించినవేగాని, భాషా విషయకమైనవికావు.

హనుమంతరావు పంతులుగారి మితవాదధోరణి ఆంధ్రోద్యమం పట్ల ఆనాటి కొందరు అధికారుల వైఖరిని ప్రభావితం చేయడం గమ నించవలసిన అంశం. హైదరాబాదు రాజ్యానికి రెవిన్యూ పోలీసుశాఖల మంత్రిగా పనిచేసిన టి. జె. టాస్కర్ ఐ. సి. యస్. మహాశయుడు ఇక్కడ మంత్రిపదవిని విరమించుకొని వేరొక పదవిపై డేరాడూన్ వెళ్ళిన తర్వాత పంతులుగారికి వ్రాసిన స్వకీయలేఖలో "మీతోను, మీ ద్వారా ఆంధ్రుల అవసరములతోను, వారి వాంఛలతోను పరిచితుడ నగుట నాకు సంతోషము చేకూర్చి యుండినది. నా అనుభవాన్నిబట్టి మితవాదిత్వమే తుదకు జయముపొంది తీరును" అని వ్రాశాడు.

ఇట్లా మితవాద వైఖరితో నడపబడినప్పటికీ ఆంధ్రోద్యమాన్ని గూర్చి అప్పటి నిజాం ప్రభుత్వానికీ, వారి ఉన్నతాధికార్లకూ ఒక సందేహం పట్టి పీడిస్తూ ఉండేది. ఈ తెలంగాణా వారు భాష పేరుతో దేశీయులలో మాతృభాషాభిమానాన్ని పూరిస్తూ ఉద్యమం నడుపు తున్నారు. మరి అవతల మద్రాసు రాష్ట్రంలో కూడా కొన్ని తెలుగు జిల్లాలున్నాయి. తెలంగాణావారూ, మద్రాసు ఆంధ్ర ప్రాంతంవారూ, భాష ఒకటే కాబట్టి ఏకమైపోతే నిజాం రాష్ట్రం సంగతి ఏమికాను ? ఈ సంశయం వారిలో, ముఖ్యంగా మేధావులైన వారిలో ఉండేది. ఒక మారు మాడపాటి హనుమంతరావు గారితో అప్పటి నిజాం ప్రభుత్వ ప్రచురణల శాఖాధ్యక్షుడైన నవాబ్ అలీయావర్‌జంగ్ (ఈయన నిజాం ప్రభుత్వంలో అనేక ఉన్నత పదవులలో ఉన్నాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడుగా కూడా పనిచేశాడు. జవహరలాలు నెహ్రూ గారి దృష్టిలో పడి రాయబారిగా, గవర్నర్‌గా కూడా పని

చేశాడు) గారు "మీ ఆంధ్రోద్యమం యొక్క ఉద్దేశం ఈ రాజ్యంలో వున్న ఆంధ్ర జిల్లాలను మద్రాసు ప్రాంతంలోని ఆంధ్ర జిల్లాలతో కలిపివేయ వలెనని ఉన్నట్లు ప్రభుత్వం వారికి తెలియవచ్చింది" అని అన్నాడట. అందుకు పంతులుగారు "ఇది మా ఆంధ్రోద్యమం యొక్క ఆశయం కానేరదు. తాము ఈ విషయమున యథార్థము పరిశీలింపక తప్పు అభిప్రాయపడుతున్నారు" అని వెంటనే ఖండించారు. అంటే నిజాంరాష్ట్రం మూడు భాషా ప్రాంతాల కృత్రిమ కలయిక అని నిజాం ప్రభుత్వపు మేధావి వర్గం ఆ రోజులలోనే తెలుసుకొన్నదన్న మాట. చిత్రమేమిటంటే నిజాం వర్గీయులు భయపడినట్లే, పంతులుగారు కాదని అన్నప్పటికీ, చివరకు జరిగింది!

ఆంధ్రమహాసభ విస్తృతమైన ప్రజా వ్యవహారాలలో నిమగ్నమై, భాషా సాహిత్యాలపై దృష్టిని కేంద్రీకరింప లేకపోవడం గమనించిన విద్యావంతులైన యువకులు కొందరు ఆంధ్రభాషా సంస్కృతుల ప్రచారం ప్రధాన లక్ష్యంగా ఒక సాహిత్య సంస్థను స్థాపింప సంకల్పించారు. 1942 లో ధర్మవరంలో జరిగిన నవమాంధ్ర మహాసభ సందర్భంలోనే కొందరు కవులు రచయితలు ఈ ప్రస్తావన తెచ్చారు. 1943లో హైదరాబాదులో దశమాంధ్ర మహాసభ జరిగినప్పుడు భాస్కరభట్ల కృష్ణారావు, బూర్గుల రంగనాథరావు సమావేశ కర్తలుగా 1943 మే 26 తేదీన రెడ్డి హాస్టలు గ్రంథాలయంలో లోకనంది శంకరనారాయణరావు గారి అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. అందులో నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తు అనే పేరుతో ఒక సంస్థను స్థాపించారు. హనుమంతరావు పంతులుగారు ఈ సంస్థకు మొదటి కోశాధిపతి. దీని అభివృద్ధికి వారు ఎంతగానో తోడ్పడ్డారు. తర్వాత 'నిజాం' పదమును తొలగించడం జరిగింది. ఈ సంస్థను దేవులపల్లి రామానుజ

రావు, పులిజాల హనుమంతరావు, గడియారం రామకృష్ణశర్మ ప్రభృతులు చాలా అభివృద్ధిలోకి తెచ్చారు. ఈ సంస్థ తెలంగాణాలో ఆంధ్ర భాషాభివృద్ధికీ, సాహిత్య వికాసానికీ కృషి చేసింది.

తెలంగాణాలో అనేక ఉద్యమాలతో కూడిన ఆంధ్రోద్యమాన్ని నిర్మించి, దానిని విజయవంతంగా నడిపి, సమగ్రాంధ్రం ఏర్పడటానికి దారి డొంకలు సరిచేసి రాచబాట ఏర్పరచినవారు మాడపాటి హనుమంతరావుగారు. కాబట్టే రావి నారాయణ రెడ్డిగారు వారు రచించిన 'వీర తెలంగాణా — నా అనుభవాలు జ్ఞాపకాలు' అనే స్వీయచరిత్ర వంటి గ్రంథంలో పంతులుగారిపై వారికి గల సద్భావాన్ని వెల్లడిస్తూ "తెలంగాణాలో ఆంధ్రోద్యమానికి పునాదులు వేసిన గౌరవం పంతులుగారికే దక్కుతుంది. తెలంగాణాలో తెలుగు భాషకు ఒక గౌరవ స్థానం కలిగించి, తెలుగువారికి తెలుగు భాషను నేర్పిన ఘనత కూడా వారికే దక్కుతుంది. నాబోటి యువకులెందరో ఆయనవల్ల ప్రభావితులై ఆంధ్ర వాఙ్మయంతో పరిచయ మేర్పరచుకొన్నారు. .. నిజానికి చూస్తే అటు తర్వాత ఆంధ్రుల చిరస్వప్నం ఫలించి ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అవతరణకు పంతులుగారి నిర్విరామ కృషిని స్మరించి తీరాలి" అని వ్రాశారు.

# నాల్గవ ఆంధ్రమహాసభ అధ్యక్షపదవి

హనుమంతరావుగారు నిజాంరాష్ట్ర ఆంధ్రమహాసభను స్థాపించి, దాని వ్యవస్థను నిర్మించినవారిలో ముఖ్యులైనప్పటికీ దాని అధ్యక్షపదవికి మొదట్లో దూరంగా ఉన్నారు. ఇందుకు కారణం ప్రజా సంస్థలలో పదవులపై వారికి వ్యామోహంలేదు. ఆ సంస్థల కార్యభారాన్ని వహించడంలోనే వారు శ్రద్ధాసక్తులు చూపేవారు. పదవుల ప్రసక్తి వచ్చేసరికి విద్యాధికులను ముందుంచి తాము తప్పుకొంటూ ఉండేవారు. కాని నాల్గవ ఆంధ్రమహాసభ 1935 లో జరగబోయేసరికి ఆహ్వాన సంఘంవారూ, ఇతర సంఘాలవారూ, ప్రముఖులూ అంతా ఏకవాక్యంగా కరీంనగర్‌జిల్లా సిరిసిల్లలో జరిగే ఈ చతుర్థ నిజాం రాష్ట్రాంధ్ర మహాసభకు మాడపాటి హనుమంతరావుగారే అధ్యక్షులుగా ఉండవలెనని పట్టుపట్టారు.

పంతులుగారిని హైదరాబాదునుంచి సిరిసిల్లకు తీసుకువెళ్ళిన దృశ్యం ఆంధ్రమహాసభ చరిత్రలో చిరస్మరణీయమైనది. 1935 మార్చి 26వ తేదీ ఉదయమే సిరిసిల్ల మహాసభకు వెళ్ళేవారు హైదరాబాదులో పంతులుగారి నివాసమైన "ఆంధ్ర కుటీరము"నకు చేరుకొని జయజయ ధ్వానాలు చేయసాగారు. మందుముల రామచంద్రరావుగారు పూలహారాలతో, మామిడి తోరణాలతో అలంకరించిన మోటారుకారును తీసుకువచ్చి నిలిపి తామే స్వయంగా కారు నడిపారు. అధ్యక్షులవారి కారు కదలగానే వారివెంట 18 బస్సులలో 3 కార్లలో ప్రతినిధులు బయలుదేరారు.

సిరిసిల్లకు వెళ్లే మార్గంలో తూప్రాను, కామారెడ్డి, మాచారెడ్డి, గోరెంటాల, గొల్లపల్లి గ్రామాలలో ప్రజలు అధ్యక్షులవారికి స్వాగత

యిచ్చి అందరికీ అల్పాహార విందుచేసి ఆదరించారు. సాయంసమయానికి అధ్యక్షులు సపరివారంగా సిరిసిల్ల చేరగానే ఆహ్వానసంఘంవారు స్వాగతంచెప్పి పెద్ద ఊరేగింపుతో మహాసభకొరకై నిర్మింపబడ్డ 'భీమకవి నగరము'నకు తీసుకొని వెళ్ళారు. ప్రసిద్ధ ఆంధ్రమహాకవి వేములవాడ భీమకవి కరీంనగరు జిల్లాకు చెందినవాడవడంచేత ఆయనపేరిట మహాసభ వేదిక నిర్మింపబడటం ఒకవిశేషం. అధ్యక్షుల మోటారుకారు ప్రధాన ద్వారంవద్దకు రాగానే స్వచ్ఛంద సేవకులు గౌరవవందనంచేశారు. కరతాళధ్వనులమధ్య అధ్యక్షులు మండపంలోకి ప్రవేశించారు.

ఆహ్వానసంఘాధ్యక్షులు ఆవునూరి వేణుగోపాలరావుగారు అధ్యక్షులకు ప్రతినిధులకు స్వాగతం చెబుతూ "ఇప్పుడు మనమొకనాయకుని ఏర్పరచుకోవలసి వున్నది. ఇందుకు మన ఆంధ్రోద్యమవ్యాప్తికి కారకులైన మహారాజశ్రీ మాడపాటి హనుమంతరావు హైకోర్టు వకీలుగారు అన్ని విధములా అర్హులని ఆహ్వానసంఘం అభిప్రాయపడింది వీరిని ఆంధ్రప్రపంచానికి పరిచయం చేయడం దీపం వెలుతురుతో నిండు చంద్రుని చూపినట్లగునని తలచుచు, ఈ మహాసభకు అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని ఆదర్శప్రాయంగా జరిపెదరుగాక అని శ్రీవారిని కోరుతున్నాను" అన్నారు. ఈ ప్రతిపాదనను బూర్గుల రామకృష్ణారావు, మాదిరాజు రామకోటీశ్వరరావు, కొండా వెంకటరంగారెడ్డి, బి. కేశవరావు, బోయినేపల్లి వెంకటరామనరసింహారావుగారలు బలపరచగా, మాడపాటి హనుమంతరావు పంతులుగారు చతుర్థ ఆంధ్రమహాసభ అధ్యక్ష పీఠమలంకరించి ముప్పావుగంటసేపు అధ్యక్షోపన్యాసం చేశారు.

పంతులుగారు తమ అధ్యక్షోపన్యాసంలో శ్రీనాథమహాకవి రచించిన పల్నాటి వీరచరిత్రములోని—

మానాభిమానముల్ మగటిమి మించ
ప్రబలింపగలవారు బాలురె సుమ్ము !
బాలురె పెద్దలు; బల్లిదుల్ వారె
బాలురకే వృద్ధి పరికించిచూడ !
పెద్దలు మతిచెడి పిరికి పారుదురు;
పాంచభౌతికదేహ పటిమ క్షీణించు
ధైర్యంబు తగ్గు, నుత్సాహంబు లడగు
వయసుమీరినవేళ వచ్చునా బలిమి?
కీర్తికైనను నపకీర్తికి నయిన
బాలురపై నుండు భారమంతయును

అనే పంక్తులను ఉదాహరించి ఆంధ్రోద్యమాన్ని వ్యాపింపజేసే భారం ఆంధ్ర యువజనులపైననే ఉన్నదని అంటూ "ఏ దేశమునందైనను ఏ కాలమందైనను అచ్చటి యువకులే భవిష్యత్తును నిర్మించుటకు సాధనము లగుచున్నారు. ప్రపంచ చరిత్రయంతయు నేడీ యంశ మునే ధృవపరచు చున్నది...వారి హృదయములందు తరంగితమగు చున్న యుత్సాహ ప్రభావమును నేను గ్రహించి యున్నాను. కావున కార్యరంగమున ప్రవేశించి దేశసేవకై కటిబద్ధు లగుటకుగాను ఆంధ్ర యువజనుల నాహ్వానించు చున్నాను" అంటూ ప్రబోధించారు. అంతే కాక తెలుగువారు ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవలసిన విధమును కూడా వారు సూచించారు. "మన రాష్ట్రములో గల ప్రత్యేక స్థితి గతులను దృష్టియందుంచుకొని, క్రమశిక్షణకు విధేయులై, తొందర పాటు మాని, హిందూ మహమ్మదీయ క్రైస్తవాది వివిధ మతములును, మహారాష్ట్ర కర్ణాటకాది వివిధ భాషలును గల నిజాం రాష్ట్రాంధ్రదేశ మున సమరస భావము నాదర్శముగ నుంచుకొని, దేశాభివృద్ధికై మంద

మందముగానైనను సరే, గట్టి పట్టుదలతో ముందంజ వేయవలెనని నేను యువక సోదరులను, సోదరీమణులను ప్రబోధించు చున్నాను" అన్నారు. దీనినిబట్టి తెలంగాణా ఆంధ్రోద్యమాన్ని వివిధ మతాల వారినీ, వివిధ భాషల వారినీ కూడగట్టుకొని, సామరస్యంతో ఒక జాతీయోద్యమంగా నడప వలెనని పంతులుగారు ఉద్దేశించినట్లు స్పష్ట మవుతున్నది. దీనివల్ల వారి దూరదృష్టి, విశాల దృక్పథం కూడా విశదమవుతున్నాయి.

సిరిసిల్ల ఆంధ్ర మహాసభలో పదమూడువేల మంది ప్రజలు పాల్గొన్నారు. పలు తావులనుంచి వందలకొద్ది సభ్యులు, సభ్యు రాండ్రు బస్సులలో వచ్చారు. మార్గమధ్యంలో వారికి అనేక గ్రామాల వారు బాజా భజంత్రీలతో స్వాగత మిచ్చారు. పలుచోట్ల రంగు రంగుల పూలతో పతాకాలతో కనుల పండువుగా కమానులు నిర్మిం చారు. ఎక్కడ చూచినా మహోత్సాహం వెల్లివిరిసింది. తెలంగాణం ఉర్రూతలూగిపోయింది. పంతులుగారు చిన్న పెద్ద, హెచ్చు తగ్గు భేదాలు పాటించక అందరినీ పలుకరించారు. ఆంధ్రోద్యమమనే రథాన్ని లాగడానికి ప్రతి సామాన్యుని తోడ్పాటు అవసరమేనని వారి భావం.

సిరిసిల్ల ఆంధ్రమహాసభ వేదికనుంచి విద్యా పునర్నిర్మాణం, నిర్బంధ ప్రాథమిక విద్య, ఆంధ్ర బాలికలకు మాతృభాష ద్వారా ఉన్నత విద్య బోధించుట, బాల్య వివాహాల నిరసనం, జాగీరు ప్రజల హక్కులు, గ్రామ పునర్నిర్మాణం, రైతులకు సౌకర్యాలు, బలోతా దారుల కష్టాలు, స్థానిక స్వపరిపాలన, నిమ్నజాత్యుద్ధరణ, ఆంధ్రమహా సభ నియమావళిలో మార్పులు, మొదలయిన 11 తీర్మానాలు ఆమో దింప బడ్డాయి. మహాసభ చర్చలలో పాల్గొన్న వారిలో సురవరం ప్రతాపరెడ్డి, మాదిరాజు రామకోటీశ్వరరావు, రావి నారాయణరెడ్డి,

మాడపాటి రామచంద్రరావు, అరిగె రామస్వామి ప్రభృతులున్నారు. ఆంధ్ర మహాసభకొక నియమావళిని (Constitution) ఆమోదించడం ఈ సమావేశ కార్యక్రమంలో ముఖ్యాంశం.

సిరిసిల్ల ఆంధ్ర మహాసభ తరువాత తెలంగాణా ఆంధ్రోద్యమం ఉన్నత శిఖరాల కెగబ్రాకింది. నాలుగు మహాసభలతో ప్రజల దృక్పథం విశాలమై, ఆంధ్ర మహాసభ ప్రజలను ఏక ముఖానికి తెచ్చేందుకు ఆలోచనలు జరిపే సభగానూ, తెలంగాణా వాసుల జాతీయ మహాసభగానూ ఉన్నదని యావన్మందికీ విశ్వాసం కలిగింది. ఈ ఉద్యమం తీవ్రమైన రాజకీయ పరిణామాలను కల్పించే ఉద్యమమే అని నిజాం ప్రభుత్వం ఆరాట పడజొచ్చింది. ఈ సిరిసిల్ల మహాసభ జరిగిన ఆరు నెలలకు హనుమంతరావు పంతులుగారు ప్రభుత్వ ప్రచురణల శాఖ అధ్యక్షులుగా వున్న నవాబ్ అలీ యావర్ జంగ్‌ను కలుసుకొనడానికి వెళ్ళగా మాటల సందర్భంలో ఆయన “మీ ఆంధ్రోద్యమం యొక్క ఉద్దేశం ఈ రాజ్యంలో వున్న ఆంధ్రజిల్లాలను మద్రాసు ప్రాంతంలోని ఆంధ్ర జిల్లాలతో కలిపివేయవలెనని వున్నట్లు ప్రభుత్వం వారికి తెలియవచ్చింది. నేను ఆ విషయాన్ని రాజకీయ శాఖ మంత్రికి వ్రాశాను” అన్నారట. పంతులుగారు అది తప్పు టభిప్రాయమని వెంటనే ఖండిస్తూ అటువంటి కోరిక రాజ్యాంగ విధానాన్ని బట్టి అసంభవమని అన్నారు. అంతేగాక నిజాం ప్రభుత్వానికి విశ్వాసం కలుగజేసే ఉద్దేశంతో పంతులుగారు సిపాయీల తిరుగుబాటు తర్వాత 1885 లో విక్టోరియా మహారాణి బ్రిటిషు ప్రభుత్వం దేశీయ రాజ్యాలను తన పాలనలో ఉన్న ప్రాంతంలో కలుపుకోదనీ, ఆ విధానాన్ని వదులుకున్నామనీ చేసిన ప్రకటనను ప్రస్తావించి “నేను ఈ సంవత్సరం పొడవునా ఆంధ్ర మహాసభ స్థాయీ సంఘానికి అధ్యక్షుడను. మీ అభి

ప్రాయం నిరాధారమనీ, సత్యదూరమనీ ప్రకటించడానికి నేను ఎన్నడైనా సిద్ధంగా వున్నాను" అని పంతులుగారు సమాధానం చెప్పారు.

సిరిసిల్ల మహాసభల తర్వాత ఆంధ్ర మహాసభ కార్యక్రమాలను ఆక్షేపించడానికి హైదరాబాదు ఉర్దూపత్రికలకు ఆధారాలేవీ దొరకలేదు. అంతకుముందు కొన్ని ఉర్దూపత్రికలు హిందువు అయినవాడు ఏ ప్రజాహిత కార్యాన్ని చేపట్టినా, అది మతవిషయకమైనదైనా, విద్యా వైజ్ఞానిక సంఘసంస్కార విషయాలకు సంబంధించినదైనా, అటువంటి ఉద్యమ వ్యాప్తి జరిగితే అది ఇచటి ముస్లిం ప్రభుత్వానికీ, ఇచటి ముస్లిముల అభ్యుదయానికీ భంగం కలిగించకపోదన్న భయంతో దానిని అడ్డగించడానికి సర్వశక్తులనూ ధారపోయడం వాడుకగా ఉండేది. అయితే హిందువులచే నడపబడే ఉర్దూపత్రికలూ, స్థానిక, వెలుపలి తెలుగు పత్రికలూ ఆంధ్రోద్యమ వికాసాన్ని బహుధా ప్రశంసిస్తూ వ్రాశాయి. ముఖ్యంగా యువకులలో హెచ్చు ప్రబోధం జరిగింది. ఈ సిరిసిల్ల మహాసభతోనే బద్దం యల్లారెడ్డిగారి ప్రజాహిత జీవితం ఆరంభమైంది. వీరు యువకులతో ఒక స్వచ్ఛంద సేవకుల దళాన్ని ఏర్పాటుచేసి సిరిసిల్ల ఆంధ్రమహాసభ సమావేశం సందర్భాన ఎంతో సేవచేశారు. బద్దం యల్లారెడ్డిగారు తర్వాత ప్రముఖ కమ్యూనిస్టు నాయకులుగా భారతదేశంలోనే విఖ్యాతులైనారు.

సిరిసిల్ల ఆంధ్రమహాసభ సందర్భంగా జరిగిన మహిళా మహాసభకు హనుమంతరావు పంతులుగారి సతీమణి మాడపాటి మాణిక్యమ్మగారు అధ్యక్షురాలు. తెలంగాణా ఆంధ్రోద్యమ చరిత్రలో భర్త మహాసభకు అధ్యక్షులుగాను, భార్య మహిళాసభకు అధ్యక్షురాలుగానూ ఉండడం ఈ ఒక్క పర్యాయంమాత్రమే జరిగింది. మాణిక్యమ్మగారు మహిళామహాసభను హుందాగా చక్కగా జరిపారు. తమ ఉపన్యాసంలో

స్త్రీలసమస్యలను విపులంగా ప్రస్తావించారు. నారీలోకం నూతన చైతన్య స్ఫూర్తితో ముందంజ వేయవలెనని ఆమె ఉద్బోధించారు. సిరిసిల్లసభల సందర్భంలో ఈ దంపతుల ఫోటోలు ఒకచోటచేర్చి లాకెట్లు తయారు చేయించి, విక్రయించారు. మహిళా మహాసభకు ఆహ్వానసంఘం అధ్యక్షురాలుగా జోగినేపల్లి రాధాబాయమ్మ ఉన్నారు. ఈ మహిళా మహాసభ తర్వాత విద్యావంతులైన స్త్రీలు, ముఖ్యంగా పరదాపద్ధతి పాటించేవారు ఆంధ్రోద్యమంలో, సంఘ సంస్కరణ కార్యక్రమాలలో పాల్గొనడానికి ఉత్సాహంగా ముందుకు వచ్చారు.

సిరిసిల్ల ఆంధ్రమహాసభకు అధ్యక్షులైన తర్వాత హనుమంతరావు పంతులుగారు ఆంధ్రజన కేంద్రసంఘం కార్యదర్శిపదవిని వదులుకొని ఆంధ్రమహాసభ వ్యవస్థానిర్మాణం గావించడంలో నిమగ్నులయ్యారు కేంద్రసంఘ కార్యదర్శి పదవిని మందుముల రామచంద్రరావుగారు వహించారు.



ఆంధ్ర పితామహ శ్రీ మాడపాటి హనుమంతరావుగారు,
వారి సతీమణి శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మగారు.

# రాజకీయ సంస్కరణలకు యత్నాలు

మాడపాటి హనుమంతరావుగారు వారి ప్రజాహిత జీవితంలో పలుసంస్థల కార్యనిర్వాహక వర్గాలలో ఏదో పదవియందు ఉంటూఉండే వారు. ఆ సంస్థలవారే వీరిని గౌరవార్థం అట్లా ఉండవలసిందనికోరడం కూడా జరిగేది. పదవిలో ఉన్నా లేకపోయినా, ఆ సంస్థకు తమ సేవ అవసరమని భావించిన పక్షంలో పంతులుగారు దానికి తగిన సహాయ సహకారాలు అందిస్తూ ఉండేవారు. అయినప్పటికీ కొన్ని ప్రధానసంస్థల పదవులలో వీరిపేరు కనిపించేది. వాటన్నిటినీ ఇక్కడ పేర్కొనడం సాధ్యంకాదు. పంతులుగారు నిజాంపాలిత ప్రజలసంఘం (Nizam's Subjects' League) అనేసంస్థలో కార్యనిర్వాహక వర్గ సభ్యులు. ఇది స్థానికులైన ముల్కీల హక్కులను కాపాడటానికీ (ఆ కాలంలో ఉత్తర దేశీయులు హైదరాబాదు వచ్చి ఇక్కడ ప్రాపకం సంపాదించి పెద్ద పదవులు సంపాదిస్తూ ఉండేవారు. యోగ్యతగల స్థానికులకిది అన్యాయంగా ఉండేది), పౌరసత్వపు హక్కులు పొందడానికీ, రాజకీయ సంస్కరణలు సాధించడానికీ ఏర్పాటు చేయబడింది. దీనిని ఉర్దూలో 'జమియతె రియాయాయె నిజామ్' అనేవారు. ఈ సంస్థకు ఉన్నత వంశంవారూ, విద్యాధికులూ, ఆంగ్లంలో కవిత్వం వ్రాసేవారూ అయిన సర్ నిజామత్‌జంగ్ అధ్యక్షులు. డా. లతీఫ్ సయీద్, రామచంద్ర నాయక్‌గారలు ఉపాధ్యక్షులు. బూర్గుల రామకృష్ణారావు, శ్రీనివాసశర్మ గారలు కార్యదర్శులు. కాని ఈ సంస్థ బాధ్యతాయుత ప్రభుత్వంకొరకు ప్రయత్నించేదిగా ఉన్నందువల్ల నిజాంప్రభుత్వం దీనిని విఫలం చేసింది.

నిజాం ప్రభుత్వం రాజ్యాంగ సంస్కరణలను సూచించడానికై దివాన్ బహదూర్ అరవముదయ్యంగార్ అధ్యక్షతన ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ వారికి ప్రజల మనోభావాలను అభిప్రాయాలనూ తెలియజేసి, రాజకీయ సంస్కరణల స్కీమునొక దానిని సిద్ధపరచి, వారికి సమర్పించడానికై హైదరాబాదు ప్రజా పరిషత్తు (హైదరాబాదు పీపుల్స్ కన్వెషన్) అనే సంస్థ తరఫున ప్రత్యేకంగా ఒక కమిటీ నియమింప బడింది. ఈ కమిటీకి మాడపాటి హనుమంతరావుగారు అధ్యక్షులుగా నియమింప బడటం ఒక విశేషం. పీపుల్స్ కన్వెషన్‌లో హిందూ, మహమ్మదీయ ఆంధ్ర మహారాష్ట్ర, కర్నాటక ప్రముఖులెందరో న్యాయవేత్తలెందరో ఉండగా పంతులు గారిని అధ్యక్షులుగా ఎన్నుకోవడం ఇటు ప్రజాసంస్థలలోనూ, అటు ప్రభుత్వ వర్గాలలోనూ వారిపై గల గౌరవాభిమానాలే తప్ప వేరే కారణం ఏమీలేదు. ఈ కమిటీలో ఇంకా బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకటరంగారెడ్డి, మందుముల నరసింగరావు, గోవిందరావు నానల్, జి. రామాచారి. జనార్ధనరావు దేశాయి, రాజా పన్నాలాల్ పిట్టి, శ్రీధర వామన నాయక్ ప్రభుతులు సభ్యులుగా ఉన్నారు. కుమారి పద్మజానాయుడును కూడా సభ్యురాలుగా చేర్చుకున్నారు. ఈ కమిటీ ఒక స్కీము సిద్ధ పరచి అయ్యంగార్ కమిటీకి, ప్రభుత్వానికీ సమర్పించు కొన్నది. కాని నిజాం ప్రభుత్వం ఆ స్కీము ఆచరణీయం కాదనే సాకుతో దానిని తోసిపుచ్చింది. అసలు వారికి రాజ్యాంగ సంస్కరణలు అమలు చేసే ఉద్దేశం ఉంటేకదా ! ఈ స్కీమును ఇంగ్లీషు నుండి హనుమంతరావు పంతులుగారే 'నిజాం రాష్ట్రములో రాజ్యాంగ సంస్కరణలు' అనే పేరుతో తెలుగులోకి అనువదించారు. ఇది 80 పేజీల గ్రంథం. అప్పటి ప్రజానాయకులు ఎటువంటి రాజ్యాంగ సంస్కరణలు కోరిందీ ఈ పుస్తకం తెలియజేస్తుంది.

# రచయిత

హనుమంతరావుగారు ఉత్తమ రచయిత. కవి. మొదట్లో కవిత్వం వ్రాసేవారు. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయ వ్యవస్థాపకులైన శ్రీ రావిచెట్టు రంగారావుగారు పరమపదించినప్పుడు పంతులుగారు వ్రాసిన పద్యాలు కొన్ని :

చ॥ నయగుణ భూషణుండు, పర
నారులకెల్లను సోదరుండు,
నిత్యయశు డనన్య లభ్య సముదార చరిత్రుడు
సాహసాత్ముడున్: దయకును
సౌహృదంబున కుదాత్తనిదానుడు;
సర్వసజ్జనప్రియుడగు వానినిట్లు
విపరీతపు కాలమ ! మ్రింగివైచితే !

మ॥ అమలస్వాంతత నెవ్వడాంధ్ర
సుకలావ్యాప్త్యర్థమై సత్సమాజములన్
సర్వజనోపయోగమునకై స్థాపించె,
నెవ్వానికిన్ సముదౌనాతడు గానగాబడుట
దుస్సాధ్యంబొ, యెవ్వాని నామము
నేడీగతి మాపికొంటివె
నిజాం రాష్ట్రాంధ్ర భూభాగమా !

వీరు స్వయంగా వ్రాసిన ఒక కావ్యఖండికలోని పద్యం ఇట్లా ఉన్నది :

ఫలములచేత గొన్నిటిని బల్లవసంతతిచేత గొన్నిటిన్
సలలితసౌఖ్యదాయియగు ఛాయను గొన్నిటి వేవిధాల నీ
యిలను ననేకప్రాణుల కహీనసుఖంబిడు వృక్షరాజమున్
బలుపడి పీకివైచితె తుపాన! వినాశముచేసి వైచితే!

పిరదౌసి రచించిన ఫారసీ కవితకు పంతులుగారి అనువాదం—మచ్చుకు ఒక పద్యం——

హీనుల మహోన్నతపదవి కెత్తుటయును
ఎత్తి వారి యుపకృతి నాశించుటయును
స్వీయ మానధనము బుగ్గిసేయుటగును
సర్పమును దనజేబులో సాదుటగును

అయితే ఆంధ్రోద్యమంలో నిమగ్నులైన తరువాత వీరికి పద్యాలు రచించే అవకాశమే లేకపోయింది. అంతేకాక ఆధునికకాలపు అవసరాల దృష్ట్యా వచనరచనకే వీరు తమ లేఖినిని ఉపయోగించవలసి వచ్చింది.

పంతులుగారు తొలుత రచించిన గ్రంథం బెంగాలీ నవలా రచయిత బంకించంద్ చటర్జీ వ్రాసిన సుప్రసిద్ధ నవల 'ఆనంద మఠము' నకు తెలుగు అనువాదం. అయితే అది అచ్చు కావడానికి ముందే దొరసామయ్య గారి అనువాదం ప్రచురింప బడటంచేత వీరు తమ తెనుగు సేతను ప్రకటించలేదు. తరువాత వీరు ఇటలీ దేశభక్తుడూ మహాపురుషుడూ అయిన గ్యారీబాల్డీ జీవిత చరిత్రను 1911 లో రచించారు. ఈ గ్రంథాన్ని ప్రకటిస్తామని మచిలీపట్టణములోని ఆంధ్ర భాషాభివర్ధినీ సంఘం వారు వ్రాతప్రతిని తెప్పించుకొని అప్పటి కాల పరిస్థితులవల్ల కొంత జాప్యం జరగడంచేత ఆలోపుగా వేరొకరు గ్యారీబాల్డీ జీవితచరిత్ర ప్రకటించారు. అది తెలిసి పంతులుగారు తమ

రచనను ప్రకటించడం మానుకొన్నారు. తెలుగులో లేని పుస్తకాలు వ్రాసి ప్రకటించవలె గాని ఉన్న పుస్తకాలనే మరల మరల ప్రకటించడం వీరికి ఇష్టం లేదు. అందువల్ల పుస్తకాల సంఖ్య పెరుగుతుందే గాని, వాఙ్మయానికి అది పుష్టికాదని వీరి దృఢ విశ్వాసం. వీరు రచించిన మూడవ గ్రంథం 'రోమక సామ్రాజ్య చరిత్రము'. ఇది అసంపూర్ణ రచన. అయినా ఇది ప్రకటింప బడవలసి ఉండె. ఎందువల్లనో వీరు దీనిని అచ్చు వేయించలేదు.

'క్షాత్ర కాలపు హిందూదేశ్యులు' అనేది పంతులుగారి మరొక గ్రంథం. బొంబాయి వాస్తవ్యులూ, పంతులుగారి మిత్రులూ అయిన రావు బహదూర్ చింతామణిరావు వైద్య రచించిన 'ఎపిక్ ఇండియా' అనే ఆంగ్ల గ్రంథంలోని వ్యాసములకు ఇది ఆంధ్రానువాదం. దీనిని పువ్వాడ వెంకటప్పయ్య గారు వారి కృషి ప్రచారిణీ గ్రంథమాలలో రెండవ కుసుమముగా 1927 లో ప్రచురించారు. ఆర్యుల దుస్తులు, వారి ఆహారం, వివాహపద్ధతి, రాజ్యాంగ విధానం మొదలగు విషయాలు ఈ గ్రంథంలో పరిశోధనా పూర్వకంగా చర్చింపబడ్డవి ఆర్యుల సంస్కృతిని సంప్రదాయాలను తెలుసుకొనడానికి ఈ గ్రంథం ఉపకరిస్తుంది.

వైద్యగారు ఆంగ్లంలో రచించిన 'మహాభారత సమీక్ష' అనే గ్రంథాన్ని కూడా హనుమంతరావు గారు 1916 లో తెనిగించారు. దీనిలో నుంచి కొన్ని అధ్యాయాలు ఆంధ్ర భారతి, దేశబంధు మున్నగు పత్రికలలో ప్రకటితమయ్యాయి.

ఫారసీ కవులను గూర్చి పంతులుగారు వ్రాసిన వ్యాసాలు 'సుజాత' పత్రికలో ప్రకటింప బడ్డవి. పంతులుగారి వ్యాసాలన్నీ ఒక సంపుటిగా వెలువడవలసి ఉన్నది.

తెలుగులో ఆధునిక రీతిలో కథానికను రచించిన ఖ్యాతి హను మంతరావు గారిదా లేక ఆ గౌరవం గురజాడ అప్పారావు గారికి దక్కుతుందా అనే విషయంలో అభిప్రాయ భేదానికి తావున్నట్లు కన్పిస్తున్నది. 1910 ప్రాంతాలలోనే హనుమంతరావు గారి కథలు కృష్ణా పత్రికలో ప్రకటింప బడ్డాయని చెబుతారు. ఆదిరాజు వీరభద్రరావు గారు "కథానికలనూ నూతన రీతిలో వ్రాసిన కీర్తి హనుమంతరావుగారికే చెందవలసి ఉన్నదని చెప్పుటకు మిగుల సంతోషిస్తున్నాము" అని వ్రాశారు.* పంతులుగారు మొత్తం 13 కథలు రచించారు. వాటిలో నుంచి 1. హృదయ శల్యము 2. రాణీసారంధ్రా, 3. ముసలిదాని యుసురు, 4. నేనే, 5. అగ్ని గుండము, 6. నాడు నీ పంతము–నేడు నా పంతము, 7. ఆత్మార్పణము అనే కథలు 'మల్లికా గుచ్ఛము' అనే పేరుతో 1911 లో పుస్తక రూపంగా వచ్చాయి. ప్రకటించిన వారు సరస్వతీ నికేతనము, మచిలీపట్టణం. వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారు ప్రకటించిన 'కవిత్వవేది' గారి 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము' లో "హనుమంతరావు గారి మల్లికాగుచ్ఛ మొప్పులకుప్ప" అని ప్రశంసించి ఉన్నారు. అయితే వీరి ఇంటి పేరును పొరపాటున మైనంపాటి అని వ్రాశారు. మాడపాటి అని ఉండవలెను. 'విధి ప్రేరణము', 'ఎవరికి?' అనే కథలను హైదరాబాదు లోని అణా గ్రంథమాలవారు 1940 లో తమ 12 వ కుసుమంగా 'మాలతీగుచ్ఛము' అనే పేరుతో ప్రకటించారు.

'న్యాయమా ?' 'ఎవరిది తప్పు ?' 'ఇక కావలసినదేమి ?' 'నిజమేనా' అనే కథలు సుజాత, భారతి, శారద మాస పత్రికలలో అచ్చు అయినవి.

---

* మాడపాటి హనుమంతరావు జీవిత చరిత్ర
—రచన : ఆదిరాజు వీరభద్రరావు — 1965.

రచయిత

ఈ కథలలో 'హృదయ శల్యము', 'నేనే' అను రెండు కథలు మాత్రమే హనుమంతరావు పంతులుగారి సొంత రచనలు. తక్కినవి ప్రఖ్యాత ఉర్దూ కథా రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ కథలకు అనువాదములు, అనుసరణలు. అయితే ప్రేమ్‌చంద్ ఉర్దూ కథలను మొట్టమొదట తెనిగించి ఆంధ్రులకు పరిచయం చేసిన గౌరవం మాడపాటి హనుమంతరావు పంతులుగారికే దక్కుతుంది. వీరి అనువాదాలు చదివిన పిమ్మట తెలుగులో ఎందరో రచయితలు ఆ పద్ధతిలో కథా రచన చేశారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు వారు 1984 లో హనుమంతరావు పంతులుగారి శత జయంతి కానుకగా 'మల్లికా గుచ్ఛము' కథా సంకలనాన్ని తిరిగి ప్రచురించారు. ఇందులో మొదటి ముద్రణలోని ఏడు కథలతోపాటు 'ఎవరిది తప్పు ?' అనే కథనూ, అణా గ్రంథమాల వారు 'మాలతీ గుచ్ఛము' అనే పేరుతో ప్రకటించిన 'ఎవరికి ?' 'విధి ప్రేరణ' అనే కథలనూ కూడా చేర్చి, మొదటి ముద్రణకు పంతులుగారు వ్రాసిన పీఠికతో సహా ప్రచురించారు. ఈ కథా సంపుటి ప్రకటన ప్రశంసనీయమైన కార్యం. ఈ తరం వారికి వెనుకటి కథలను చదివే అవకాశం కలుగుతుంది.

పంతులుగారు సొంతంగా రచించిన కథలలో 'హృదయశల్యము' చారిత్రక కథ. కాకతీయ సామ్రాజ్య ధురీణ రుద్రమదేవి కాలం నాటి కథ ఇది. ఈ కథలో రుద్రమదేవి ఒక పాత్రకూడా. ప్రతాపుడు, అతని భార్య యమున ఓరుగల్లు— అంబాలకు నడుమ అరణ్య ప్రదేశంగుండా వెళ్ళుతూ ఉంటే దోపిడీ దొంగలు వచ్చి ఆ యువతిని చంపబోతూన్న సమయంలో పురుష వేషంలో ఉన్న రుద్రమదేవి అక్కడికి

వచ్చి తన పట్టాకత్తితో దోపిడిగాంగ్ర నాయకుని చేతిని నరికివేసి ఆ యువతిని అర్ధ్ర హృదయంతో కౌగలించుకొంటుంది. ఎవరి దారిన వారు వెళ్ళిపోతారు. అది జరిగిన తర్వాత ప్రతాపుడు తన భార్యను అనుమానించి ఆమె పట్ల విముఖుడై ఉంటాడు. ఆ కౌగలించుకొన్న పురుషునికి ఆమె హృదయం అర్పించి ఉంటుందని అతని అనుమానం. ఇది ఇట్లా ఉండగా రుద్రమదేవి పురుష వేషంలో వచ్చి వారింట రెండు రోజులు అతిథిగా ఉంటుంది. ఆ అతిథి యమునకు ఇష్టంలేని అతిథిగా పరిణమించడంతో, అతిథియైన అతనిని పరుషవాక్కులతో ఆమె అగౌరవ పరుస్తుంది. కాని ఆమె స్త్రీ అని తెలిసిపోయి ఆ దంపతులు ఉభయులూ ఆమె పాదాలపై పడి తమ అపరాధాన్ని మన్నింపమని వేడుకొంటారు.

'నేనే' అనేది సాంఘిక కథ. దీనిలో గణపతిరావు అనే న్యాయవాది చిత్రమైన అభిప్రాయాలుకల వ్యక్తి. అతని దృష్టిలో ఒక పురుషుడు స్త్రీ సంబంధమగు విషయసుఖాభిలాష లేకపోయిన పక్షంలో అతను ఇతరత్రా సుగుణాలు, విశాలబుద్ధి లేనివాడైనాసరే, అతను నీతి వర్తనము కలవాడే! ఇట్లా అని గణపతిరావు వాదిస్తూ ఉంటాడు. ఇట్లా ఉండగా ఒక స్త్రీవద్దనుంచి అతనికి లేఖవస్తుంది. అందులో ఆమె తాను అతని గుణసంపదచే ఆకర్షితురాలైనాననీ, మరుసటిరోజు రాత్రి తనను కృష్ణా థియేటర్‌కు వచ్చి కలుసుకోవలసిందనీ కోరుతుంది. అతడు ఆ స్త్రీచే ఆకర్షితుడవుతాడు. బజారుకు వెళ్ళి మంచి బట్టలు, అత్తరు కొని ఇంటికి తెస్తాడు. భార్య అతనిని పరిహాసం చేస్తుంది. అతను థియేటర్‌కు వెళ్ళి నాటకంచూచి, ఆ సుందరికోసం ఆవరణలో వెదకుతాడు. ఒక చెట్టుక్రింద ముసుగు కప్పుకొని ఉన్న స్త్రీ అతనిని దగ్గరకు రమ్మని సంజ్ఞచేస్తుంది. అతనువెళ్ళి ఆమె ప్రసన్న వదనమును చూపమంటాడు.

శ్రీరామూర్తే ఆమె అతనిభార్య హేమయే. దానితో నీతివర్తనమును గూర్చిన అతని అభిప్రాయాల బండారం బైటపడుతుంది. భార్యయే నాటకమాడి అతని నీతివర్తనం ఏపాటిదో రుజువుచేస్తుంది.

ఈ రెండు కథలలోనూ మారువేషం ఉభయసామాన్యం. ఇది కథలో ఉత్కంఠను ప్రవేశపెట్టడానికై అనుసరింపబడ్డ పద్ధతి. ఆ కాలంలో ఇటువంటి నాటకీయ సన్నివేశాలుగల కథలను స్త్రీ పురుషులు ఆసక్తితో చదివేవారు. పంతులుగారి ఈ రెండు స్వతంత్ర కథలూ పాఠకులను కుతూహలంతో చదివించేవిగా ఉన్నవి. వీటిభాష సరళ గ్రాంధికము.

'నిజాం రాష్ట్రములో రాజ్యాంగ సంస్కరణలు' అనేది పంతులు గారు రచించిన మరొక పుస్తకం.

అయితే హనుమంతరావుగారికి రచయితగా చిరయశస్సు నార్జించి పెట్టిన గ్రంథం 'తెలంగాణా ఆంధ్రోద్యమము' అనే రెండు భాగములుగా ఉన్న నిజాంరాష్ట్ర ఆంధ్రోద్యమ చరిత్ర. ఆధునికయుగంలో ఆంధ్ర జాతి వికాసాన్నిగూర్చి వ్రాయదలచిన చరిత్రకారులెవ్వరూ ఈగ్రంథాన్ని ప్రస్తావించకుండా ఉండలేరు. నిజాం నిరంకుశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణా ఆంధ్రులుసల్పిన పోరాటాన్ని ఈ చరిత్ర విశదీకరిస్తున్నది.

హనుమంతరావు పంతులుగారు చక్కని ఉర్దూ రచయిత. వీరు చాలాఏళ్ళు హైదరాబాదునుంచి వెలువడ్డ 'ముషీరెదక్కన్' అనే ఉర్దూ దినపత్రికకు సంపాదకీయాలు వ్రాశారు. ఇది మితవాద పత్రిక. కాని ఇందులో వెలువడే వార్తలు వ్యాఖ్యలు యధార్థాలైఉండి పత్రిక కెంతో గౌరవ మర్యాదలు తెస్తూ ఉండేవి. పంతులుగారి సంపాదకీయాలు ఘాటుగా లేకపోయినా ప్రభుత్వ విధానంపై చేయవలసిన విమర్శను చక్కగా ప్రతిబింబించి ఉండేవి.

# షష్టిపూర్తి ఉత్సవం

నిజాం రాష్ట్రంలోని ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి నిరంతర దీక్షతో కృషిసల్పి సర్వజన సమాదరణీయులైన హనుమంతరావు పంతులుగారి షష్టిపూర్తి ఉత్సవం ఘనంగా జరుపబడవలెనని తెలంగాణా ప్రజలు అభిలషించారు. పంతులుగారు తెలంగాణాకుచేసిన సేవకు గాను వారిని ఏరీతిగా గొప్పగా గౌరవించినా తక్కువేననే అభిప్రాయం కల కొండా వెంకట రంగారెడ్డిగారు నడుము కట్టుకొని షష్టిపూర్తి జరిపే విషయంలో నాయకులు తమ బాధ్యతను నెరవేర్చవలెనని పత్రికలద్వారా విజ్ఞప్తిచేశారు. వారా విజ్ఞప్తిలో "పంతులుగారు ఆంధ్రోద్యమాన్ని, ప్రజా గ్రంథాలయాలనూ, పాఠశాలలనూ స్థాపింపజేసి వాటి అభివృద్ధికి నిరంతరకృషి సల్పారు. ఆంధ్రులను నిద్రావస్థనుంచి మేల్కొల్పి వారిలో దేశాభిమానాన్ని ఆత్మగౌరవాన్ని, రాజ్యాంగభావాలనూ వృద్ధి చేశారు" అని పంతులుగారి సేవలను ఉగ్గడించారు. ఈ విజ్ఞప్తిని పురస్కరించుకొని షష్టిపూర్తి ఉత్సవనిధికి తెలంగాణావాసులు అభిమాన పూర్వకంగా విరాళాలు ఇచ్చారు. మొత్తం రూ. 11,113 వసూలయ్యాయి. ఉత్సవ నిర్వహణకై రాజాబహద్దరు వెంకటరామారెడ్డిగారు అధ్యక్షులుగా, కొండా వెంకటరంగారెడ్డిగారు కార్యదర్శిగా ఒక ఆహ్వాన సంఘం ఏర్పడింది.

పంతులుగారి షష్టిపూర్తి ఉత్సవం హైదరాబాదు నగరంలోని రెడ్డిహాస్టల్ ఆవరణంలో 1946 ఫిబ్రవరి 6, 7 తేదీలలో వైభవంగా ఒక పర్వదినంవలె మహోత్సాహంతో జరపబడింది. సభాధ్యక్షులు

ఉమ్మడి మద్రాసురాష్ట్ర మాజీమంత్రి కడప కోటిరెడ్డిగారు. మొదటిరోజున ఆంధ్రులు, మహారాష్ట్రులు, కన్నడులు, మహమ్మదీయులు పంతులు గారిని తీసుకురావడానికై వారి ఇంటికి వెళ్ళారు. కొండా వెంకటరంగా రెడ్డిగారు పంతులుగారికి, వారి సతీమణికి, వారి కుమారునికి నూతన వస్త్రాలు సమర్పించి చక్కగా అలంకరింపబడిన తెల్ల గుర్రపుబగ్గీలో వారిని సన్నాయివాద్యంతో, స్వచ్ఛంద సేవకులు వెంటరాగా ఊరేగింపుగా తీసుకొని వెళ్ళారు. బగ్గీకి ముందు పురుషులు, వెనుక స్త్రీలు నడిచారు. 'ఆంధ్రపితామహకు జై' అనే నినాదాలు మిన్నుముట్టాయి. దారిలో పౌరులు, కొన్ని సంస్థల వారు పంతులుగారికి పూలదండలు వేశారు. కొందరు నూతన వస్త్రాలు బహూకరించారు. ఊరేగింపు రెడ్డి హాస్టల్ ద్వారం వద్దకు రాగానే బాలికలు హారతి పట్టారు. వేద పఠనం జరుగుతూ వుండగా పంతులుగారు సభా వేదికపై ఆసీనులయ్యారు. రాజా బహద్దరు వెంకట రామారెడ్డిగారు ఆహ్వాన సంఘ అధ్యక్షోపన్యాస మిస్తూ పంతులుగారి సేవలనూ త్యాగాన్నీ కీర్తించారు. శ్రీ అరవముదయ్యంగార్ వారి ప్రారంభోపన్యాసంలో పంతులుగారి గుణగణాలను ప్రశంసించారు. సభాధ్యక్షులు బారిష్టర్ కడప కోటిరెడ్డిగారు మహోపన్యాసం చేశారు. ఆహ్వాన సంఘం వారి సన్మాన పత్రాన్ని సురవరం ప్రతాపరెడ్డి గారు చదివి సమర్పించారు. దాదాపు 58 సంస్థలు ఆంధ్ర పితామహునికి సన్మాన పత్రాలు సమర్పించి పూలమాలలతో గౌరవించాయి పంతులుగారిని కాశీనాథరావు వైద్యా, రాజా బహద్దర్ విశ్వేశ్వరనాథ్, జనార్దనరావు దేశాయి ఇతర ప్రముఖులు పుష్పమాలలతో గౌరవించారు.

తరువాత పంతులుగారి తులాభారం జరిగింది. అలంకరింపబడిన పెద్ద త్రాసులో పంతులు గారిని కూర్చుండబెట్టి వెండి రూపాయ

లతో తూచారు. రూ. 6400 ల తూకమున్నట్లు తేలింది. అంతట కొండా వెంకటరంగారెడ్డిగారు మాట్లాడుతూ ఈ పైకం పంతులుగారి సొత్తు అని, దీనిని వారు తమ ఇష్టానుసారం ఉపయోగించుకో వచ్చుననీ తెలిపారు. పంతులుగారు ఈ సన్మానానికి సమాధానం చెబుతూ తమ జీవితావసరాలకు తగినంత రాబడి తమకు ఉన్నదనీ, తులాభార పైకం అంతటినీ కొండా వెంకట రంగారెడ్డిగారు అవసరమని భావిస్తే ఇతరు లనుకూడా చేర్చుకొని ప్రజాహిత కార్యాలకు ఉపయోగింప వచ్చునని రెడ్డిగారికి అధికార మిచ్చారు. తమకు ఈ ప్రకారంగా సన్మానం జరుగు తుందని ముందుగా తెలిస్తే ఇంకా ఎక్కువ సేవచేసి, తూకం ఎక్కువ కావడానికి ప్రయత్నించి ఉండేవారమని చమత్కారంగా అన్నారు. తాను ప్రవక్తను కాననీ, ప్రభుత్వోద్యోగంలో రూ. 40 వేతనం మొదలు రూ. 100 వరకు వేతనం పొందామనీ, దానిపై అభిరుచి లేక వకీలువృత్తిని ఆరంభించామనీ, ప్రజలకు సేవచేయడమే తమ ధ్యేయమనీ పంతులుగారు అన్నారు.

షష్టిపూర్తి ఉత్సవం రెండవరోజుసభ పింగిలి వెంకటరామారెడ్డి దేశముఖ్‌గారి అధ్యక్షతన జరిగింది. రెడ్డిగారూ, పంతులుగారూ బాల్య మిత్రులు. కలిసి చదువుకున్నవారు. రెడ్డిగారు పంతులుగారి వాక్చాతు ర్యాన్నీ కార్యదీక్షనూ ఎట్టివారిపైనైనా సమ్మోహనాస్త్రం ప్రయోగింప గల వారిప్రజ్ఞనూ ప్రశంసించారు. కవిపండితులు పంతులవారిని కీర్తిస్తూ తాము వ్రాసిన పద్యాలు గేయాలు ఉత్సాహంగా చదివారు. ఈ ఉత్సవం సందర్భంగా 'ఆంధ్రపితామహ మాడపాటి హనుమంతరాయ షష్టిపూర్తి సంచిక' ప్రచురింపబడింది. దానిని పంతులుగారికి సమర్పించారు. ఇందులో సాహిత్య, చారిత్రక సాంఘిక విషయాలనుగూర్చిన గద్యపద రచనలున్నవి. బూర్గుల రామకృష్ణారావు, కాశీనాథరావు వైద్య, జనార్దనో

రావు దేశాయి, రావి నారాయణరెడ్డి, మౌల్వీ సిరాజుల్‌హసన్ తిర్మిజీ, మందుముల నరసింగరావు, పండిత ధారేశ్వర్‌జీ ప్రభృతులు హనుమంతరావుగారి సేవలనూ ప్రతిభా విశేషాలనూ కొనియాడుతూ ప్రసంగించారు. ఆ తర్వాత యోగవ్యాయామ ప్రదర్శనలు జరిగాయి. ఆ సందర్భానికి పంతులుగారి జీవిత విశేషాలు వివరిస్తూ ప్రత్యేకంగా పండితులు శిరోమణి చలమచర్ల రంగాచార్యులవారిచే రచింపబడిన బుర్రకథను ఆంధ్రమహాసభ ప్రచారకులు శ్రావ్యంగా పాడి చెప్పారు.

పంతులుగారి షష్టిపూర్తి ఉత్సవం విడిగా ఆంధ్ర మహిళాసభ, ఆంధ్ర యువతీమండలి పక్షాన, నారాయణగూడా ఆంధ్ర బాలికోన్నత పాఠశాల పక్షాన, సికింద్రాబాదు ఆంధ్రమహాసభ (జాతీయ) పట్టణ కమిటీ ఆధ్వర్యాన జరుపబడింది. ఈ సభలలో వారికి అనేక ప్రజా సంస్థల పక్షాన సన్మానపత్రాలు, నూతనవస్త్రాలు, కానుకలు సమర్పింపబడ్డాయి.

హనుమకొండ, ఓరుగల్లుకోట, ఖమ్మం, మానుకోట, మధిర, ఇల్లెందు, తల్లాడ, ఎర్రుపాలెం, బుద్ధవరం, నల్లగొండ, సూర్యాపేట, దేవరకొండ, ఘనపురం, మిర్యాలగూడెం, హుజూరునగరం, జనగామ, సంగారెడ్డి, సదాశివపేట, జోగిపేట, మహబూబునగరం, మక్తల్, నాగర్‌కర్నూలు, గూడూరు, బెజవాడ మున్నగుచోట్లకూడా పంతులుగారి షష్టిపూర్తి ఉత్సవాలు వేడుకతో జరుపబడ్డవి. వీరిని షష్టిపూర్తి సందర్భంగా అభినందిస్తూ తీర్మానాలు ఆమోదింపబడ్డాయి.

మొత్తం 27 ప్రదేశాలలో 32 సభలు జరిగినట్లు, 117 సంఘాలు పాల్గొన్నట్లు సన్మానసంఘంవారు ప్రకటించారు.

హైదరాబాదు నగరంలో మరియే ఆంధ్ర నాయకునికీ షష్టిపూర్తి ఉత్సవం ఇంత ఘనంగా స్వచ్ఛందంగా వేడుకగా, అటువంటి ఉత్సాహపూరిత దృశ్యాలమధ్య, అన్ని సంస్థల ఆదరాభిమానాలతో జరగలేదని ప్రేక్షకులు చెప్పుకొన్నారు.

# ఆంధ్ర చంద్రికా గ్రంథమాల స్థాపన

తెలుగు భాషా సాహిత్యాల అభివృద్ధికి దోహదం చేయడం, చరిత్ర పరిశోధన శాసనాల పరిశోధన ద్వారా చారిత్రక దృక్పథాన్ని పెంపొందింపజేయడం, విజ్ఞాన వాఙ్మయ ప్రచారం జరగడం - ఇవి హనుమంతరావు పంతులుగారి ముఖ్య లక్ష్యాలు. తెలుగులో ఈ విషయాలకు సంబంధించిన పుస్తకాలు అధికంగా వెలువడవలెనని వారు అభిలషిస్తూ ఉండేవారు. ఇందుకై వారు హైదరాబాదులో ఆంధ్ర చంద్రికా గ్రంథమాలను స్థాపించారు. దీనికి సంపాదకులుగా ఆదిరాజు వీరభద్రరావు గారిని నియమించారు. పంతులు గారి స్వగృహమైన 'ఆంధ్ర కుటీరము' దీనికి కార్యాలయం. 1946 ఫిబ్రవరి 6, 7 తేదీలలో వారి షష్టిపూర్తి ఉత్సవాలు జరిగిన సందర్భంలో తులాభారం జరిపి వారు రూ. 6,400 బరువు తూగగా ఆ ధనాన్ని వారికి సమర్పించారు. వారు ఆ ధనాన్ని తెలుగు గ్రంథ ప్రచురణకు ఉపయోగించ నిశ్చయించి ఆంధ్ర సారస్వత నిక్షేపము అనే ట్రస్టును కొండా వెంకట రంగారెడ్డి గారి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ ట్రస్టుకు కోశాధిపతి పంతులుగారే. ఈ ట్రస్టు పక్షాన ఆంధ్ర చంద్రికా గ్రంథమాల ఏర్పాటైంది. ఈ గ్రంథమాలలో దేశ చరిత్రలు, మహా పురుషుల జీవితాలు, ప్రకృతి శాస్త్రాలు, ఇతర విజ్ఞానాత్మక గ్రంథాలు ప్రకటింపబడతాయని వారు పాఠకులకు, చందాదారులకు తెలియజేశారు. ఈ గ్రంథాలు ప్రజా సాహిత్య సంబంధమైనవిగా ఉండి, సులభమైన వచన శైలిలో ఆకర్షణీయంగా ఉండి, పరిమితమైన పుటలు కలిగి అందరికీ

అందుబాటులో ఉండవలెనని వారి ఆశయం. గ్రంథమాలకు చందా లేదు. గ్రంథాలు తయారు కాగానే చందాదారులకు వి. పి. పై పంప బడతాయి. వీటిని తీసుకొనేవారు శాశ్వత చందాదారు లనబడుతారు. అట్టివారికి పుస్తకాల వెలలో నాల్గవ భాగం తగ్గించి పంపుతారు. అప్పటి వరకు ఆంధ్ర వాఙ్మయంలో లేని గ్రంథాలే ప్రకటింప బడతాయనీ, ఆంధ్ర భాషకు పుష్టి కలిగించుట, ఆంధ్రులలో విజ్ఞాన చంద్రికలను ప్రసరింపజేయుట తమ ఉద్దేశమనీ, ధన సంపాదన కాదనీ వారు ప్రకటించారు. తెలుగులో వివిధ విషయాలను గూర్చిన గ్రంథజాలం అప్పటికి తక్కువ - ఇప్పటికీ తక్కువే. మహారాష్ట్ర, హిందీ, వంగ భాషలతో పోల్చితే తెలుగువారు వెనుకబడి ఉన్నారని పంతులుగారు ఆవేదన చెందేవారు. ఆంధ్ర చంద్రికా గ్రంథమాల తరపున ఖండవల్లి బాలేందు శేఖరంగారి 'విస్మృత సామ్రాజ్యములు', పంతులు గారు రచించిన 'తెలంగాణా ఆంధ్రోద్యమం' రెండు భాగములు, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారి 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము', ఆదిరాజు వీరభద్రరావుగారి 'ప్రాచీనాంధ్ర నగరములు', డా. మారేమండ రామారావుగారి 'రాజకీయ పరిజ్ఞానము', ఖండవల్లి బాలేందు శేఖరంగారి 'ప్రాచీన జాతులు', బి. వి. రమణరావుగారి 'వైజ్ఞానికుల జీవితములు' అనే గ్రంథాలు ప్రకటింపబడ్డవి. మరికొన్ని గ్రంథాలు ప్రచురింపవలెనని పథకం వేసుకొన్నారు. కాని గ్రంథ ప్రచురణ కార్యం కష్ట తరంగా ఉండటంవల్ల ఆ ఉద్యమాన్ని అంతటితో నిలిపివేశారు. ఈ గ్రంథమాల గ్రంథాలు చాలా చౌక ధరలకు ఇవ్వబడేవి. 350 పుటల 'ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహము'ను చందాదారులకు 1950 లో రెండు రూపాయల పావలాకు ఇచ్చే వారంటే గ్రంథమాల స్థాపకుల ఉద్దేశం విదితం కాగలదు. ఈ గ్రంథానికి సురవరం ప్రతాప

రెడ్డిగారు 'నీళ్ళు లేని ఇటికేలపాడు' గ్రామం నుంచి ఉపోద్ఘాతం వ్రాస్తూ "ఆంధ్ర చంద్రికా గ్రంథమాల స్థాపకులును, పూజ్యులును నగు శ్రీ మాడపాటి హనుమంతరావుగారు నిరంతర సంస్తవనీయులు" అన్నారు. గ్రంథ రచయిత తమ విన్నపంలో "స్వాతంత్ర్య శోభా దరిద్రాణమును, సంస్కృతి నిద్రాణమును అయిన తెలంగాణమును మేల్కొల్పిన మేధావి ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారి వాక్యమును తెలంగాణపు వాణిగా గ్రహించి ఈ పుస్తకమును సమర్పించు కొనుచున్నాను" అని వ్రాశారు. ఈ గ్రంథమాల సేవ ప్రశంసనీయం. ఈ గ్రంథమాల పుస్తకాల మలి ముద్రణలు తీసుకొస్తే నేటి పాఠకుల కెంతో ఉపయోగపడతాయి.



పంతులుగారి షష్టిపూర్తి సందర్భంలో తీసిన చిత్రం.



పంతులుగారి సతీమణి
శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మగారు

# బాలికల ఉన్నత పాఠశాల - మహిళా కళాశాల

హైదరాబాదు నగరంలో తెలుగు బాలికలకు హైస్కూలు విద్యా సౌకర్యం కలిగిస్తూవున్న పాఠశాలల్లో 'మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నత పాఠశాల' ముఖ్యంగా చెప్పుకోదగింది. ఇది నగరంలో నారాయణగూడాలో ఉన్నది. హనుమంతరావుపంతులుగారు ఈ పాఠశాల స్థాపనకూ దీని అభివృద్ధికీ కృషిచేశారు కాబట్టి దీనికి వారిపేరు పెట్టారు. అంతకు ముందు ఇది నారాయణగూడా ఆంధ్ర బాలికోన్నత పాఠశాలగా వ్యవహరింపబడేది. పంతులుగారి స్త్రీవిద్యాభిమానం, తెలుగు బాలికలకు మాతృభాషలో ఉన్నతవిద్య గరపబడవలెనన్న లక్ష్యం వీరిని ఈ పాఠశాల స్థాపనకు ప్రేరేపించాయి. హనుమంతరావు పంతులుగారు 1330 ఫసలీలోనే అఫ్జల్‌గంజ్‌లో బాలసరస్వతీ ఆంధ్రభాషానిలయంలో నెలకొన్న పరోపకారిణీ బాలికాపాఠశాల అనే ప్రాథమిక పాఠశాల నిర్వహణభారం వహించి దానిని చక్కగా నడిపారు.

నిజాం ప్రభుత్వం రాష్ట్రంలోని బాలబాలికలందరూ ఉర్దూ భాషలోనే ఉన్నతవిద్య నభ్యసించవలెనన్న నిర్బంధవిధానాన్ని అనుసరిస్తూ పరిమితంగా మాత్రమే విద్యాసౌకర్యాలు కలుగజేస్తూ వున్న కాలమది. బాలుర విషయంలో ఎట్లాగో సరిపెట్టుకున్నా, బాలికలకు వారి మాతృభాషద్వారా ఉన్నతవిద్యను బోధించే సౌకర్యాలు లేకపోవడం పంతులుగారికి నచ్చలేదు. ఆంధ్రోద్యమం చక్కగా సాగాలంటే స్త్రీలు విద్యావంతులు కావాలి. అందుకు వారి మాతృభాష ద్వారానే ఉన్నత విద్య

గరపబడవలెనని వారు సంకల్పించారు. వీరివలెనే మహారాష్ట్ర కన్నడ భాషలవారు కూడా నిజాం సర్కారువారి విద్యావిధానాన్ని నిరసించారు. బాలికల విద్యకొరకై బారిష్టర్ రామచంద్రనాయక్, రాయ్ విశ్వేశ్వర నాథ్, అహల్యాబాయి మల్లన్న, సులోచనాబాయి, వాసుదేవహార్డీకర్, కృష్ణస్వామి ముదిరాజ్, మాడపాటి హనుమంతరావుగారలు ఒకకమిటీగా ఏర్పడి బాలికా పాఠశాల ఏర్పాటుకు ప్రయత్నించారు. ఐతే ప్రైవేటు పాఠశాలల స్థాపన విషయంలో నిజాం ప్రభుత్వం కఠిన నియమాలను అమలు జరుపుతూ ఉండేది. కొత్తగా ప్రైవేటు పాఠశాలలు పెట్టాలనుకున్న వారికి అనుమతి లభించడం కష్టంగా ఉండేది. అయితే రెసిడెన్సీ బజారు (ఇప్పటి సుల్తాన్‌బజారు) ఆనాడు బ్రిటిషువారి అధీనంలో వుండటం చేతనూ, అది బ్రిటిషు రెసిడెంటు ఉండే ప్రాంతం గనుకనూ, విద్యాబోధన విషయంలో నిజాం ప్రభుత్వ నియమాలు అక్కడ వర్తించేవి కావు. అందుచేత రెసిడెన్సీబజారులో 1928 జూన్ 8 తేదీన ఒక బాలికా పాఠశాల స్థాపించారు. కాని మరాఠీ, కన్నడ తరగతులకు తగినంతమంది విద్యార్థినులు లేకపోవడంచేత పైన పేర్కొన్న కమిటీ వారు మూడు సంవత్సరాలు పాఠశాలను నిర్వహించి, తెలుగుశాఖ మూడవఫారం వరకు అభివృద్ధి పొందిన తర్వాత ఆర్థికమైన ఇబ్బందుల మూలాన పాఠశాలను మూసివేయ సంకల్పించారు. మరాఠీ, కన్నడ తరగతులు ప్రోత్సాహంలేక తగినంతమంది పిల్లలు లేక మూసివేయబడ్డవి. అట్టి తరుణంలో హనుమంతరావుగారు తమకు విశ్వసనీయులైన వడ్లకొండ నరసింహారావుగారిని తోడుచేసుకొని పాఠశాల నిర్వహణ భారాన్ని తమ మీద వేసుకొని, దానిని ఆంధ్ర బాలికల ఉన్నత పాఠశాలగా మార్చారు. సేవాసక్తిగలవారికీ వదాన్యులకూ విద్యాభిమానులకూ ఆంధ్ర బాలికలకు వారి మాతృభాషలోనే ఉన్నత విద్యాసౌకర్యం

కలుగజేయవలెనన్న తమ లక్ష్యాన్ని పంతులుగారు విపులీకరించి చెప్పి, అందరి సహాయ సహకారాలను తీసుకోవడానికి పూనుకొన్నారు. రాజా బహద్దర్ వెంకటరామా రెడ్డిగారు ఆ కాలంలో నిజామాంధ్రులకు పెన్నిధి వంటి వారుగా ఉన్నందువల్ల వారిని పాఠశాలకు అధ్యక్షులుగా ఎన్ను కొన్నారు. వీరిద్దరితో కొండా వెంకటరంగారెడ్డిగారూ, బూర్గుల రామ కృష్ణారావుగారూ చేతులు కలిపారు. ఈ పాఠశాలకు ఒక ఆధారము, వ్యక్తిత్వము కల్పించాలని పంతులుగారి పట్టుదల. అయితే ఈ పాఠ శాలలో బోధింపబడే చదువును ఒక విశ్వవిద్యాలయంచేత ఆమోదింప జేసి, విద్యార్థినులకు సర్టిఫికెట్లు లభింపజేయాలికదా. ఆ సర్టిఫికెట్లకు పరిగణన వుండాలికదా. పంతులుగారు అందుకు పూనుకొని ఉస్మానియా నాగపూరు, ఆంధ్ర విశ్వవిద్యాలయాలవారితో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంవారు ఉర్దూను తప్ప మరే భాషనూ తాము అంగీకరింపమని తెలియజేశారు. నాగపూరు విశ్వవిద్యా లయంవారు తెలుగుభాషకు తమవద్ద సౌకర్యాలులేవని తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు తమకు దేశీయ సంస్థానాల వ్యవహారంతో నిమిత్తం లేదని తప్పించుకొన్నారు. ఇట్లా చుట్టుపక్కల విశ్వవిద్యాలయాల నిరాకరణవల్ల విఫలమనోరథులైన పంతులుగారు పూనాలోని శ్రీమతి నాతీబాయి దామోదరథాకర్సే మహిళా విశ్వవిద్యాలయానికి వ్రాశారు. దీనినే ఎన్.ఎన్.డి.టి. యూనివర్సిటీ అనేవారు. ఇది భారతదేశంలో ఏర్పాటు చేయబడ్డ మొట్టమొదటి మహిళా విశ్వవిద్యాలయం. ఈ విశ్వ విద్యాలయంవారు తెలుగులో పరీక్షలు జరిపి సర్టిఫికెట్లు ఇవ్వడానికి అంగీకరించడంచేత పంతులుగారు బాలికల ఉన్నతపాఠశాలను 1932 లో ఆ మహిళా విశ్వవిద్యాలయానికి అనుబంధ విద్యాలయంగా చేశారు. వారి పాఠ్యప్రణాళిక ననుసరించి తెలుగులో బాలికలకు ఉన్నత పాఠశాల విద్య బోధించడానికి తగు ఏర్పాట్లు చేశారు.

మొదట్లో ఈ పాఠశాలకు కార్యకర్తగా, ఉపాధ్యాయుడుగా హను మంతరావు పంతులుగారే పనిచేశారు. ఆరంభంలో పాఠశాలకు ప్రధా నోపాధ్యాయిని ఎవరూలేరు. 1931 లో మొదటిసారిగా ప్రధానోపాధ్యా యుడిని నియమించారు.

పంతులుగారి సతీమణి శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మగారు 1931-32 సంవత్సరంలో ఈ పాఠశాల విద్యార్థినిగా ప్రవేశ పరీక్షకు కూర్చున్నారు.

పంతులుగారు ఇంచుమించు ప్రతిరోజు పాఠశాలకు వచ్చి ఉపా ధ్యాయుల యోగక్షేమాలు విచారిస్తూ ఉండేవారు. ఈ సంస్థ ఒక పాఠ శాలగాకాక తెలుగు బాలికల సమగ్రాభివృద్ధికి తగిన కేంద్రంగా ఉండ వలెనని వారి ఆశయం.

నగరానికి ఏ గొప్పవ్యక్తి వచ్చినా పంతులుగారు వారిని దర్శించి, పాఠశాలనుగూర్చిచెప్పి వారిని తీసుకువచ్చి పాఠశాల పనిచేసేవిధానాన్ని వివరించి చెప్పేవారు. ఆ విధంగా ఈ పాఠశాలను దర్శించిన ప్రముఖు లలో మహిళా విశ్వవిద్యాలయ స్థాపకుడు కర్వే పండితుడు, ప్రముఖ విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు పేర్కొనదగినవారు.

పంతులుగారు కొత్తగా వచ్చే విద్యార్థినుల ఊరూ పేరూ అడిగి తెలుసుకొని వారి చదువు ఎట్లా సాగుతున్నదీ విచారించేవారు.

పాఠశాలలో చేరదలచుకొన్న బాలికలు పంతులుగారి ఇంటికి వెళ్ళేవారు. వారు అంతకుముందు చదివిన చదువు, తల్లిదండ్రుల వివరాలు తెలుసుకొని వారిని వెంటబెట్టుకొని పాఠశాలకు తీసుకుపోయి తగిన తర గతిలో చేర్పించేవారు. ప్రతి సంవత్సరం స్కూల్ డే జరిపి, ప్రతి

సబ్జెక్టులో ప్రథములుగా వచ్చిన బాలికలకు బహుమతులు ఇచ్చేవారు. పంతులుగారు తమ ఆదర్శాలతో ఈ పాఠశాలకు చక్కని రూపకల్పన చేశారు. పాఠ్యక్రమం ప్రకారం తరగతులను నడపడమేగాక, చిత్ర లేఖనం, భగవద్గీత పరీక్షలు, బోధకవిద్య, ఖేలనాది వినోదములు, ప్రాథమిక చికిత్స, పోటీపరీక్షలు, గ్రంథనిలయం, వక్తృత్వం, వ్యాస రచన, సంగీతము, గృహనిర్వహణశాస్త్రం, నాట్యం, వ్యాయామం, గర్ల్‌గైడ్స్, బ్లూబర్డ్‌వంటి ఇతర కార్యక్రమాలతో ఈ బాలికోన్నత పాఠ శాలను పంతులుగారు సర్వాంగశోభితంగా తీర్చిదిద్దారు.

1933 నుండి 1945 వరకు ఈ పాఠశాల విద్యార్థినులు. కర్వే మహిళా విశ్వవిద్యాలయ పరీక్షలకు పంపబడ్డారు. ఆ తర్వాత 1945 నుండి 1948 వరకు ప్రైవేటు విద్యార్థినులుగా ఆంధ్ర మెట్రిక్ పరీక్షకు పంపబడ్డారు. 1947 లో- అంటే పాఠశాల స్థాపింపబడిన 20 సంవత్స రాలకు ఈ పాఠశాల విద్యార్థినులు తెలుగు బోధనాభాషగా హైదరాబాదు హెచ్.ఎస్.సి పరీక్షకు కూర్చోవచ్చునని ప్రభుత్వం ఆజ్ఞాపించినందువల్ల బాలికలను 1949 నుంచి తెలుగు మీడియం హైయర్ సెకండరీ సర్టి ఫికెట్ పరీక్షకు పంపడం ఆరంభమైంది.

తెలుగు బోధనాభాషగా చదువుతూ వున్న కొందరు విద్యార్థినులు తాము ఉన్నత పాఠశాలస్థాయిలో తెలుగులో చదివి ఆపిమ్మట కాలేజీలో చేరితే అక్కడ ఇంగ్లీషు మీడియం కావడంవల్ల ఇబ్బంది పడతామోనని వెరచి ఇంగ్లీషు మీడియం హైస్కూళ్ళలో చేరుతూవుండడం గమనించిన పాఠశాల నిర్వాహకులు తెలుగు మీడియంతోపాటు, ఇంగ్లీషుమీడియంలో కూడా తరగతులు జరిపే ఏర్పాటుచేశారు.

1943 జనవరి 1 తేదీనాడు హనుమంతరావుగారు పాఠశాల కార్యదర్శి పదవినుండి విరమించుకొని ఆ బాధ్యతను వేరొకరికి అప్పగించారు.

సుల్తాన్‌బజారులో ఒక చిన్న అద్దె ఇంటిలో ప్రారంభింపబడిన ఈ పాఠశాల 938 లో నారాయణగూడాలోని స్వంతభవనానికి మార్చబడింది.

1928 లో కేవలం 8 మంది బాలికలతో ప్రారంభింపబడిన ఈ పాఠశాల 1978 లో స్వర్ణోత్సవం జరుపుకొనేనాటికి 2,700 మంది విద్యార్థినులతో, 74 మంది ఉపాధ్యాయినులతో హైదరాబాదు నగరంలో పేరెన్నికగన్న బాలికోన్నత పాఠశాలగా అభివృద్ధి చెందింది. బిదురు వెంకటశేషయ్య, చలమచర్ల రంగాచార్యులు, ఆదిరాజు వీరభద్రరావు, కేశవపంతుల నరసింహశాస్త్రి, ఉద్పుటూరి రాఘవాచారివంటి పండితులు సాహిత్యవేత్తలు ఒకప్పుడు ఈ పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవ చేశారు. డా. పి. యశోదారెడ్డి, ప్రముఖ నవలా రచయిత్రి మాదిరెడ్డి సులోచన ఈ పాఠశాల విద్యార్థినులే.

తెలుగు బాలికల విద్యాభ్యాసం హైస్కూలువిద్యతో ఆగిపోకుండా కళాశాల విద్యకూడా వారికి లభింపజేయవలెనని పంతులుగారు ఉత్సహించారు. ఉదారులూ తెలుగు భాషాభిమానం గలవారూ, నిజాం రాష్ట్రాంధ్రులకు పెన్నిధివంటివారూ, ఆంధ్ర సంస్థలకు పోషకులూ అయిన రాజాబహద్దరు వెంకటరామారెడ్డిగారి పేరిట నగరంలో ఒక మహిళా కళాశాలను ఏర్పాటు చేయవలెనని సంకల్పించారు. వీరి ఈ సంకల్పానికి మిత్రుల తోడ్పాటు లభించింది. కళాశాల ఏర్పాటుకై ఒక సంఘం నియమింపబడింది. ఆ సంఘానికి అప్పటి హైదరాబాదు రాష్ట్రి

ముఖ్యమంత్రి అధ్యక్షులు, మాడపాటి హనుమంతరావు కార్యదర్శి, పి. రామచంద్రారెడ్డి సంయుక్త కార్యదర్శి. నిజాంగారిని దర్శించి బర్కత్ పురాలో 3½ ఎకరాల భూమిని సేకరించారు. ప్రభుత్వంనుంచి రూ. 25 వేల హాలీ రూ.లు మంజూరు చేయించుకొన్నారు. తమకు షష్టిపూర్తి సందర్భంలో జరిగిన తులాభారంవల్లా ఆంధ్ర చంద్రికా గ్రంథమాల ప్రచురణల అమ్మకంవల్లా వచ్చిన సొమ్ము సుమారు రూ. 19;000 లు ఆంధ్ర సారస్వత నిక్షేపంలో నిలువవుంది. ఆ సొమ్మును పంతులుగారి అభీష్టానుసారం మహిళాకళాశాలకై 1954 లో సమర్పించడం జరిగింది. బర్కత్‌పురాలో ఈ మహిళాకళాశాల భవన నిర్మాణానికి భారతప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ 1954 జనవరి 3 తేదీన శంకుస్థాపన చేశారు. ఈ కళాశాలకు పంతులుగారు ఉపాధ్యక్షులుగా ఉండి పనిచేశారు. 1955 జనవరి 6 వ తేదీన ఈ కళాశాలకు ప్రారంభోత్సవం భారత ఉపరాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చేశారు. 1980 అక్టోబరులో ఈ కళాశాల రజతోత్సవం జరుపుకొని నగరంలోని మహిళాకళాశాలల్లో పేర్వడసినది. ఇది ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి అధ్యయన కేంద్రంగా కూడా ఉన్నది. త్వరలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సెంటర్ కానున్నదని తెలుస్తున్నది.

# హైదరాబాదు నగర మేయరు

ప్రజాస్వామ్యపద్ధతి ప్రకారం 1951 ఏప్రిల్ 16 వ తేదీన ఏర్పడ్డ హైదరాబాదు నగర పాలక సంఘానికి (హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్) మొట్టమొదటి మేయరు మాడపాటి హనుమంతరావు పంతులుగారు. ప్రధానంగా ఆంధ్ర నగరమైన హైదరాబాదుకు ఆంధ్ర పితామహుడైన పంతులుగారు ప్రథమ మేయరు కావడం సముచితంగా ఉన్నదని వారి ఎన్నిక సమయంలో సర్వత్రా హర్షం వ్యక్తమైంది. అంతకుపూర్వం ఈ నగరపాలక సంఘం నామినేటెడ్ సభ్యులతో కూడిన వ్యవస్థగా ఉండేది. దానిని ఉర్దూలో బల్దియా అని వ్యవహరించే వారు. 1951లోనే మొట్టమొదటి సారిగా వయోజన ఓటింగు పద్ధతి ప్రకారం నగరపాలక సంఘానికి ఎన్నికలు జరిగాయి. పోటీలేకుండా కాంగ్రెసు సభ్యులు ఎన్నుకోబడ్డారు అప్పుడు హైదరాబాదు నగరానికీ, సికింద్రాబాదు నగరానికీ వేర్వేరు మునిసిపల్ కార్పొరేషనులు ఉండేవి.

హైదరాబాదు నగరపాలక సంఘం మొదటి సర్వసభ్య సమావేశం 1951 ఏప్రిల్ 16వ తేదీన ఉదయం 9-30 గం.లకు మేయర్ ఎన్నిక నిమిత్తం జరిగింది. ఎన్నిక సమయంలో 65 మంది కార్పొరేటర్లు హాజరైనారు. మేయరు ఎన్నికను జరిపించడం కోసం ధరణీధర్ సంఘీగారు తాత్కాలిక అధ్యక్షులుగా ఉండి ఎన్నిక జరిపించారు. మహమ్మదు యూనస్ సలీంగారు మేయర్ పదవికి మాడపాటి హనుమంత రావుగారి పేరును ప్రతిపాదించగా యన్. వెంకటస్వామిగారు బలపరిచారు. మరొకపేరు ఏదీ ప్రతిపాదింపబడకపోవడంచేత మాడపాటి

హనుమంతరావుగారు ఏకగ్రీవంగా మేయర్‌గా ఎన్నికైనట్లు ప్రకటింపబడింది. అప్పటి హైదరాబాదు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న బూర్గుల రామకృష్ణారావుగారు హనుమంతరావుగారిని మేయర్ స్థానంలో ఆసీనులు కావలసిందిగా అర్థించారు. అలాగే వారు ఆసీనులైన తర్వాత ముఖ్యమంత్రిగారు పంతులుగారికి మేయర్‌గౌను తొడిగారు. మేయర్ పోషక్‌లో ఉన్న పంతులుగారు తమను ఆ పదవి నలంకరింప జేసినందుకు ముఖ్యమంత్రికీ, స్థానిక స్వపరిపాలన మంత్రికీ, మునిసిపల్ కార్పొరేషన్ సభ్యులకూ తమ కృతజ్ఞతలు తెలిపారు. డిప్యూటీ మేయర్‌గా మీర్ అహమదలీఖాన్ ఎన్నికైనారు.

ఇట్లా మేయర్ పదవిలో ఒక సంవత్సరం ఉన్న తర్వాత రెండవ సంవత్సరం మేయర్ ఎన్నికకై నగరపాలకసంఘ సర్వసభ్య సమావేశం 1952 ఏప్రిల్ 16వ తేదీన జరిగింది. మీర్ అహమదలీఖాన్ తాత్కాలిక అధ్యక్షులుగా వ్యవహరించి ఎన్నిక జరిపించారు. హనుమంతరావు పంతులుగారి వ్యక్తిత్వం దృష్ట్యా వారొనర్చిన సేవల దృష్ట్యా మళ్ళీవారే ఒక సంవత్సరంపాటు మేయర్‌గా ఉండవలెనని చెప్పి వారి పేరును ధరణీధర్ సంఘీగారు ప్రతిపాదించగా కార్పొరేటర్ బాయి రామమూర్తి నాయుడుగారు బలపరిచారు. పంతులుగారు ఏకగ్రీవంగా రెండవమారు నగరమేయర్‌గా ఎన్నికైనట్లు ప్రకటింపబడింది.

మూడవసారి మేయర్ ఎన్నికకై నగరపాలక సంఘ సభ్యుల సమావేశం 1953 ఏప్రిల్ 15వ తేదీన జరిగింది. మీర్ అహమదలీఖాన్ గారు తాత్కాలిక అధ్యక్షులుగావుండి మేయర్ ఎన్నిక జరిపించారు. పంతులుగారి సేవలు నగరపాలక సంఘానికి మరికొంతకాలం అవసరం అంటూ ధరణీధర్ సంఘిగారు మేయర్ పదవికి హనుమంతరావుగారి పేరును ప్రతిపాదించగా, రామ్‌నివాస్ శర్మ తదితరులు బలపరిచారు. పంతులుగారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటింపబడింది.

ఈవిధంగా హైదరాబాదు నగరపాలక సంఘానికి మేయర్‌గా మాడపాటి హనుమంతరావుగారు 1951-52, 1952-53, 1953-54 సంవత్సరాలకు వరుసగా మూడు సంవత్సరాలు ఏకగ్రీవంగా ఎన్నుకోబడి పని చేశారు.


అదేకాలంలో సికింద్రాబాదు నగరపాలక సంఘానికి వాసుదేవ మొదలియార్, డా. వి. ఎన్. తిమ్మరాజు, బి. వి. గురుమూర్తిగారలు మేయర్లుగా పని చేశారు.

హనుమంతరావుగారు హైదరాబాదు నగర మేయర్‌గా ఉన్న కాలంలో కొన్ని సత్సంప్రదాయాలు నెలకొల్పారు. పౌరుల కష్టనిష్ఠురాలను తెలిసికొని వాటిని తీర్చేందుకై గ్రీవెన్సెన్ కమిటీ అనే సంఘాన్ని ఏర్పాటుచేశారు. నగరంలోని గ్రంథాలయాలకు ధనసహాయం సరిగా అందేట్టు చూచేవారు. ప్రాథమిక పాఠశాలల్లో బాలబాలికల సాంఘిక విద్యాభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా ఏర్పాటుచేశారు. నగరానికి వచ్చే ప్రముఖులకు సమర్పించే పౌరసన్మాన పత్రాలు తెలుగుభాషలోనే రచింపబడేట్టుచేశారు. నగర పారిశుధ్యం, సభ్య పౌరజీవనం విషయంలో శ్రద్ధ వహించారు.

1952 లో హైదరాబాదు రాష్ట్ర శాసనసభకు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. కాని హనుమంతరావుగారికి హైదరాబాదు నగరంలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీచేసే అవకాశమివ్వకుండా, కమ్యూనిస్టుల ప్రాబల్యంగల గజ్వేల్ నియోజకవర్గంలో వారిని కాంగ్రెసు పార్టీ నిలబెట్టడంవల్ల వారు ఓడిపోవడం జరిగింది. ఇది పార్టీ ఓటమి.



హైదరాబాదునగర మేయర్
శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు



శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో ప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారి చిత్రాన్ని ఆవిష్కరిస్తున్న పంతులుగారు. చిత్రంలో ఎడమ పక్కనుంచి ఉన్నవారు శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారి, శ్రీమతి మాడపాటి మాణిక్యమ్మ, శ్రీ పంతులుగారు, డా॥ బి. రామరాజు, శ్రీ ఆదిరాజు వీరభద్రరావు, శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రిగారలు.



శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో ఆంధ్ర పితామహుని చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న
ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు.

# ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు అధ్యక్షపదవి

మాడపాటి హనుమంతరావుగారు ఆంధ్రప్రదేశ్ విధానపరిషత్తుకు (ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్) ఆరేండ్లపాటు అధ్యక్షులుగా ఉన్నారు. విధానపరిషత్తు మొదటి అధ్యక్షులు వీరే.

ఆంధ్రప్రదేశ్‌కు మొదటిసారిగా 1958 జూలై 1వ తేదీన విధాన పరిషత్తు ఏర్పడింది. దీనిని శాసనమండలి అని, ఎగువసభ (అప్పర్ హౌస్) అని కూడా వ్యవహరిస్తారు. అంతకుముందు ఆంధ్ర రాష్ట్రానికి శాసనసభ ఒక్కటిమాత్రమే ఉండేది. శాసనమండలి లేదు. 1958 జూలై 7వ తేదీ సాయంకాలం భారత రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ విధానపరిషత్తుకు ప్రారంభోత్సవం చేశారు. రాష్ట్రపతి ఆదేశానుసారం నామినేటెడ్ సభ్యులతోసహా 90 మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్తు ఏర్పాటు చేయబడింది.

హనుమంతరావుగారు ఆంధ్రప్రదేశ్ విధానపరిషత్తుకు శాసనసభ నియోజకవర్గంనుంచి మొదట 1958 లో ఎన్నికైనారు. అది రెండేళ్ళ టరమ్. ఆ తరువాత మళ్ళీ శాసనసభ నియోజకవర్గంనుంచి 1960 లో ఎన్నికై 1966 జూలై వరకు విధానపరిషత్తు సభ్యులుగా ఉన్నారు. పరిషత్తు సభ్యులుగా వీరు కాంగ్రెసుపార్టీకి చెందినవారు.

అధ్యక్షుని ఎన్నుకోవడానికై విధానపరిషత్తు సమావేశం 1958 జులై 7వ తేదీన జరిగింది. గొట్టిపాటి బ్రహ్మయ్యగారు తాత్కాలిక

అధ్యక్షులుగా ఉండి అధ్యక్షపదవికి ఎన్నిక జరిపించారు. హనుమంత రావుగారి నామినేషన్ ఒక్కటి మాత్రమే దాఖలు అయినందువల్ల వారు ఏకగ్రీవంగా ఏన్నుకోబడినట్లు ప్రకటిస్తూ "ఆంధ్ర పితామహులు ఈనాటి వారుకారు. వారు తెలంగాణాలో ప్రప్రథమంగా గ్రంథాలయోద్యమాన్ని చేపట్టి, ఊరూరా తిరిగి గ్రంథాలయాలు, పఠన మందిరాలు, రైతు సంఘాలు, మహిళాసంఘాలు, వర్తకసంఘాలు స్థాపించి, అన్ని రంగా లలో కృషిచేసి, ప్రజలలో నిద్రాణమైఉన్న ఆంధ్రత్వాన్ని ఏకీభావం లోకి తీసుకువచ్చి కేంద్రీకరించి దానిశక్తిని ప్రజ్వలింపజేసి, ఆంధ్రోద్య మానికీ స్వరాజ్య ఉద్యమానికీ అది ఉపయోగపడేటట్లు చేసినటువంటి నిర్మాణ కార్యనిపుణులువారు. అట్టి ఆంధ్ర పితామహుడు ఆంధ్రకు తెలంగాణాకు సేతునిర్మాత అని నేను అభినందించిన అతిశయోక్తి కాదనుకుంటాను. అట్టివారు ఈసభకు అధ్యక్షులుగా దొరకడం మన భాగ్యమని తలుస్తున్నాను. అట్టివారి ఆధ్వర్యాన అభ్యుదయ సంస్క రణలను, శాసన నిర్మాణమును మనముచేసి, మన ప్రభుత్వాన్ని మన దేశాన్ని పటిష్ఠమైనదిగా చేసుకొనే భాగ్యము ఈసభకు కలుగుగాక అని కోరుతూ ఆంధ్ర పితామహుని పద్మభూషణుని ఈ స్థానమును స్వీకరించ వలసినదిగా కోరుతున్నాను. వారిని ఈ స్థానమునకు తీసుకు రావలసి నదిగా ముఖ్యమంత్రిగారిని, సభానాయకుని, ప్రతిపక్ష నాయకుని ప్రార్థి స్తున్నాను" అని గొట్టిపాటి బ్రహ్మయ్యగారు అన్నారు.

అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు, కమ్యూనిస్టుపార్టీ నాయకులు మఖ్దూం మొహియుద్దీన్‌గారు (వీరు ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు. ఉర్దూలో గొప్పకవి) హనుమంతరావు పంతులు గారిని సభావేదికకు తీసుకొని వెళ్ళగా వారు అధ్యక్షస్థానంలో ఆసీను లయ్యారు. పంతులుగారు వారి 74వ ఏట ఈ సభాధ్యక్షపదవిని అలంకరించారు.

అంతట రాష్ట్రముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డిగారు మాట్లాడుతూ "మీకు ఈనాడు ఈ గౌరవస్థానాన్ని ఇచ్చాము అనేదానికన్న ఈపదవిని మీరు అంగీకరించడంవల్ల ఈసభకే మీరు గౌరవాన్ని చేకూర్చారు. ఆంధ్రదేశానికి 40 సంవత్సరాలనుండి మీరుచేసిన సేవకు చిహ్నంగా ఆంధ్రదేశం ఈవిధంగా ఋణం తీర్చుకొంటున్నది—మీరువేసిన పునాదుల మీదనే దేశం ఈ స్థితికి రాగలిగింది— ఈ పదవి కావాలని మీరు ఎప్పుడూ కోరలేదు— అదే మీలోఉన్న గొప్పగుణము—ఆంధ్రపితామహ, పద్మభూషణలాంటి ఎన్నో గొప్పగౌరవములు మీకింతకు ముందే లభ్యమైనవి. మిమ్ములను ప్రత్యేకంగా సభ తరపున సభానాయకుడుగా నేను అభినందిస్తున్నాను" అన్నారు.

ప్రతిపక్ష నాయకుడు మఖ్దూం మొహియుద్దీన్‌గారు మాట్లాడుతూ "ఇది మన రాష్ట్రచరిత్రతో, ఆంధ్ర ప్రజల చరిత్రలో గొప్పసన్నివేశం. మొదటిసారిగా ఈ సభ ఏర్పాటు చేయబడింది. మీరు ఏకగ్రీవంగా సభాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. మీరు తెలంగాణా ప్రజల హృదయాలను వెలిగించారు. గ్రంథాలయోద్యమాన్ని, స్త్రీవిద్యను ప్రోత్సహించారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఉద్యమం నడిపారు. మీ ఈకృషివల్ల ప్రజలు సాహసోపేతులై 1938 లో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి బాధ్యతాయుత ప్రభుత్వం కోరారు. మీరీ ఉద్యమాలన్నిటికీ ఆద్యులు. మీరు ఆంధ్రమహాసభను ఏర్పాటుచేశారు- తెలుగు ప్రజల ఐక్యతను సాధించారు. ఒకానొక అంధయుగంలో మీరు త్యాగంచేసి పోరాటాలు సల్పి సామాన్య మానవుని శ్రేయస్సుకు పూనుకొన్నారు. మీరు ఆ కాలంలో ఒక్క తెలంగాణాకేకాక మొత్తం హైదరాబాదురాష్ట్ర ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారు. మీ ఉన్నతాదర్శాలతో త్యాగాలతో ఏ ఒక్కపార్టీ అభిమానాన్ని మాత్రమేకాక యావదాంధ్ర ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు", అని మఖ్దూంగారు ప్రస్తుతించారు.

ఆంధ్రప్రదేశ్ సోదరీమణుల తరపున తాము పంతులుగారికి ధన్యవాదములు తెలుపుతున్నామని కడప రామసుబ్బమ్మగారు అన్నారు.

ఉపాధ్యాయ నియోజకవర్గానికి చెందిన ప్రఖ్యాత కవి కాళోజీ నారాయణరావుగారు పంతులుగారిని అభినందిస్తూ పంతులుగారు ఏసభకు అధ్యక్షత వహించినప్పటికీ, సభలో పాల్గొన్నవారందరి మర్యాదను పాటిస్తూ మార్గదర్శకులుగా ఉన్నట్లుగానే ఈ సభయొక్క గౌరవాన్ని కూడా కాపాడగలరనీ, ఈ అధ్యక్షపీఠానికి వారివంటి గొప్ప వ్యక్తి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం దేశం అదృష్టమని అన్నారు.

పంతులుగారి సేవలను, గుణగణాలను ప్రశంసిస్తూ మరి కొందరు పరిషత్తు గౌరవ సభ్యులు అహమహమికతో ఎంతో ఉత్సాహంతో చక్కగా ప్రసంగించారు.

పంతులుగారు ఈ అభినందనలకు సమాధానమిస్తూ "మిత్రులు తెలిపినట్లు నేను వయోవృద్ధుడనే. నాకు 74 వ సంవత్సరం వచ్చినది. ""నిరస్తే పాదపే దేశే హేరండో ప్రిదుమాయతే" అన్నట్లు ప్రజలలో అభ్యున్నతి లేనప్పుడు, బానిసత్వం ఉన్నప్పుడు, రాజకీయం అనేమాట ఎత్తడానికే వీలులేకుండా ఉన్నప్పుడు, గ్రంథాలయాలు స్థాపించడమే మహాదోషంగా ఎంచబడే రోజుల్లో, ఆ కాలంలో ఏదో కొద్దిగా పని చేసి నందువల్ల ఈనాడు నాకీగౌరవం లభించినది. ఒక ఉర్దూ కవి చెప్పినట్లు శత్రువుకంటె మంచిస్నేహితుడు ఎవరూలేరు. అతను మనలోని లోప ములను ఎత్తి చూపిస్తూ ఉండడమువలన మనము వాటిని సరిదిద్దడానికి వీలు కలుగుతున్నది" అంటూ అందరికీ కృతజ్ఞతలు చెప్పి ప్రతి పక్ష సభ్యుల పాత్రను శ్లాఘించారు,

శాసన పరిషత్తు అధ్యక్షులుగా పంతులుగారు మూర్తీభవించిన శాంతమై కన్పించేవారు. సభలోని అందరి గౌరవాభిమానాలను వీరు

చూరగొన్నారు. సభ్యులను ఎంతో వినయంతో కలుసుకొనేవారు. వారి పట్ల ఆప్యాయత చూపేవారు. సభానిర్వహణలో ఏమాత్రం ఒడుదుడుకులు ఉండేవికావు. వారి కాలంలో సభ ఎట్టి అలజడిలేక శాంతంగా సాగేది. నిష్పక్షపాతంగా వ్యవహరించడంలేదు. సీరియస్ సమస్యలు వచ్చినా సభసాఫీగానే సాగిపోతూండేది. ఒకరికి వార్నింగ్ ఇవ్వడం లేదు. సభకు అధ్యక్షులు రాకపోవడమంటూలేదు. వారు ఒకవేళ సభ విడిచిపెట్టి వెళ్ళినా చేంబర్‌లో కూర్చొని సభా కార్యక్రమాలు వినేవారు. మళ్ళీవచ్చి సభకు అధ్యక్షత వహించేవారు. అవసరాన్నిబట్టి సభా కార్యక్రమాన్ని చకచకా నడిపించేవారు. సభలో ఎంతో కార్యక్రమం జరగవలసి ఉండడంచేత అనేకమంది సభ్యులు సమయం అడిగితే లేదని నిరాకరింపవలసి వచ్చేది. బెల్ రింగ్ చేసి తొందరపెట్టి ప్రసంగంచేసే వారిని ఆపుచేయించేవారు. అలా తొందరపెట్టడం వారికి అయిష్టంగానే ఉండేది. అందుకువారు విచారపడేవారు. ఒకవేళ ఏ సభ్యుడైనా రూలింగ్ ఇవ్వవలసిందిగా పట్టుపట్టితే ఇస్తాము అంటూ సభా కార్యక్రమం ఆగకుండా నడిపించేవారు. స్పర్థలు, వాగ్వివాదాలు అతిగాసాగడం తమకు ఇష్టంలేనట్లు వారు కన్పించేవారు. ఎప్పుడైనా ఎవరో ఒక ప్రతిపక్ష సభ్యులు వీరిపై ప్రభుత్వంవారిని మందలించనైనాలేదే అంటూ మృదువైన నిందవేసేవారుతప్ప, పక్షపాతం చూపిస్తున్నారనిగాని, ప్రభుత్వ అనుకూల వైఖరి కనపరుస్తున్నారనిగాని ఆరోపణలు చేయలేదు. "అయ్యా, మీ ఏకగ్రీవ ఎన్నికను మేమూ ఆమోదించాము. మా విమర్శలను మీరు గుర్తుపెట్టుకొని ప్రభుత్వ పక్షంవారిని గట్టిగా మందలించాలి" అన్న ధోరణిలో విజ్ఞప్తిచేసేవారు. ప్రభుత్వాన్ని వీరు గట్టిగా మందలించకపోయినా ప్రతిపక్ష సభ్యులకు ప్రజల సమస్యలను సభ ముందుంచేందుకు తగిన అవకాశం ఇచ్చారు. ఎవరిమనస్సూ నొప్పించేవారుకాదు. వీరి అధ్యక్షతన సభ గడబిడలేకుండా నిశ్శబ్దంగా సాగిందని

పలువురు సభ్యులు అంగీకరించారు. అందుకు పంతులుగారు "బహుశా ఇది ఎల్డర్స్‌సభ అనిపించుకొన్నందున నావలెనే ఎల్డర్స్ (వయస్సులో పెద్దలు) ఎక్కువమందివుండి దీనిని శాంతంగా జరిపి ఉన్నారని భావిస్తున్నాను" అని అనే వారు చమత్కారంగా. పంతులుగారు శాసన పరిషత్తు సభ్యులయెడ చూపిన ఆదరణ అభిమానం ఎవరూ మరువలేదు. తమకంటె చిన్నవారిని సంబోధించడంలో ఎంతో మర్యాదచూపేవారు. పార్టీతో, రాజకీయాలతో నిమిత్తంలేకుండా అందరినీ సమాన ప్రతిపత్తితో గౌరవించడం వీరి ప్రత్యేకతగా ఉండేది. సభాకార్యక్రమంలో ఏదైనా ఇంటరప్షన్‌వస్తే (ఆటంకపరచడం) 'నెక్స్ట్ సబ్జెక్టు' అని ముందుకు సాగి వెళ్ళేవారు. కౌన్సిల్‌ను చాలా గొప్పగా హుందాగా పక్షపాత రహితంగా నడిపారనే పేరుప్రతిష్ఠలు పంతులుగారు సంపాదించారు. "ఏమాత్రం గందరగోళం లేకుండా శాంతియుతంగా పంతులుగారు సమావేశాలు నడుపుతున్నారు" అని ఒకమారు ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డిగారు అన్నారు.

హనుమంతరావు పంతులుగారు 1958 జూలై 7వ తేదీన విధాన పరిషత్తు అధ్యక్షులుగా ఎన్నికై 1964 వరకు — అనగా మొత్తం ఆరేండ్లపాటు ఆ పదవిలో ఉన్నారు. ఈ మధ్యలో 1960 జూలై 11వ తేదీన వీరు విధానపరిషత్తు అధ్యక్షులుగా మరొకమారు ఏకగ్రీవంగాఎన్నికయ్యారు. పరిషత్తు సభ్యులుగా వీరి రెండేళ్ళ టర్మ్ అయిపోవడంవల్ల మళ్ళీ అధ్యక్షపదవికి ఎన్నుకోబడవలసి వచ్చింది. అప్పుడు డి. సంజీవయ్యగారు ముఖ్యమంత్రి. పంతులుగారు 1964 జూలై 20 తేదీన విధానపరిషత్తు అధ్యక్షపదవికి రాజీనామాచేశారు. అయితే వారి పరిషత్తు సభ్యత్వం ఇంకా ఉన్నందువల్ల రెండేళ్ళపాటు—అనగా 1966 జూలైవరకూ కేవలం సభ్యులుగా ఉన్నారు.

పంతులుగారు విధానపరిషత్తు అధ్యక్షులుగా పదవీ విరమణ చేసినప్పుడు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సభానాయకుడు అయిన కాసు బ్రహ్మానందరెడ్డిగారు పరిషత్తు వీరికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభలో ప్రతిపాదించగా సభవారు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆ తీర్మానంలో సభాధ్యక్షులుగా వీరి ఉత్కృష్ట సేవలను కొనియాడి, ఆ ఉన్నతపదవిలో వీరు చూపిన ఉత్సాహమును, శక్తి సామర్థ్యాలను గొప్పగా ప్రశంసించి, సభ్యులయెడ అందరిపట్ల ఒకే విధంగా వీరు శ్రద్ధను, సౌజన్యాన్ని చూపి సభలో అన్నివర్గాల గౌరవాదరణములకు పాత్రులైనందుకు తమ గాఢ కృతజ్ఞతా భావమును నమోదుచేశారు.

---

* గమనిక : విధాన పరిషత్తులో ప్రముఖుల ప్రసంగాలను సౌలభ్యంకోసం సంక్షిప్తంచేసి ముఖ్యాంశాలనే స్వీకరించడం జరిగింది. మరికొందరి ప్రసంగాలను స్థలాభావంచేత ఉదాహరింప లేకపోయాను. ఇందుకు క్షంతవ్యుడను.

—రచయిత.

# గౌరవాలు

పదవులు, బిరుదులు ఆశించక నిరాడంబరంగా నిస్వార్థంగా, నిర్మాణాత్మకంగా దేశ సేవ చేసిన హనుమంతరావు పంతులుగారికి వారి జీవితపు మలిదశలో బిరుదులు, గౌరవములు, పదవులు వాటంతట అవే వచ్చాయి. భారత ప్రభుత్వంవారు వివిధ రంగాలలో గణనీయమైన కృషి చేసిన వారికి, అనన్యమైన ప్రతిభా సామర్థ్యాలు చూపినవారికి, గొప్ప వ్యక్తిత్వం కలిగివున్నవారికి ఏటా రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా బిరుదప్రదానం చేస్తారు. ఆ సంప్రదాయాన్ని అనుసరించి రాష్ట్రపతి మాడపాటి హనుమంతరావుగారికి 1955 జనవరి 26 వ తేదీన 'పద్మ భూషణ్' బిరుదు ఇచ్చారు. ఈ బిరుదమందుకొన్న తెలుగువారిలో వీరే ప్రథములు. దీనిని స్వీకరించడానికి పంతులుగారు ఆ సంవత్సరం ఢిల్లీ వెళ్ళలేకపోవడంచేత రాష్ట్రపతి డా. రాజేంద్రప్రసాద్‌గారు హైదరాబాదు విచ్చేసినప్పుడు 1956 జులై 5వ తేదీన బొలారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆ బిరుద పతకాన్ని ప్రదానంచేశారు.

బూర్గుల రామకృష్ణారావుగారు హైదరాబాదు రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడే హనుమంతరావుగారిని ఉస్మానియా విశ్వవిద్యాలయ శాశ్వత సెనేట్ మెంబరుగా నియమించారు.

పంతులుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయ సిండికేట్ సభ్యులుగా నాలుగేళ్ళు ఉన్నారు. పోలీసుచర్య తరువాత కూడా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుభాషకు సముచిత స్థానం లభించడం కష్టమైంది. అప్పుడు పంతులుగారు మరికొందరు ప్రముఖులతో


కలిసి తెలుగును ఈ విశ్వవిద్యాలయంలో రెండవ భాషగా (ప్రాంతీయ భాషగా) పెట్టించడానికి కృషిచేసి విజయం సాధించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం 1956 నవంబరు 4వ తేదీన జరిగిన కాన్వొకేషన్‌లో పంతులుగారికి గౌరవ డి. లిట్. (డాక్టర్ ఆఫ్ లిటరేచర్) పట్టప్రదానంచేసి గౌరవించింది. అప్పుడు ఈ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ప్రముఖ విజ్ఞాన శాస్త్రవేత్త డా॥ సూరిభగవంతం గారున్నారు. వారు డి. లిట్. పట్టాన్ని పంతులుగారికి ప్రదానం చేయవలసిందిగా విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌కు విన్నవిస్తూ పంతులుగారు రాష్ట్రానికీ, ముఖ్యంగా విద్యారంగానికీ ఉస్మానియా విశ్వవిద్యాలయానికీ చేసిన సేవల ప్రశంసచేసి, "హైదరాబాదుకు చెందిన ఈ వృద్ధమనీషి ఎల్లప్పుడూ నిరాడంబర జీవితానికీ ఉన్నతాదర్శాలకూ ఉదాహరణప్రాయంగా జీవనం గడపి, ప్రజలకు తన సర్వస్వమూ అర్పించుకోవడమేగాని, వారినుండి తనకేమీ పొందనట్టి నిస్వార్థజీవి" అని ప్రస్తుతించారు.

# కుటుంబం

హనుమంతరావుగారు చదువు పూర్తి అయిన కొద్దికాలానికే 1904 లో తమ చిన మేనమామగారి కుమార్తె అన్నపూర్ణమ్మను వివాహ మాడారు. హనుమకొండలో చిన్న ఉద్యోగంలో ఉన్నప్పటికీ భార్యను తెచ్చుకొని కాపురం పెట్టడమే కాక, మేనత్తను కూడా తమతోపాటే ఉండమనిచెప్పి ఆమెను ఆదరించారు. అన్నపూర్ణమ్మగారివల్ల వీరికి ఒక కుమార్తె కలిగింది. ఆమెపేరు లక్ష్మీబాయి. ఆ తర్వాత కొద్దికాలానికే అన్నపూర్ణమ్మగారు యౌవనదశలోనే అకాలమృత్యువుకు లోనుకాగా, ఆ తల్లిలేని బిడ్డను హనుమంతరావుగారి అన్నగారైన తిరుమలరావుగారు వారి భార్యగారు గారాబంగా పెంచి పెద్దదానిని చేశారు. లక్ష్మీబాయి గుంటూరులో వకీలైన గోవిందరాజుల దత్తాత్రేయగారిని వివాహమాడారు.

తిరుమలరావుగారు ఎర్రుపాలెం కాపురస్థులై వకీలు వృత్తి చేస్తూ ప్రజా జీవితంలోకూడా పాల్గొన్నారు. ఆంధ్రోద్యమం ప్రారంభదశలో వారు ఆంధ్రజనసంఘం మూడవ కేంద్ర సంఘ సమావేశానికీ, ఆంధ్ర గ్రంథాలయ ప్రథమ మహాసభకూ ఆహ్వాన సంఘాధ్యక్షులుగా వుండి ఆ సభలను జయప్రదంగా జరిపించారు. వారి కుమారుడు మాడపాటి రామచంద్రరావుగారు మేధావి. ఆయన న్యాయశాస్త్రంలో పట్టభద్రులై సినిమారంగంలో సహాయదర్శకులుగా పనిచేశారు. ఆ తర్వాత రామ చంద్రరావుగారు హైదరాబాదు స్టేట్ కాంగ్రెసు ఉద్యమంలో పాల్గొని స్వామి రామానందతీర్థ అధ్యక్షులుగా ఉండగా స్టేట్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నిజాంకు వ్యతిరేకంగా సాగిన స్టేట్ కాంగ్రెసు సరిహద్దు పోరాటంలో రామచంద్రరావుగారు స్టేట్ కాంగ్రెస్ కార్యాచరణ



మాడపాటి హనుమంతరావు దంపతులు, వారి కుమారుడు చి॥ సుకుమార్.



హనుమంతరావు దంపతులు, కుమారుడు చి॥ సుకుమార్, కోడలు శ్రీమతి సుచేత.



మాడపాటి హనుమంతరావు పంతులుగారి కుమారుడు మాడపాటి సుకుమార్,
కోడలు శ్రీమతి సుచేత.

సంఘం సభ్యులుగా పనిచేశారు. ఆ సరిహద్దు పోరాటంలో రామచంద్ర రావుగారి కుమారులైన మాడపాటి వినయకుమార్ ఈ రచయితతోపాటు బెజవాడ శిబిరంలో పనిచేశారు. రామచంద్రరావుగారి ఉన్నత విద్య విషయంలో హనుమంతరావు పంతులుగారు శ్రద్ధ తీసుకొన్నారు. తిరుమలరావుగారు 1936 లో స్వర్గస్థులైనారు.

భార్య అన్నపూర్ణమ్మగారు చనిపోయిన తర్వాత హనుమంతరావు పంతులుగారు 1918 లో గోళ్ళమూడి హనుమంతరావుగారి కుమార్తె మాణిక్యమ్మగారిని వివాహం చేసుకున్నారు. తాము నెలకొల్పిన బాలికల ఉన్నత పాఠశాలలో మాణిక్యమ్మగారిని విద్యార్థినిగా చేర్చి, తాము స్వయంగా ఆమెకు చదువుచెప్పి ప్రవేశ పరీక్షకు కూర్చోబెట్టగా ఆమె ఉత్తీర్ణురాలై తెలుగు ఇంగ్లీషు భాషలలో మంచి పరిజ్ఞానం సంపాదించారు. మాణిక్యమ్మగారు కూడా ప్రజాసేవారంగంలో భర్తను అనుసరించి సిరిసిల్లలో 1935 లో నాల్గవ ఆంధ్రమహాసభతో పాటుగా జరిగిన ఆంధ్ర మహిళాసభకు అధ్యక్షత వహించి, నారీలోకం ఆదరాభిమానాలకు పాత్రులైనారు. మాణిక్యమ్మగారివల్ల హనుమంతరావు పంతులుగారికి ఒక కుమారుడు కలిగాడు. ఆయనపేరు సుకుమార్. సుకుమార్ పట్టభద్రుడై గెజిటెడ్ ఆఫీసర్ ఉద్యోగంలో చేరి 1964 లో సుచేత అను విద్యావతిని వివాహం చేసుకొన్నాడు. ఎంతో పైకి రావలసిన సుకుమార్ తండ్రిగారి మరణానంతరం అకాలమరణం చెందారు. శ్రీమతి సుచేత మాడపాటి హనుమంతరావు బాలికల ఉన్నతపాఠశాలకు తమ సేవలను అర్పితం చేశారు.

# మిత్రుడు, మార్గదర్శి, ఆదర్శప్రాయుడు

ప్రజాహితకార్యదీక్షాపరులైన పంతులుగారిలో అందుకు అవసరమైన సౌజన్య గుణవిశేషాలు ఉండటం తెలంగాణా ప్రజల అదృష్టవిశేషమని చెప్పాలి. వీరు ఎల్లప్పుడూ నిరాడంబర జీవితం గడిపారు. శ్రమకు ఎన్నడూ వెనుదీయలేదు. నిరంతరకృషీవలుడీయన. అవిరళ సేవ ఈయనది. వీరి నిత్యజీవితంలో ప్రజాహితకార్యాలు ప్రధానస్థానమాక్రమించి ఉండేవి. నియమబద్ధులై నిరంతరము శ్రమించి ఫలితాలను బేరీజువేసుకొన్న సేవాదురీణుడు. వీరి సౌలభ్యము, మార్దవము, హృదయకోమలత్వం అందరినీ ఆకర్షించేవి. వీరి విజ్ఞానతృష్ణ యువకులకు ఆదర్శప్రాయంగా ఉండేది. విద్యావినోదిగా వీరు పేరుపడ్డారు. శాంతిప్రియులు, వినయభూషణులు; సర్వసమవర్తి. ప్రజాజీవితంలో ఉదారులను, సమర్థులను గుర్తించి వారితోమైత్రి నెరపడంలో, వారి సేవలను ఇతోధికంగా ప్రజలకు లభింపజేయడంలో వీరు చూపిన బుద్ధికౌశలము దానికదేసాటి. రాజాబహద్దరు వెంకటరామారెడ్డిగారు నిజాం ప్రభువును సేవిస్తూకూడా స్వజాతి అభ్యుదయానికీ, దాని సంస్కృతి వికాసానికీ పాటుపడే వ్యక్తులకూ సంస్థలకూ చేయూతనిచ్చి, అటు పాలకులకు విశ్వాసపాత్రుడై, ఇటు ప్రజల ప్రేమాభిమానాలకు పాత్రుడైన విజ్ఞతాసంపన్నుడు. నిజాం రాష్ట్రంలో ఆంధ్రులకాయన చేసినమేలు ఇంతని వర్ణించిచెప్పనలవికానిది. హనుమంతరావు పంతులుగారు అంతటి మహావ్యక్తితో మైత్రినికాంక్షించారు. తాముస్థాపించిన బాలికోన్నత పాఠశాలకు వారిని అధ్యక్షులుగా చేసుకొని ఆ సంస్థ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లేటట్టు వారి ఆధ్వర్యాన సంస్థ అభివృద్ధికి పాటుపడ్డారు.

సురవరం ప్రతాపరెడ్డిగారు రచించిన రాజాబహద్దరు జీవితచరిత్రకు పంతులుగారు నివేదనవ్రాస్తూ వ్రాసిన మాటలు ఇచట స్మరణీయమైనవి: "శ్రీ రాజాబహద్దరువారి సేవాసక్తి ఔదార్యమును మేమీ విజ్ఞప్తియందు ఎక్కువగా ప్రస్తావించదలచలేదు. తలచినను అది సాధ్యముకాదు. ఈ నిజాం రాష్ట్రములో 50 సంవత్సరములకంటె ఎక్కువకాలమునుండి ప్రభుసేవయొనర్చుచు, దాదాపుగా నీకాలమంతయు పోలీసు ఉద్యోగమున గడపియు, జాతిమతభేదములగాని, సంపన్నులు పేదలు అను తారతమ్యమునుగాని గమనించక ఆబాలగోపాలము అందరి మన్ననలకు పాత్రులై, చేతనైన ఉపకారము అడిగినను అడుగకపోయినను ప్రతి వారికి చేయు జీవనమును ధన్యముగా గడపుచున్న శ్రీ రాజాబహద్దరు రెడ్డిగారు నిజాము రాష్ట్రములోని ప్రతివ్యక్తికిని ఆదర్శప్రాయులు" అని కీర్తించారు. రాజాబహద్దరు వారి పరోపకారపారీణతను, విద్యాపోషణమును దేశసేవను పంతులుగారు తరచు ప్రస్తావించడమేగాక, వాటిని వారు మరింతగా ఉపయోగించుకొని, అంతటి స్త్రీ విద్యాభిమాని పేర హైదరాబాదు నగరంలో స్త్రీల కళాశాల ఒకటి ఉండటం అవసరమని భావించి అట్టి కళాశాల ఏర్పాటుకు కృషిచేసి దానిని సాధింపగలిగారు. రాజాబహద్దరు వారికి హనుమంతరావు పంతులుగారిపై ప్రత్యేక గౌరవభావం ఉండేది. వీరి ఉభయుల పరస్పర సహకారం తెలంగాణా ప్రజలకు ఎంతైనామేలు చేసింది.

హనుమంతరావుగారి సన్నిహితులలో సురవరం ప్రతాపరెడ్డిగారు ఒకరు. వీరిద్దరూ ఒకరికొకరు ఆప్తులు. రెడ్డిగారి అధ్యయనం, పాండిత్యం, రచనా కౌశలముపై పంతులుగారికి ఎనలేని అభిమానం, గౌరవం ఉండేవి. పంతులుగారి నాయకత్వాన్ని రెడ్డిగారు సర్వవేళలా ఆమోదించి వారిని అనుసరించారు. హనుమంతరావుగారు ప్రప్రథమంగా 1925 లో ప్రతాపరెడ్డిగారిని దర్శించి పరిచయంచేసుకొన్నారు. అప్పటికి

రెడ్డిగారు రెడ్డిజనసంఘ కార్యదర్శిగా రాజాబహద్దరు వెంకటరామారెడ్డి గారి అభిమతమునసుసరించి పనిచేస్తూఉన్నారు. పంతులుగారు శ్రీకృష్ణ దేవరాయాంధ్రభాషా నిలయంలో సభ ఏర్పాటు చేయించి ప్రతాపరెడ్డి గారిచే 'నిజాంరాష్ట్రాంధ్రులు' అనే విషయంపై ఉపన్యాసమిప్పించారు. ఉపన్యాసం ముగిసిన తర్వాత పంతులుగారు సుమారొక గంటసేపు ప్రసంగించి రెడ్డిగారి ప్రసంగమును ఎంతో ప్రశంసించారు ఆ తర్వాత పంతులుగారు రెడ్డిగారిని క్రమంగా ప్రజా వ్యవహారాలలోకి తీసుకొచ్చి తాము ఆరంభించిన ఆంధ్రోద్యమానికి చేదోడువాదోడుగానిలుపుకొన్నారు.

ప్రతాపరెడ్డిగారి జీవితచరిత్ర రచించిన ఒకరచయిత ఆ చరిత్రలో ఇట్లా తెలియజేశారు. *"ప్రతాపరెడ్డిగారి ప్రజాసేవ ప్రబోధములతో ప్రారంభమైనది. వారు రెడ్డి జనసంఘ కార్యదర్శిగా ఉన్నప్పుడు విద్యార్థులకొరకు ఉపన్యసిస్తూ ఉండేవారు. కాగితములపై క్రమబద్ధంగా వ్రాసుకొని, ఆ అంశాలనే విపులీకరించేవారు. ఆ విషయం ఆ నోటా ఆ నోటా పడి మాడపాటి హనుమంతరావుగారికి తెలిసింది. రావుగారు రెడ్డిగారిని వెతుక్కుంటూ వచ్చారు. ఆంధ్ర పితామహునితో వున్న గొప్పతనమదియే. ఎక్కడ సామర్థ్యంకల యువకులూ, కార్యదీక్షాపరాయణులూ, సేవాస్వభావముగలవారూ గోచరించినా మాడపాటివారు తామే స్వయంగా వారివద్దకువెళ్ళి వారికి పని కల్పించి తమ ఆంధ్రోద్యమ కార్యక్రమాన్ని నిర్వహించేవారు. మాడపాటివారెన్నడూ తగుదునమ్మా యని తామే పట్టము కట్టుకొనలేదు. పనులు నిర్వహించుటలో తాము ముందుండి, పట్టము మాత్రము మరొకరికి కట్టి మురిసిపోతుండెడివారు.

---

* 'సురవరం ప్రతాపరెడ్డి–జీవితము–రచనలు'
  రచన : ముద్దసాని రామిరెడ్డి,
  ప్రచురణ : ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు.

అందుకే ఆంధ్రపితామహులు అందరికీ గురుతుల్యులైనారు. ప్రతాపరెడ్డి గారికి మాడపాటివారు రాజకీయగురువు. రెడ్డిగారు అభిమానించి గౌరవించిన వ్యక్తి రాజకీయరంగంలో ఒక్క హనుమంతరావుగారే!"

అంతేకాక 'గోలకొండపత్రిక' ద్వైవారపత్రికగా వెలువడాలని మాడపాటి హనుమంతరావుగారు కూడా అభిలషించడంవల్ల వారు, ఆ పత్రిక సక్రమ ప్రచురణకు తోడ్పడవలసి వచ్చింది. ప్రతాపరెడ్డిగారికి వారు అండగా నిలిచారు, అని కూడా ఆ రచయిత తెలిపి ఉన్నారు. 1930 లో జోగిపేటలో జరిగిన మొట్టమొదటి ఆంధ్రమహాసభకు అధ్యక్షులెవరు కావాలి అన్న ప్రశ్న వచ్చినప్పుడు హనుమంతరావు పంతులుగారు సురవరం ప్రతాపరెడ్డిగారినే ఎంపిక చేశారు. ఒక గొప్ప పత్రికా సంపాదకుడు, పండితుడు, సర్వతోముఖ ప్రతిభాశాలియైన రచయిత మొదటి ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించడం, ఆ సంస్థకు శుభోదయమనే చెప్పాలి. ఆంధ్ర మహాసభలకు అధ్యక్షత వహించిన వారందరిలో ప్రతాపరెడ్డిగారే అన్నివిధాలా సమర్థులని పంతులుగారు తమ 'తెలంగాణా ఆంధ్రోద్యమం' రెండవసంపుటిలో వ్రాశారు. ఆంధ్రోద్యమానికి ప్రతాపరెడ్డిగారి సంపాదకత్వాన 'గోలకొండపత్రిక' ఇచ్చిన చేయూత, కలిగించిన ప్రచారము అద్వితీయమైనవి. గ్రామప్రజలకు ఈ పత్రికవల్లనే ఆంధ్రమహాసభల వార్తలు తెలియవస్తూ ఉండేవి.

ఈవిధంగా హనుమంతరావుగారు ప్రజాహిత జీవనంలో ప్రవేశించినది మొదలు తమతోపాటు అనేకమంది పెద్దలను, విద్యావంతులను, దాతలను ప్రజాసేవకులుగా తయారుచేస్తూ పోయారు. ముఖ్యంగా కొండా వెంకటరంగారెడ్డిగారిని హనుమంతరావుగారే ప్రజాసేవలోకి తీసుకువచ్చారు. వెంకటరంగారెడ్డిగారు వారి 'స్వీయచరిత్ర'లో ఇట్లా

వ్రాశారు. *"శ్రీ మాడపాటి హనుమంతరావుగారు వకాలత్ ప్రారంభించిన తర్వాత తెలంగాణమువారిని కూడా ప్రజాహిత కార్యములలో ముందుకు తెచ్చుటకు, ప్రజలలో జాగృతి కలిగించవలెనని వకాలత్‌తో పాటు కృషి చేయసాగిరి. కొద్దికాలములోనే తెలంగాణములో జాగృతి వచ్చి జనులు ప్రజాహిత కార్యములలో మహారాష్ట్ర, కర్ణాటక సోదరుల కంటె ముందుకు పోయినారు. నేను నడుపుచుండిన 'లా' క్లాసు పోస్టర్ల ద్వారా నా పేరువిని శ్రీ హనుమంతరావుగారు నా దగ్గరకు వచ్చి నన్ను కూడా వకాలత్‌తో పాటు ప్రజాహిత కార్యములలో పాల్గొనవలసినదిగా పదేపదే చెప్పుచూవచ్చిరి. నేను ప్రప్రథమమున కుటుంబభారమువలన పాల్గొన నిరాకరించితిని. కాని వారు మరల మరల కోరుటవల్ల అంగీకరించి ప్రజాహిత కార్యములలో పాల్గొన ప్రారంభించితిని."

అంతకుమునుపు హైదరాబాదు రాష్ట్రంలో ప్రజాహిత కార్యాలు చాలా తక్కువఅనీ, ఏవైనా కొద్దిగాఉంటే అవి హైదరాబాదునగరంలోనే అనీ, వాటినికూడా అడ్వకేటు పండిత కేశవరావు, జాగీర్దార్ వామన్ నాయక్ అనే మహారాష్ట్రులే నడుపుతూఉండేవారు అని కూడా రంగారెడ్డిగారు తెలిపారు. బహుశా ఈ కారణంచేతనే కాబోలు, మందుముల నరసింగరావుగారు వారు రచించిన '50 సంవత్సరాల హైదరాబాదు' అనే గ్రంథంలో మాడపాటి హనుమంతరావుగారు రెండవ తరం నాయకులన్నివ్రాశారు. ఇది నిజమే. అయితే "తెలంగాణాలో అసలు ప్రజాజీవితం వీరితో ఆరంభమైనదికావుననే నిజాంరాష్ట్ర ఆంధ్రోద్యమమునకు 'పితామహులు' అని పేరుగాంచినారు" అని పంతులుగారినిగూర్చి ప్రత్యేకంగా రచించిన ఒక షేరాలో నరసింగరావుగారు తమ అభిప్రా

---

* 'స్వీయచరిత్ర' – కొండా వెంకటరంగారెడ్డి;
స్వీయచరిత్ర ట్రస్టు కమిటీ; హైదరాబాదు, 1967

యం వ్రాశారు. ప్రజాసేవను విస్తారంగా తెలంగాణా గ్రామాలలోకి తీసుకువెళ్ళినవారు హనుమంతరావు పంతులుగారే.

కొండా వెంకటరంగారెడ్డిగారి ఈ స్వీయచరిత్రకు హనుమంతరావు పంతులుగారు తొలిపలుకువ్రాస్తూ "యధార్థమేమనగా వారికిని నాకును పూర్వపు పరిచయమేమీలేదు. నేను తెలంగాణమునకు చిట్టచివరి రైలుస్టేషనగు ఎర్రుపాలెము గ్రామకాపురస్తుడను. ఇక ఆయన హైదరాబాదు జిల్లాలోని మంగళారంగ్రామ కాపురస్తుడు. ఇట్టిస్థితిలో మా ఇద్దరకు గాఢమగుమైత్రి, పరస్పరావగాహన సంభవించి తెలంగాణములోని దాదాపు కోటిమంది ప్రజల రాజకీయ వైజ్ఞానిక సాంఘికచైతన్యమునకు తోడ్పడగలుగుట కేవలము దైవికమని భావించుచున్నాను. నాకు ప్రభుత్వమువారివల్లను, ప్రజలవల్లను కలిగిన సమస్త గౌరవములు, బిరుదములు, పదవులు వీరియొక్క నిస్వార్థకృషి ఫలితములే" అని వ్రాశారు. అన్నీ ఏమోకాని పంతులుగారి షష్టిపూర్తిని రెడ్డిగారే పూనుకొని వైభవంగా జరిపారు. పంతులుగారిని తెలుగువారినగరమైన హైదరాబాదు నగర మేయర్ పదవికి నిలబడవలసిందనీ, విధానపరిషత్ అధ్యక్షులుగా పంతులుగారే ఉండవలెననీ రంగారెడ్డిగారు పట్టుపట్టి, వారిని ఆ రెండు పదవుల ఎన్నికకు నిల్చోమని వత్తిడిచేసి వారి విజయాన్ని రెడ్డిగారు సాధించారు. మొదటినుంచీ కొండా వెంకటరంగారెడ్డిగారంటే హనుమంతరావు పంతులుగారికి ప్రత్యేక అభిమానం ఉండేది. రెడ్డిగారి కార్యదక్షతను, ఋజువర్తనమును, వారి ఆలోచనకూ పైకి చెప్పేమాటకూ తేడా ఉండకపోవటాన్ని పంతులుగారు ఎంతగానో ప్రశంసిస్తూ ఉండేవారు. వీరి ఇద్దరిమైత్రి ఆదర్శప్రాయమైనది. అనన్యమైనది.

హనుమంతరావుగారి ప్రభావం ప్రముఖ కమ్యూనిస్టు నాయకులైన రావి నారాయణరెడ్డిగారిపై కొంత ఉంది. "పంతులుగారు ఎంత మితవాదు

లైనప్పటికీ, ఆంధ్రోద్యమాన్ని వారెంత తాబేలునడకతో నిర్వహించిన ప్పటికీ వారిపై నాకుగల సద్భావాన్ని చెప్పకుండా ఉండలేను" అంటూ రావి నారాయణరెడ్డిగారు "నాబోటి యువకులెందరో ఆయనవల్ల ప్రభా వితులై ఆంధ్రవాఙ్మయంతో పరిచయమేర్పరచుకున్నారు. హైస్కూ లులో ఉర్దూ రెండవ భాషగా చదివిన నేను పంతులుగారిచే ప్రభావితుడ నయి, కాలేజీకిరాగానే తెలుగు రెండవ భాషగా తీసుకున్నాను. తెలుగు ప్రబంధాలను చదివాను. తెలుగులో ఉపన్యాసాలివ్వడం నేర్చుకున్నాను. నాలాగే ఇంకెందరినో ప్రభావితులనుచేసిన పంతులుగారికి 'ఆంధ్రపితా మహ' అన్న బిరుదు ఆయనపట్ల సార్థకతను సంతరించుకొన్నది" అని వారి అనుభవాలు, జ్ఞాపకాలు అనే పుస్తకంలో ఆంధ్రమహాసభ ప్రకర ణాన్ని ముగిస్తూ రావినారాయణరెడ్డిగారు వ్రాశారు.


అట్లాగే ఉన్నత విద్యనభ్యసించి రచనచేస్తూ, సారస్వత రం గంలో పైకిరాగలవారినికూడా హనుమంతరావు పంతులుగారు తమకై తామే చొరవతీసుకొని ప్రోత్సహించారు. ఆంధ్రసారస్వత పరిషత్తుకు అధ్యక్షులుగా పనిచేసి, కొంతకాలం రాజ్యసభ సభ్యులుగాఉండి, ఉస్మా నియా విశ్వవిద్యాలయానికి ఆక్టింగ్ వైస్ ఛాన్సలర్‌గాకూడా పనిచేసి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులుగా నియమితులై, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్యరంగంలో ప్రముఖులుగా పరిగణింపబడేటువంటి దేవుల పల్లి రామానుజరావుగారు స్వీయచరిత్రవంటి వారిపుస్తకంలో ఇట్లా వ్రాశారు.* "నా మొట్టమొదటి వ్యాసము పత్రికలో ప్రకటితమైంది. ఎంతోసంతోషం కలిగింది. రెండు రోజుల తరువాత సన్నని దస్తూరీతో 'మిత్రవర్యా' అని సంబోధిస్తూ వ్రాసిన కార్డు ఒకటి అందింది. ఆ కార్డు

* 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' — దేవులపల్లి రామానుజరావు, సాహితీ బంధుబృందం—చైతన్యసాహితి, హనుమకొండ ప్రచురణ – 1981.


హైదరాబాదు రాష్ట్రంలోని సమస్త ప్రజాహితజీవనానికి, సాంస్కృతిక కార్యకలాపాలకు అన్నింటికీ మార్గదర్శకులైన మూలవిరాట్టు ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారు వ్రాసింది. వారి ప్రశంస నన్ను పరమానందభరితుణ్ణిచేసి, సాహిత్యరంగంలో కృషి చేయవలెననే సంకల్పము రేకెత్తించింది. నావ్యాసాన్ని హర్షిస్తూ హైదరాబాదు వచ్చినప్పుడు తమను తప్పక కలుసుకోవలసిందిగా పంతులుగారు నన్ను ఆ కార్డులో కోరినారు. అంతటి మహావ్యక్తి కోరికను ఆదేశంగా భావించి తరువాత కొన్ని వారాలకు హైదరాబాదువచ్చి వారిని సందర్శించి నాను. ఆనాడు వారు నాపట్లచూపిన ఆదరము, నాకు ఇచ్చిన ప్రోత్సాహము నా జీవితంలో ఎన్నడూ మరువజాలను. విద్యాధిక యువకులను ప్రజాసేవవైపు ఆకర్షించడం పంతులుగారి ఆశయాలలో ఒకటి. ఎందరో యువకులు వారి ప్రోత్సాహంతో దేశసేవ భాషాసేవ చేసినారు" అని వ్రాశారు. అంతేకాక "పంతులుగారు తెలంగాణా వైతాళికులు తరువాత తీవ్ర రాజకీయాలకు దూరంగా ఉన్నా చివరవరకు అన్ని జాతీయోద్యమాలను, సాంస్కృతికోద్యమాలను ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రోత్సహించి అండగా నిలిచిన దేశాభిమానులు" అని కూడా పంతులుగారిని రామానుజరావుగారు కీర్తించారు. ఇట్లా చెబుతూ పోవాలంటే ఎన్నో ఉదాహరణలున్నాయి. ఎక్కడ ప్రతిభ కన్పించినా నిండారా సంతోషించి ప్రోత్సహించిన సహృదయులు హనుమంతరావు పంతులుగారు.

ఆయనది నిండు విగ్రహం. ఆయన సౌమ్యభాషి. ఎంతటి మహానాయకుడో అంతటి నిగర్వి. సమదర్శి. నయబోధకుడు ఆరాటం లేని గుండెదిటవు కలవాడు. నిరంకుశత్వాన్ని ఎదిరించినా సౌమ్యంగా ఎదిరించారు. ఏ కార్యరంగంలోనైనా యువకులున్నారా లేరా అని చూచే వారు. ఆయన యువకులలో యువకుడు. యువతరంవారి నిర్మాణాత్మక కృషినిచూచి ఆనందించేవారు. ఉత్తమ అభిరుచులుగల సంస్కారి.


ఆయన కున్నటువంటి క్రమశిక్షణ అందరికీ ఆదర్శప్రాయమైనది. సమయపాలనలోనూ ఆయన ఇతరులకు ఒరవడి పెట్టారు. ప్రజాసంస్థల డబ్బును వినియోగించడంలో ఆయన చూపిన నీతి, నిగ్రహం గొప్పవి. ప్రతిపైసా లెక్కించి ఖర్చుపెట్టేవారు. ఒక ఆంధ్రమహాసభ జరిగిందంటే దానికి వచ్చిన ఆదాయం, అయిన వ్యయం లెక్కలు సక్రమంగా ఉండవలసిందే. ఆ విషయంలో ఆయన కఠినమైన నియమాలను పాటించేవారు. కాబట్టే ఆయన పట్టిందల్లా బంగారమైంది. ప్రజాసంస్థలకు సుస్థిరమైన పునాదులు వేయగలిగారు. ఓపినంతవరకూ దీపాలు వెలిగించారు. తెలంగాణా సర్వతోముఖ వికాసం, దాని సుఖశాంతులు కాంక్షించారు. అఖిలాంధ్రలోనేకాక దేశంలోకూడా ఒక విశిష్ట స్థానాన్ని అలంకరించి అందరి హృదయాలలోనూ చిరస్థాయిగా నిలిచిపోయిన మహావ్యక్తి. కాబట్టే తెలంగాణాకు చెందిన నవలా రచయిత దాశరథి రంగాచార్య తాము రచించిన 'చిల్లరదేవుళ్ళు' నవలలోని కథానాయకుడు పంతులుగారిని హైదరాబాదులో కలిసి మాట్లాడినట్లు రచించడమేగాక ఆ నవలను "నిజాం పరిపాలనలో ఊరూపేరూ మాసిన ఆంధ్రజాతికి ఒక తీరూ తెన్నూ కల్పించిన ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు పంతులుగారికి అంకితం" అని చెబుతూ వారికి తమ నవలను అంకితమిచ్చారు.



శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయంలో పంతులుగారి చిత్రపటావిష్కరణ.
ఎడమ నుంచి శ్రీ అవ్వా సత్యనారాయణరావు, డా॥ బి. రామరాజు,
శ్రీ యం. బలరామాచారి, పంతులుగారు, మాడపాటి సుకుమార్.



హైదరాబాదులో జరిగిన ఒక సాహిత్య సభలో ప్రసంగిస్తున్న శ్రీ మాడపాటి
హనుమంతరావు పంతులుగారు. చిత్రంలో కూర్చున్నవారిలో మధ్యన
డా॥ దాశరథి, చివర డా॥ బూర్గుల రామకృష్ణారావుగారు ఉన్నారు.



హైదరాబాదు నగరంలో ఒక సభలో ఎడమ ప్రక్కనుంచి శ్రీ గోపాలరావు ఎక్బోటే,
శ్రీ దేవులపల్లి రామానుజరావు, శ్రీ పంతులుగారు.




హైదరాబాదు నగరంలో ఒక సభలో ఉపన్యాసమిస్తున్న
శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారు. చిత్రంలో పంతులుగారు కూడా ఉన్నారు.



హైదరాబాదు నగరంలో ఒక సాహిత్య సభలో సమావిష్టులైన పంతులుగారు, ఆదిరాజు వీరభద్రరావుగారు, డా॥ చెన్నారెడ్డిగారు; ఉపన్యసిస్తున్నవారు శ్రీ పోతుకూచి సాంబశివరావు.



హైదరాబాద్ కేంద్ర సహకార సంఘం శ్రీ హనుమంతరావుగారికి "సహకార రత్న" అనే బిరుదు ప్రదానం చేస్తున్న సందర్భంలో తీసిన చిత్రం. ఇందులో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ, బేగం ఫజల్‌నవాజ్‌జంగ్, శ్రీ వి. హెచ్. దేశాయ్ ఉన్నారు.



హైదరాబాదు నగరంలో జరిగిన శ్రీ పొట్టి శ్రీరాములు స్మారక సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావుగారు. ఉపన్యాసమిస్తున్న వారు శ్రీ కొత్తూరు సీతయ్య గుప్తగారు.

# అస్తమయం

వృద్ధాప్యదశలో పంతులుగారు విశ్రాంతి తీసుకొంటూనే, ఎక్కడైనా సాంస్కృతిక సమావేశం జరిగితే శ్రమ అనుకోక వెళ్ళి, ఓపినంతమేరకు కార్యక్రమాలు చూచి, ప్రసంగాలు విని ఇంటికి చేరు కొనేవారు. క్రమేణా వారి ఆరోగ్యం క్షీణించింది. సుమారు ఒక సంవత్సర కాలం అస్వస్థులుగా ఉండి 1970 నవంబరు 11వ తేదీ సాయంకాలం 5-45 గ లకు హైదరాబాదు నగరంలో హనుమాన్ టేక్డీ లోని వారి స్వగృహం 'ఆంధ్రకుటీరం'లో తమ 86వ యేట కాలధర్మం చెందారు.

రాష్ట్ర గవర్నరు ఖండూభాయి దేశాయి, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, అధికార అనధికార ప్రముఖులు వారి ఇంటికి వెళ్ళి నివాళు లర్పించారు. నవంబరు 12వ తేదీన అంబరుపేట శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియలకు మునుపు రాష్ట్ర ప్రభుత్వం పక్షాన ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిగారు వారి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించి "తెలుగుజాతి సమైక్యతకు, తెలుగు భాషావికాసానికి, తెలుగుప్రజల అభ్యుదయానికి తన జీవితాన్ని అర్పణచేసిన ఆంధ్రపితామహుని మృతి తెలుగు ప్రజ లందరికీ ఎంతో సంతాప కారణమని" అన్నారు. హైదరాబాదు మునిసిపల్ కార్పొ రేషన్ పక్షాన, వివిధ విద్యా, సాంఘిక రాజకీయసంస్థల పక్షాన పుష్ప గుచ్ఛాలు ఉంచబడ్డవి. రాష్ట్రప్రభుత్వం వీరి మృతిపట్ల సంతాప సూచ కంగా నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యాసంస్థలకు సెలవు

ప్రకటించింది. పంతులుగారి మృతివల్ల అనిర్వచనీయమైన ఏదో వెలితి ఒకటి ఏర్పడిందని రాష్ట్రంలో అందరూ ఖిన్న హృదయులయ్యారు. ఆయన అంతిమయాత్ర మనస్సులను కదిలించివేసి కన్నీటిబొట్లతో తడిపి వేసిన ఒక గంభీరదృశ్యమనీ, జంటనగరాలు రెండూ కదిలివచ్చినట్లుగా ప్రజలు ఆ మహానాయకునికి శ్రద్ధాంజలి ఘటించారనీ ఒక పత్రికా విలేఖరి వ్రాశాడు. నందిగామతాలూకా పొకున్నూరు గ్రామం, వరంగలు, హైదరాబాదు, తెలంగాణా-సమస్తాంధ్రమూ ఆయన నిర్విరామ జీవితానికి ఆటపట్టులు. ఏమి ప్రజాహిత జీవనం! ఎంత బహుముఖ సేవ! లక్ష లాది ప్రజల అభ్యున్నతికోసం ఎటువంటి కృషి జరిగింది! ఆయన కన్ను మూయడంతో హైదరాబాదులో ఒక శకం ముగిసిపోయింది. చివరకు మిగిలింది ఆంధ్ర కుటీరం. అన్ని భాషల పత్రికలు తెలుగుల మేటిబిడ్డ అయిన ఆయనకు శ్రద్ధాభక్తులతో నివాళు లర్పించాయి. 'ఆంధ్ర పత్రిక' ఒక సంపాదకీయంలో ఆయన చేసిన కృషిని ప్రస్తావిస్తూ ఈ విధంగా జోహారు లర్పించింది: "ఆంధ్ర పితామహ మాడపాటి హను మంతరావుగారు ఇకలేరు. వారి అస్తమయంతో తెలుగుజాతి జీవితం లోనే ఒక తీరనిలోటు ఏర్పడినట్లయింది. తెలుగుజాతి సమైక్యతకు, తెలుగుప్రజల బహుముఖ అభ్యున్నతికి తన జీవితాన్ని వినియోగించి, ఆ కృషిలో తాను కనిన కలలు ఫలించడం చూచి సంతృప్తి చెందిన ధన్యజీవి. నిజాం నిరంకుశ పాలనలో భాషా ఉద్యమాలను, గ్రంథాల యోద్యమాన్ని నిర్మించి, వాటిద్వారా ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని రగుల్కొల్పడంలోనూ, గ్రంథాలయ భాషా ఉద్యమాలను ప్రజా ఉద్య మాలకు జోడించి సాహిత్య వికాసాన్ని స్వాతంత్ర్యపిపాసనూ ప్రజలలో పెంపొందించడంలోనూ మాడపాటివారు చేసినకృషి అద్వితీయం".

'ఆంధ్రభూమి' దినపత్రిక ఒక పెద్ద సంపాదకీయంలో "విలక్షణ భారతీయ సంస్కృతిని, అందులో అంతర్వాహిని అయిన ఆంధ్ర

సంస్కృతిని మేళవించి భాస్వంత జీవితాన్ని గడపిన సాత్త్వికమూర్తి మాడపాటి హనుమంతరావుగారు సఫల జీవనం గడిపారు. సంఘాన్ని ప్రాంతాన్ని జాగరితంచేసి, కలకాలం నిలిచే విజయాలను సాధించారు. తద్వారా దేశానికి అకలంక సేవచేశారు" అని వ్రాసింది. ఎందుకన్నారో సరిగా తెలియదు, వావిలాల గోపాలకృష్ణయ్యగారు ఆంధ్ర పితామహులు కాలధర్మం చెందినప్పుడు పత్రికలవారితో మాట్లాడుతూ "ఏడు శతాబ్దాల అనంతరం తెలుగుజాతికి ఒకజ్యోతిని చూపించిన మహనీయుడు అస్తం గతుడైనాడు" అన్నారు.

హనుమంతరావు పంతులుగారి కృషిని సమీక్షించవలెనంటే-వారు ఆస్తిఏమీ లేకపోయినా, తమ జీవనోపాధికి పాటుపడుతూ నిజాంరాష్ట్రం లోని ప్రజలలో జాగ్రదవస్థను తెచ్చారు. ముఖ్యంగా నిద్రాణమైన తెలంగాణాను మేల్కొల్పి నూతన చైతన్యాన్ని ప్రసాదించారు. నిజాం రాష్ట్ర ఆంధ్రులలో ముఖ్యంగా మాతృభాషాభిమానాన్ని రేకెత్తించారు. మొదట గ్రంథాలయోద్యమాన్ని చేపట్టి తెలంగాణాలో గ్రంథాలయాలు, పఠనాలయాలు విరివిగా నెలకొల్పబడేట్టు చేశారు. ఆంధ్రోద్యమాన్ని భాషా ఉద్యమంగా తీర్చిదిద్ది తెలంగాణా చరిత్రలో ఒక నూతనాధ్యాయాన్ని సృష్టించారు. నిజాం పరిపాలనలో ప్రజల ప్రాథమిక స్వత్వముల కొరకై దీక్షతో పోరాడారు. సాంఘిక సమస్యలను చేపట్టి సాంఘికోద్యమాన్ని ప్రవర్తింప జేశారు. సంఘసంస్కారానికి చేయూత నిచ్చి తెలంగాణా సమాజానికి అభ్యుదయ దృక్పథం కలిగించారు. స్త్రీ విద్యావ్యాప్తికి పాటు పడ్డారు. స్త్రీలలో చైతన్యం కలిగించి ఆంధ్రోద్యమంతో మహిళల ఉద్యమాన్ని జతపరచి, ప్రజాసేవలో స్త్రీలు ముందంజ వేసేట్టు చేశారు. వారిని ఆదరంతో, గౌరవంతోచూచి ప్రోత్సహించారు. యువకులలో ఉన్నతాశయాలను కలుగజేశారు. ప్రతిభా సామర్థ్యములుగల కార్యకర్తలను పైకి తెచ్చి, ఎందరో ప్రజాసేవకులను సృష్టించి, వారిచే నాయకత్వం నిర్వ

హింప జేశారు. తెలంగాణాకు నాయకత్వం కొరత లేకుండా ఎందరో ప్రజా సేవకులను సృష్టించి వారిని తీర్చిదిద్దారు. తెలుగు ప్రజలలో అన్ని కులసంఘాలకూ చేయూత ప్రోత్సాహము ఇచ్చి ఆయా కులాల వారు సాంఘికంగా పైకి రావడానికి తోడ్పడ్డారు. వీరి పరిశ్రమ, కృషి అన్ని కులముల, అన్ని వర్గముల పురోభివృద్ధికి కారణమైనది. వీరి ఆశీర్వాదము పొందని సంస్థ ఆనాటి హైదరాబాదులో లేదు. హైదరా బాదు వచ్చినవారికి 'ఆంధ్ర కుటీరం' దర్శించవలసిన పవిత్ర యాత్రా స్థలంగా ఉండేది. ప్రజాసేవకులకు మహోన్నతమైన ఆదర్శాలు ప్రసా దించారు. వీరు మితభాషి. కార్యవాది. కార్యసాధకులు. చేపట్టిన కార్యాన్ని అందరి సహకారంతో నిర్వహించడంలో దిట్ట అని నిరూపించు కున్నారు. ప్రజాసేవకై తమ జీవితం మొత్తాన్ని వినియోగించిన ధన్య జీవి. పలుకుబడి, అధికారం, గౌరవం, కీర్తిప్రతిష్ఠలు కాంక్షించక త్యాగశీలంతో, నిస్వార్థదృష్టితో, నియమబద్ధులై నిరంతరం ఆంధ్రాభ్యు దయానికై పాటుపడ్డారు. ఆంధ్రోద్యమమే వారి జీవితం.

నవ్యాంధ్ర నిర్మాతలలో మాడపాటి హనుమంతరావు పంతులు గారు తెలంగాణా వైతాళికుడుగా తేజోమూర్తియై చిరస్థాయిగా వెలుగొం దుతూ ఉంటారు.

స మా ప్తం

# అనుబంధము 1

## మాడపాటి హనుమంతరావు పంతులుగారి షష్టిపూర్తి సందర్భంలో ఆహ్వానసంఘంవారు సమర్పించిన సన్మానపత్రము

మహోదయా ! కాకతీయ చక్రవర్తులు అవక్రమమైన పరాక్రమముతోను, అమోఘమయిన ఆజ్ఞాశక్తితోను, శత్రు నిరాకరణ ధర్మపాలనా పూర్వకముగా ప్రజాసేవ గావించి మించిన శతాబ్దములలో మింట బెట్టిన దీపమువలె మెరిసిపోయిన ఈ రాష్ట్రము నేటి కైదారు శతాబ్దముల నుండి ఆంధ్ర సభ్యతను "మభ్యపెట్టి" మరచి అంధకార బంధురమై యున్నను ఆ "పార్థివ" తేజస్సు మరల మీ స్వరూపముతో నవతరించి ప్రశాంత ప్రగల్భమైన ప్రజ్ఞాశక్తిచే నిద్రాణ మయియున్న ప్రజానీకమునకు ప్రాణప్రబోధముల నొసంగి బ్రతుకుదెరువు చూపినది. ఈనాడు మీకృషి ఫలితముగా మన "తెలుగునాడు" మరల వెలుగునాడైనది. మీరు వెలిగించిన ఆంధ్రజ్యోతి అమరజ్యోతి యైనది. ఇట్టి మీకు భగవంతుడు చిరాయురున్నతిని ప్రసాదించుగాక !

నేతృ గుణాబ్ధీ ! కాపులేని మందవలె బెదరి చెదరియున్న ఆంధ్ర సమాజమును కూడగట్టి ప్రతిభా వ్యుత్పత్త్యభ్యాసములచే ప్రతికూల పరిస్థితులను తొలగించి క్రమశిక్షణా దక్షమయిన మార్గమున నడిపించుచు నాయక శిరోమణులై త్యాగశీలత్వము ప్రియవక్తృత్వము, ధీరత్వము, ఉచితజ్ఞతవంటి సహజగుణములను, నిరాడంబరత, సులభగమ్యతవంటి బాహ్యగుణములను ప్రదర్శించి ప్రజాసేవకులకు మహోన్నతములైన

ఆదర్శములను ప్రసాదించినారు. ఆంధ్రుల సంస్కృతి సభ్యతలు మరల వేళ్ళుపారి ఆకువేసి పుష్పించినవి. ఆంధ్రాభిమాన పరిమళములు అష్ట దిశలయందు వ్యాపించి ఆనంద వర్థకములైనవి.

ఆంధ్రోద్యమ విధాతా ! ఈ ప్రస్తుతాంధ్రమును ప్రబుద్ధాంధ్ర ముగా చేయుటకు మీరు నిర్మించిన యుద్యమమే ఆంధ్రోద్యమముగా రూపొందినది. ఆంధ్రుల సర్వతోముఖాభ్యుదయమే ఆంధ్రోద్యమమునకు పూర్ణస్వరూపము. మొదట గ్రంథాలయోద్యమమును చేపట్టి రాష్ట్రము నందంతటను గ్రంథాలయములను, పఠనాలయములను విరివిగా నెల కొల్పి ఆంధ్రోద్యమమును భాషోద్యమముగా తీర్చి తెలంగాణపు చరిత్రలో నూతనాధ్యాయమును కలిగించినారు. మీ యుద్యమ ప్రచారమునకు శ్రోతృవర్గమును సిద్ధపరచుకొని క్రమక్రమముగా ఆంధ్రుల సాంఘిక సమస్యలను పైకితెచ్చి వాటికి పరిష్కరణ మార్గము చూపుచు సంఘ సంస్కారమునకు పునాదులువైచి దానిని సాంఘికోద్యమముగా ప్రవ ర్తింపజేసి ప్రజాహృదయములను చూరగొని, ఉద్యమమును మరింత పుష్టివంతము గావించినారు. నిజాము ప్రభుత్వముతో ప్రజల ప్రాథమిక స్వత్వములకొరకై ప్రశాంత దీక్షతో పోరాడ సంకల్పించి ఆంధ్ర మహా సభను స్థాపించి నిరంతరముగా కృషి గావించి, ఆంధ్రోద్యమమునకు రాజకీయత్వరంజన మొసగి రాష్ట్రీయాంధ్రుల కెంతయు నున్నతిని సమకూర్చి పెట్టినారు. అవకాశము గల్పించుకొని స్త్రీ విద్యాప్రచారము నకు సంఘమున సగపాలైన సోదరీమణులలో చైతన్యము పోసి వారి ద్వారా కృషిని నిర్వహింప జేయుచు ఆంధ్రోద్యమమును మహిళోద్య మముతో జతపరచి సర్వాంగ సుందరము గావించినారు. నిజాంరాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్తులో ముఖ్యభూమికను ధరించి దానిని రాజ కీయములతో నెట్టి సంబంధములేకుండ దూరముగనుంచి ప్రజాసభ్యతను పోషించు నుద్దేశ్యముతో దానికి స్థయిర్య మొసగి ఆంధ్రోద్యమమును

వైజ్ఞానికోద్యమముగా దీర్చి ఆంధ్రజాతీయతకు సర్వాంగపుష్టిని చేకూర్చి నారు. ఇట్టి ఆంధ్రోద్యమపితామహులైన మీరు చిరాయురారోగ్యములతో వర్ధిల్లి ఇంకను మాకు మార్గదర్శకు లయ్యెదరుగాక.

కార్యకుశలా ! చేపట్టిన కార్యమును నిర్వహించుటలో మీరు వైచిన మార్గములు ఎల్లరకును అనుకరణీయములు. అభ్యుదయోపాయ ములు. ఆంధ్రోద్యమమును ఎల్లప్పటికిని ఏకనాయకముగా చేయక వెనుక నుండి ఉద్యమమునకు సూత్రధారులై ప్రతిభా సామర్థ్యములుగల కార్యకర్తలను ఏరి పైకిదెచ్చి వారిద్వారా నాయకత్వము నిర్వహింపజేసి ఇప్పటి కెందరినో ప్రజా సేవకులను సృష్టిచేయుట యందలి మీ నిర్మాణ శక్తి ప్రపంచమునకు ఆదర్శప్రాయము కాగలదు. మీరు ప్రత్యక్షము గాను, పరోక్షముగాను ఆంధ్రసంఘమందలి యెల్ల కుల సంఘములకును తోడుపడి మీ యుత్సాహ శీలము వారికి పంచియిచ్చి ఆయా సంఘములు చైతన్యవంతములై అభివృద్ధినందగా చూచి ఆనందవైశాల్యమును పొంద గలవారు మన రాష్ట్రమున మీరొకరే యనిన సాహసము కాగూడదు. మీతో ఏదో ఒక సంబంధములేని ప్రజాసంస్థ మన హైద్రాబాదులో లేదనినప్పుడు మీకృషిక్షేత్రమెంత సువిశాలమైనదో తెలియగలదు. మీ రాంధ్రోద్యమమును నిర్వహించిన తర్వాతనే రాష్ట్రీయులగు మహారాష్ట్ర కర్ణాటకులలో తదీయోద్యమములు ప్రారంభింపబడుటయు తత్సంస్థల యందు కూడ మీకు గౌరవస్థాన ముండుటయు చూడ మీ కార్య కుశల త్వము ఎంత నిగూఢ గంభీరమైనదో స్పష్టమగుచున్నది.

సహృదయవతంసా ! మీలో నిర్వ్యాజమయిన సహృదయత్వమే తలపెట్టిన కార్యముల విజయరహస్యమని సూక్ష్మదర్శకులకు గోచరింప గలదు. అదియే మాకిప్పటికిని ధ్యేయమగుచున్నది. తెలంగాణమున

కింత విశాలోన్నత గంభీరమయిన అభ్యుదయ కృషి గావించిన మీకు రాష్ట్రీయు లేమిచేసి మీ ఋణమును తీర్చగలరు? కారణజన్ములైన మీ జన్మదినము తమకు జాతీయోత్సవ దినముగా చేసికొని ప్రాచీన సాంప్రదాయ సిద్ధమయిన షష్టిపూర్తి రూపముతో మీకు వజ్రోత్సవమును గావించి తమకు కృతజ్ఞతను ప్రకటింప గోరుచున్నాము. మీరు భౌతికముగా వ్యక్తిరూపముతో మా నడుమ నున్నను, మహావ్యక్తులగుటచే ఆంధ్ర ప్రజాభ్యుదయ రూపముగా పరిణతి పొందుటయే ఈ ఉత్సవమునకు హేతువు. ఈ సందర్భమున "పత్రం పుష్పం ఫలం తోయ" మన్నట్లు మా హృదయపుష్ప క్షేమఫల ఆనందబాష్ప తోయం పురస్సరముగా ఈ సన్మానపత్రమును సమర్పించుకొని కృతకృత్యు లయ్యెదమని విన్నవించుచున్నాము".

# అనుబంధము 2

## హనుమంతరావు పంతులుగారి షష్టిపూర్తి సందర్భంలో లక్ష్మణరాయ పరిశోధకమండలి పక్షాన సమర్పింపబడిన సన్మానపత్రం

జయ విజయీభవ - దిగ్విజయీభవ

శ్రీ స్వస్తి సమధిగత పంచమహాశబ్ద మహామండలేశ్వర అసఫ్ జాహి వంశాభరణ శ్రీమన్మహబూబ్ అలీఖాన్ బహద్దరు పాదుషా కుమారతిలక ! లెఫ్టినంటు కర్నల్ ఫత్తేజంగు జి. సి. యస్. ఐ. జి. సి. బి. రాయల్ విక్టోరియా రత్నహారాలంకార! సార్వభౌమ ప్రభుత్వ పరమహితావతంస! సుల్తానుల్ ఉలూం శ్రీమదల్లా భక్తిభావరంజిత చిత్తసరోరుహ! శ్రీనిజాం ప్రాజ్య రాజ్యలక్ష్మీ నిజేశ్వర ! సుభట సంస్తుత్య నామాది ప్రశస్తి సహితులగు హెచ్. ఇ. హెచ్. నవాబు సర్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహద్దరువారు హైదరాబాదు మొదలి పట్టణంబుగా సుఖసంకథావినోదంబుల పృథ్వీరాజ్యంబు చేయుచుండగా.

స్వస్తి శ్రీ విజయాభ్యుదయ శాలివాహన శకవర్షంబులు ౧౮౬౭ అగు నేటి పార్థివనామ సంవత్సర మాఘశుద్ధ పంచమీ బుధవారము నాండు భాగ్యనగర నామాంతర హైద్రాబాదు పురవరంబున సకలాంధ్ర జనులు, సకలజాతీయులు ఆబాలగోపాలము కవి పండిత గాయక విద్వజ్జనులు పరివేష్టించి శ్రీ మన్మాడపాటి హనుమంతరాయామాత్య నాయకమణి షష్టిపూర్తి మహోత్సవ శుభసందర్భమున పేరోలగంబునం దుండగా.

సకల విద్యావినోద ! శాంతి ప్రియ వినయవిభూషణ ప్రజ్ఞా యుగంధర ఆంధ్రపితామహ మాడపాటి వంశ పయఃపారావారరాకా సుధాకర వెంకటప్పయామాత్య తనూభవ వేంకటసుబ్బమాంబా గర్భ శుక్తి ముక్తాఫల హనుమంతరాయామాత్యులకు శ్రీ లక్ష్మణరాయ పరిశోధకమండలి సభాసదులు ఆనంద కందళిత హృదయారవిందులయి సమర్పించుకొన్న అభినందన పత్రము ఏమనగా—

ఆంధ్రతిలకా ! భవదీయ సంకల్ప సందేశ సమాలోచన భాగ్యము పొంది శ్రీ లక్ష్మణరాయ పరిశోధకమండలి తెలంగాణపు చరిత్ర మాగాణమునందు కృషి సలిపినది. తమ ప్రతిభా విశేషమున తాళపత్ర గ్రంథములు గౌరవ పాత్రములయి విశిష్టతనుపొందినవి. శిలాశాసనములు ముక్తకంఠముతో ప్రాచీనాంధ్ర ప్రాభమును జాటినవి. ఆంధ్ర చరిత్రకు నూతన వికాసము కలిగినది.

ఆంధ్రమాన్యా ! భవదీయ కార్యనిరతి యోచనాబలము సహస్ర భానుమండల మరీచీ వీచికలతో వేయిదిక్కుల ప్రసరించి తెలుంగు రాష్ట్రమును ఎట్లు సంచలితముజేసి ప్రాచీనాంధ్ర చరిత్రాభిమానమును ఎట్లు ప్రజ్వలితము చేసెనో అట్టి చరిత్రాత్మక విషయమును శ్రీ లక్ష్మణరాయ పరిశోధకమండలి సభాసదులు కృతజ్ఞతాపూర్వకముగ స్మరించుచున్నారు.

ఆంధ్రరత్నా ! భవదీయ షష్టిపూర్తి మహోత్సవ మంగళ సందర్భమునందు శ్రీ లక్ష్మణరాయ పరిశోధకమండలి సభాసదులు ప్రేమాంజలులను తమకు సమర్పించుకొనుచున్నారు.

వేదోక్తం పరిపూర్ణమాయురస్తు
సమస్త సన్మంగళాని భవంతు.

# అనుబంధము 3

## ఆంధ్రపితామహ
## మాడపాటి హనుమంతరావు గారికి
## సమర్పించిన సన్మాన పత్రము

ప్రియమయిన మహాభాగా,

హైదరాబాదు నగరమునకు శాసనబద్ధమగు "కార్పరేషన్" పద గౌరవము లభించుట ఈ రాష్ట్ర చరిత్రలో నూతనాధ్యాయము. ఈ నూతనాధ్యాయమున ప్రప్రథమ "హైదరాబాదు మేయరు" పదవీవిరాజ మానులుగా తమరు వరణీయులయినందులకు మాకెంతో సంతోషము కలిగినది. వివిధ మతానుయాయులగు మా "నగరపితలు" తమరి ఏకగ్రీవముగా నెన్నుకొనుటలో జూపిన విచక్షణా శీలము ఎంతయు సంస్తుతి పాత్రమయి యున్నది. తమరు జనవంద్యులును జనప్రియు లును అనుట కీ యెన్నికయే ప్రబల తార్కాణము.

ఆంధ్ర నాయకాగ్రేసరు లగు తమకు "నగర పౌరావతంస" గౌరవము లభించుట భాగ్యనగరాంధ్ర జనుల గౌరవమును ఇనుమడి ప జేసినది. వయోవృద్ధులయి, శాంతికాములయి యింట నుండిన తమరు నగర పరిపాలనా భారమును వహించుట తమ స్వార్థ త్యాగమునకు మరియొక నిదర్శనముగా నున్నది. తమరు అర్థ శతాబ్ద కాలము పలు విధ రంగములందు దేశసేవా నిమగ్నులై ప్రకాశించి యున్నారు. ఈ దీర్ఘకాల కార్యక్రమమునందు మీకు బాసటగా నుండిన సత్యసంధత్వము,

శాంతి ప్రియత్వము, సౌజన్యశీలము, కార్యదక్షత, సహృదయత యీ నూతన కార్యరంగమున తమకు సంపూర్ణ -యమును కలిగించునని మేము విశ్వసించు చున్నాము.

హైదరాబాదు నగరము భారతదేశములో నాల్గవదిగను, ఆంధ్ర దేశములో మొదటిదిగను గణనకెక్కి యున్నది. అట్టి ఆంధ్ర నగర మునకు ఆంధ్ర పితామహులు ఆధిపత్యము వహించుట బంగారమునకు తావి యబ్బినట్టులైనది. మీ సత్పరిపాలనమున హైదరాబాదు నగరము మేలిబంతియై ఆరోగ్యానందములకు నిలయమై, శాంతి సౌఖ్యముల కాలవాలమయి, విద్యా వివేకములకు తావలమయి, మేటినగరమయి భాసిల్లు గాక !

తాము చేసిన ఘనకార్య పరంపరలో ఈ బాలికల ఉన్నత పాఠశాల మహోన్నత మయినది. ఈ పాఠశాల తమ యనుంగు బిడ్డ. ఈ ముద్దు బిడ్డను లాలించి, సాకి, విలాసవతిగా తీర్చి దిద్దిన యశో విశాలురు తమరు. ఈ విధముగా మాకత్యంత ప్రియులును పూజ్యు లును అయిన తమరు "మేయరు" పదవి నలంకరించుట మాకు అత్యా నంద సంధాయకమయినది. ఈ బాలికల ఉన్నత పాఠశాల పక్షమున ఈ సంతోష సమయమున మా హృదయ పూర్వకాభినందనములను సమర్పించుకొను చున్నాము. మా ప్రేమ గౌరవముల సూచకముగా మేము సమర్పించుకొను నీ అల్ప పారితోషికమును దయతో స్వీక రించుడు. తమకు ఆయురారోగ్య భాగ్యములను పరమేశ్వరుడనుగ్ర హించుగాక !

విధేయులు,

రాజా బహద్దరు వేంకట్రామారెడ్డి, ఒ. బి. ఇ. (అధ్యక్షుడు)
పాలక వర్గము, ఉపాధ్యాయ వర్గము.
బాలిక ఉన్నత పాఠశాల, నారాయణగూడ, హైదరాబాదు

# అనుబంధము 4

## ఆంధ్రపితామహ, పద్మభూషణ,
## డాక్టరు మాడపాటి హనుమంతరావు పంతులు గారికి
## వి న యాం జ లి

తెలంగాణాలో మీరు నాటిన ఆంధ్రోద్యమ బీజము ప్రవర్ధమానమై శాఖోప శాఖలుగా విస్తరిల్లి ఫలించింది. తెలంగాణపు ప్రజలు మీ పిలుపును విని మేల్కొన్నారు. మీరు చూపించిన వెలుగుజాడల నడచారు, గమ్యస్థానాన్ని క్షేమంగా చేరుకొన్నారు. మీ ఉపకృతిని సదా స్మరించు కొంటున్నారు.

తెలంగాణపు ప్రజానీకము ప్రేమతో ఆంధ్ర పితామహులని మిమ్ము పిలుచుకొన్నారు. నాటికి నేడు యావదాంధ్రావనికి పెద్దల సభకు అధ్యక్షులుకాగా, ఆ పేరు సార్థకమైంది. రాజధానీ నగరపు తొలి మేయరుగాను, ఆంధ్ర ప్రదేశ్ పెద్దల సభ ప్రథమాధ్యక్షులు గాను, మీకు జరిగిన సన్మానము తెలంగాణము తన సన్మానంగా భావిస్తున్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయము మీకిచ్చిన డాక్టరేట్ పట్టము ప్రజా స్వామ్యమునకు గుర్తింపుగా భావిస్తున్నాము.

సూర్యాపేట మీ బాల్యక్రీడలకు మీ ప్రేమను చూరగొన్నది. మీ పిలుపు నందుకొని అభ్యుదయ రంగంలో ముందుకురికి మీ మెప్పును సంపాదించింది. సూర్యాపేటకు మీకు గల సంబంధము అవినాభావమైంది.

సూర్యాపేటకు ఆదిసంస్థ ఆంధ్ర విజ్ఞాన ప్రకాశినీ గ్రంథ నిలయము—జ్ఞాన తేజస్సును విరజిమ్ముటయేగాక ప్రజాస్వామ్య శంఖా రావాన్ని ఎలుగెత్తి చేసి ప్రతీప శక్తులను భయభ్రాంతులను జేసింది. దేశారాధనకు సహజమైన లేమిని అనుభవిస్తున్నది. ఎన్నాళ్లకో చిన్న ఇంటిని కట్టుకొని ఈనాడు గృహప్రవేశాన్ని జరుపుకొంటున్నది ఈ శుభ సమయంలో పితృదేవులయిన మీకు వినమ్ర పూర్వకంగా నమస్సుల నర్పిస్తున్నది. కలకాలం ప్రజలను సేవించి జ్ఞానదానాన్ని ఇతోధికంగా చేయగల శక్తి కలుగవలెనని ఆశీర్వదించమని అర్థిస్తున్నది.

ఇట్లు
ఆంధ్ర విజ్ఞాన ప్రకాశినీ గ్రంథనిలయ కార్యనిర్వాహక వర్గము
సూర్యాపేట

# అనుబంధం 5

## శ్రీ గౌతమీగ్రంథాలయము, రాజమహేంద్రవరమువారు ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్ అధ్యక్షులు 'ఆంధ్రపితామహ' 'పద్మభూషణ్' శ్రీ మాడపాటి హనుమంతరావు గారికి సమర్పించు

## స్వాగత పత్రము

ఆంధ్రపితామహా! పావన గౌతమీ స్రవంతి ప్రాంగణమున యున్న చరిత్రాత్మక పట్టణమైన రాజమహేంద్రవరములో అమూల్య ప్రాచీన గ్రంథములతో అలరారుచు, దేశవ్యాప్త ప్రశస్తిగల ఈ పురాతన గ్రంథాలయము తరపున మిమ్ములను ఆహ్వానించు భాగ్యము కలిగినందులకు మేమెంతయు ఆనందించు చున్నాము.

గ్రంథాలయోద్యమ పితామహా!! ఈ గ్రంథాలయము 1898వ, సంవత్సరములో స్థాపింపబడి కందుకూరి వీరేశలింగం పంతులు, వడ్డాది సుబ్బారాయుడు, చిలకమర్తి లక్ష్మీనరసింహం— 'కవిసార్వభౌమ' శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి ఆదిగా గల మహా పండితుల ఆదరాభిమానములతోను; 'మధురకవి' శ్రీ నాళము కృష్ణారావు, కంచుమర్తి సీతారామచంద్రరావు, బోడపాటి సత్యనారాయణ, అడివికొలను లక్ష్మీనారాయణ, శ్రీ అడివి శంకరరావు మొదలగు గ్రంథాలయోద్యమ సేవకుల అవిరామ కృషి ఫలితముగను, ఈనాడు సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల, హిందీ మొదలగు వివిధ భాషలలో సుమారు 60,000 గ్రంథములతో అన్ని తరగతుల ప్రజలకు అందుబాటులో యున్నది.

సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ సంవిధాతా !!! తాము తెలంగాణమున నిజాం ప్రభుత్వ కాలమున విజ్ఞానవ్యాప్తికై గ్రామ గ్రామముల గ్రంథాలయముల స్థాపించియు, తెలుగు భాషా వ్యాప్తికై బాల బాలికల పాఠశాలల నెలకొల్పియు, సాహిత్య రంగంలో గ్రంథముల ద్వారా తమస్వీయ రచనలేగాక అనేక అమూల్య గ్రంథముల ప్రచురించియు సాంస్కృతిక పునరుజ్జీవనమునకు సర్వతోముఖముగ ఒనర్చిన సేవను ఆంధ్రదేశము ఎన్నటికిని మరువజాలదు. భాషోద్ధారకులగు మిమ్ములను ఆహ్వానించు భాగ్యము కలిగి నందులకు గర్వించుచున్నాము.

సౌజన్యమూర్తీ !!!! ఈ గౌతమీ గ్రంథాలయము అమూల్య గ్రంథ సంపన్నయైనను, ఆర్థికముగ అనేక ఇబ్బందులకు లోనగుచున్నదని తెలుప చింతించు చున్నాము. మన రాష్ట్ర ప్రభుత్వము ఇటీవల చేసిన పౌర గ్రంథాలయ శాసనము వలన ఇట్టి ప్రాచీన ప్రజా గ్రంథాలయములకు ఎట్టి సహాయము లభింపజాలని పరిస్థితి ఏర్పడినది. గ్రంథాలయ నిర్వహణలో అనుభవనీయులగు తమకు నిర్వహణలో గల సాధక బాధకములు సువిదితములేగదా ! గావున తమవంటి గ్రంథాల యోద్యమాభిమానుల సహాయముతో ప్రభుత్వమునుండి ఆర్థిక సహాయమును పొందు అవకాశమును కలుగజేయ గోరుచున్నాము.

మీరు దయతో ఈ గ్రంథాలయమునకు విచ్చేసినందులకు మా కృతజ్ఞత.

ఇట్లు

శ్రీ గౌతమీ గ్రంథాలయ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు,

రాజమహేంద్రవరము

30 నవంబరు, 1960.

# అనుబంధం 6

## ఉస్మానియా విశ్వవిద్యాలయం
## మాడపాటి హనుమంతరావు పంతులుగారికి
## డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవ పట్టా
## ప్రదానం చేసిన సందర్భంగా
## విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు
## డా॥ ఎస్. భగవంతంగారు చేసిన ప్రశంస

### CITATION

On the occasion of the Convocation of the Osmania University held on 4–11–1956, Dr. S. Bhagavantham, Vice Chancellor of the Osmania University read the following citation :

*"Mr. Chancellor,*

I have the honour to present to you, for the conferment of the Degree of Doctor of Literature, Honoris Casusa, Shri Madapati Hanumantha Rao

Shri Madapati Hanumantha Rao, born in 1885, is popularly known as Andhra Pitamaha. Even in his student days, when he was at Hanumkonda, Shri Hanumantha Rao was attracted to the literary and social reform movements. In those days, political restrictions of a decaying bureaucracy were so numerous and tight that even such venues were all closed. Astute observer as he was, he could see that creating love for one's own literature and advancing the library movement were the

only channels left to him to work through for attaining the ideal of self-government. The Telugu Library at Hanumkonda and later on the Sri Krishna Deva Raya Library at Hyderabad were practically his creations. Shri Hanumantha Rao used these institutions to expand his early activities and these institutions used him as a pillar of strength around which to grow.

Gradually he widened the field of his beneficial activity and started work to obtain freedom for the people of Hyderabad as a whole. Many were the institutions which he brought into being and nurtured. On the political side, the Nizam Rashtra Andhra Maha Sabha was the pinnacle of his activities. On the educational side, the Raja Bahadur Venkata Rama Reddy Women's College has a great future and will be a standing monument of his patient and laborious work. For nearly five decades, Shri Hanumantha Rao has been the guide, friend and philosopher to the people of Hyderabad, be they Telugus, Maharashtrians or Kannadigas.

Shri Hanumantha Rao, the man of letters, is also a well known figure. He is a very able and persuasive speaker both in Telugu and Urdu. He writes with great ease and clarity of thought in both these languages. In the history of Telugu literature, he is counted as one of the originators of the short story. Several newspapers of Hyderabad owe much to him. The Telugu pathrika, Nilagiri, Golkonda, Sujatha–were all adorned by his writings.

He was elected to the Mayoralty of Hyderabad for three consecutive terms between 1950–1953. On January 26, 1955, the President of India conferred on him the title of "Padma Bhushan" in recognition of his long and meritorious services. He is a life member of

our Śenate appointed as such by the Chancellor in recognition of the eminent services rendered by him to education and has been a member of the University Council for some years now. Uncorruptability in public life is the banner of his political career and selflessness is his motto.

Thus, Mr. Chancellor, I have, in presenting Shri Madapati Hanumantha Rao, the honour of presenting the grand old man of Hyderabad who has always been en example to us of plain living and high thinking and who at all times gave everything to others and got nothing from them for himself. I pray now that at this Convocation assembled, the Degree of Doctor of Literature; Honoris Casusa, be conferred on Shri Madapati Hanumantha Rao."

4-11-1956.